# ప్రాణానికి ప్రాణం

నవల

- కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: ౧౨౬

కౌముది మాసపత్రికలో

జనవరి 2019 సంచిక నుంచి నవంబర్ 2019 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

KOUMUDI

# (ప్రారంభం)

**ఎందుకు మెలుకువ** వచ్చిందో తనకే తెలియదు. ఎక్కడో ఏదో చప్పుడయ్యుండాలి. ఏ కిటికీ రెక్కో కొట్టుకుని ఉండాలి. కుమార్ కళ్ళు నలుపుకుని, మంచం పక్కన బల్లమీద వున్న చేతి గడియారం చూశాడు. ఎనిమిది గంటలయింది. రాత్రా? పగలా? ఏమో!

పక్కకి తిరిగాడు నజీమ్ వైపు. నున్నని గులాబీరంగు చెంపలు, మొనతేలిన గెడ్డం, ఆ గెడ్డం మీద చిన్నసొట్ట, ఫ్యాన్ గాలికి చెదిరి చెదిరి మొహాన్నంతా వెతుకుతున్న కురులు. విసినకర్రల్లా వున్న కనురెప్పలు, బంగారం పూసినట్టున్న వొంటిరంగు, ఆ వొంటి వొంపులు. రాత్రయితేనేం, పగలయితేనేం నజీమ్ పక్కనుంటే ఊపిరి పీల్చుకునేందుకే వ్యవధి వుండదు తనకి.

చప్పుడు చెయ్యకుండా మంచం మీదనించి లేచాడు కుమార్. అడుగులో అడుగు వేసుకుంటూ తలుపు వరకూ వెళ్ళి ఒకసారి వెనక్కి తిరిగాడు.

"కుమార్!" కళ్ళు తెరవకుండానే పిలిచింది నజీమ్.

"ఆఁ"

"ఎక్కడికి?"

"భోజనం తీసుకువస్తాను ఆలస్యమయితే హోటలు మూసేస్తారు. ఆకలి వేస్తోంది."

"ఆకలా? నన్ను తినెయ్యి" అన్నది చేతులు జాపి.

అంతే ఒక్క గంతులో మంచం చేరుకున్నాడు కుమార్.

"నిన్ను తింటే ఆకలి తీరదు సరికదా యింకా ఎక్కువ అవుతుంది" అన్నాడు.

"అయితే తింటూనే వుండు" అంటూ అతని మెడచుట్టూ చేతులు వేసి తనమీదకి లాక్కున్నది.

ఆమె పెదిమల్లో తీపి చేతుల్లో హాయి తప్ప యింకేమీ తెలియవు అతనికి. చాలాసేపటి తర్వాత ఎప్పుడో లేచి చప్పుడు చెయ్యకుండా తలుపువైపు వెళ్ళాడు.

కేరియర్ పట్టుకుని హోటలుకి వెళ్తున్నాడు కుమార్. చల్లని గాలి కత్తిలా కోసేస్తోంది. అక్కడక్కడా దూరంగా మినుకు మినుకుమంటున్నాయి దీపాలు.

ఎన్ని జన్మలకిందో, ఎన్ని జన్మలనించో చేసుకున్న పుణ్యం వల్లే నజీమ్ అందమైనదీ, అంత చదువుకున్నదీ, అంత మంచిదీ ఒక సామాన్యుడు అయిన తనని ప్రేమించడమేమిటి? అందుకే ఎవరు ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఎదురు తిరిగాడు తను.

"కుమార్! ఇలారా" అని పిలిచాడు తన తండ్రి శివరాం. తనకి తెలుసు తండ్రి ఏం మాట్లాడతాడో. వెళ్ళి ఎదురుగా కూర్చున్నాడు.

"ఎవరో తురకమ్మాయితో కలిసి తిరుగుతున్నావుట. నిజమేనా?" అడిగాడు తండ్రి.

"పేరు నజీమ్" అన్నాడు తను.

"పేరు ఏదైతేనేం? మన మతం కాదు. పిచ్చి పని మానెయ్యి" శివరాం బల్లమీద కాయితాలు సర్దుతున్నాడు.

"ఏమిటి మానెయ్యాలి?" అడిగాడు తను.

"ఆ తురకమ్మాయితో జల్సాగా తిరగవద్దన్నాను. మంచిది కాదు."

"నజీమ్ అంటే నాకు ప్రాణం. పెళ్ళి చేసుకోవాలి అనుకుంటున్నాను" అన్నాడు తను.

శివరాం కొడుకు కళ్ళల్లోకి చూశాడు.

"వ్యవహారం చాలావరకూ వచ్చిందన్నమాట. కుమార్! మంచిగా చెపుతున్నాను విను. నాకు నువ్వు ఒక్కడివే. ప్రాణానికి ప్రాణంగా చూసుకుంటున్నాను. నువ్వు నీ బతుకు నాశనం చేసుకుంటూ వుంటే చూస్తూ నేను వూరుకోలేను" అన్నాడు శివరాం ఒక్క నిట్టూర్పు వొదిలి.

"నాశనమా?" అని నవ్వి "నజీమ్‌ని పెళ్ళి చేసుకుంటే నా బతుక్కి తోరణం కట్టినట్లుంటుంది" అన్నాడు తను.

"కవిత్వం వొద్దు. నేను ప్రాక్టికల్ మనిషిని. ప్రేమ అనేది ఒక పిచ్చి. పెళ్ళిక్కావల్సింది ప్రేమకాదు. పిల్లల్ని కని, పెంచి పెద్దవాళ్ళని చేసి సమాజంలో కలిసి బతకడానికి ప్రేమ కాదురా కావలసింది అనుకూలత, అన్యోన్యత, అనురాగం."

"అనుకూలత, అన్యోన్యత ప్రేమ వుంటేనే వస్తాయి నాన్నా!"

"నాన్సెన్స్. నీతో వాదిస్తూ కూర్చోడానికి నాకు టైం లేదు. పిచ్చివేషాలు కట్టిపెట్టు అంతే."

"సారీ నాన్నా! ఈ నెల 22వ తేదీన నజీమ్, నేనూ పెళ్ళి చేసుకుంటున్నాము."

"ఏమిటి? నిజంగానా?"

"అవును. 22వ తేదీ పొద్దున్న 9గంటలకి రిజిస్ట్రార్ ఆఫీసులో నువ్వూ, అమ్మా వచ్చి మా యిద్దర్నీ ఆశీర్వదిస్తే సంతోషిస్తాము."

శివరాం నిప్పులు కక్కుతూ చూశాడు కొడుకుని.

"నువ్వు నిజంగా ఆ పని చేస్తే నువ్వు మళ్ళీ యీ యింటికి రానవసరంలేదు. ఒక తురకపిల్ల యీ యింటికి కోడలుగా రావడం నేనుగాని, మీ అమ్మగానీ భరించలేము. రిజిస్ట్రార్ ఆఫీస్‌నించి తిన్నగా నువ్వు ఆ తురక కొంపకే వెళ్ళవచ్చు" అన్నాడు తండ్రి.

తను జవాబు చెప్పలేదు.

22వ తారీకున తనకీ, నజీమ్‌కీ పెళ్ళయింది రిజిస్ట్రార్ ఆఫీసులో, అక్కడినుంచి తిన్నగా రైలుస్టేషన్‌కి వెళ్ళి, యిక్కడికి ఊటీకి వచ్చేశారు హనీమూన్‌కి.

వారం రోజులైందేమో లేక రెండువారాలు గడిచాయో. నజీమ్ చేతుల్లో వుండగా ఊపిరి తీసుకోవడానికే వ్యవధి లేనప్పుడు కేలండరు ఎక్కడ చూస్తాడు తను.

జరిగినవన్నీ జ్ఞాపకం చేసుకుంటూ, కుమార్ టిఫిన్ కారియర్ తీసుకుని చకచకా నడుస్తున్నాడు. నిజానికి అతనికి పరిగెత్తాలనుంది. ఒక చేతినించి మరో చేతికి కారియర్ మార్చుకుంటూ ఏవో, ఏవో అనుభూతులు నెమరు వేసుకుంటూ కాటేజి చేరుకున్నాడు. కారియర్ కింద పెట్టి జేబులోంచి తాళం చెవి బయటికి తీశాడు. తలుపుకి బిగించి వుంది తాళం. తలుపుమీద చెయ్యివేసి తాళం చెవి పెట్టబోతున్నాడు. తలుపు కొద్దిగా లోపలికి తెరుచుకుంది. తనకి తాళం వేసినట్టే జ్ఞాపకం. కారియర్ తీసుకుని లోపలికి వెళ్ళాడు. పడకగది తలుపు తెరిచేవుంది.

రెండు చేతులూ చెరొకపక్కకీ జాపి వెల్లకిలా పడుకునున్నది నజీమ్. ఒక నిముషం పాటు ఆమెనే తదేకంగా చూస్తూ నిలబడిపోయాడు. ఏమిటీ నిశ్శబ్దం. గాలే ఆగిపోయినట్లు, వింతగా వుంది. ప్రపంచంలో చైతన్యమే ఆగిపోయినట్లుంది తనకి.

"నజీమ్" పిలిచాడు.

ఎంత మొద్దు నిద్రో! పలకదేం.

"నజీమ్" ఇంకా కొంచెం గట్టిగా పిలిచాడు.

ఊ! అనదేం? కళ్ళు తెరవదేం? ఏదో పెద్ద కెరటంలా పైకి లేచి క్షణంలో కిందపడే ఆ వక్షస్థలం కదలదేం? ఒక్క పరుగున మంచం చేరుకున్నాడు. "నజీమ్" అంటూ కేకవేస్తూ, రెండు చేతుల్తో ఆమె భుజాల్ని పట్టుకుని పైకి లేవతీసి కావలించుకుని "నజీమ్ నజీమ్ నేను ... నేను నిన్ను పిలుస్తున్నాను. మాట్లాడవేం?" అంటూ ఆమె వీపు నిమురుతున్నాడు. వేళ్ళకి కాస్త వెచ్చగా, జిగటగా ఏదో తగిలింది. ఉలిక్కిపడి వేళ్ళు చూసుకున్నాడు. ఎర్రగా వున్నాయి. మె భుజం మీదనించి వొంగి పక్కకి చూశాడు. రక్తపు మడుగు. బొమ్మని తిప్పినట్టు ఆమెని తిప్పి వీపు చూశాడు. వీపు మీద పెద్ద గాయం. రక్తం యింకా కారుతోంది.

"నజీమ్! ఏమయింది? చెప్పు, నాతో మాట్లాడు" చెయ్యిపట్టుకుని లాగుతాడు, భుజం పట్టుకుని కుదుపుతాడు. గెడ్డం పట్టుకుని బుజ్జగిస్తాడు. నజీమ్ పలకలేదు.

"ఎందుకు? నిన్ను వొదిలి వెళ్ళానని కోపమా? అందుకే మాట్లాడవా?" ప్రాధేయపడతాడు. తను చచ్చిపోతానని బెదిరిస్తాడు. అయినా నజీమ్ పలకదు, ఉలకదు.

ఏడుస్తున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు, ఆమె గుండెలమీద తలవాల్చి. ఆలోచించకుండానే తెలిసిపోయింది అతనికి ఇక నజీమ్ కళ్ళు తెరవదనీ, నజీమ్ ఇక తనకి లేదనీ, నజీమ్ చచ్చిపోయిందనీ.

ఒక రాత్రివేళ ఎప్పుడో అతనికి మెలుకువ వచ్చింది. గుండె బరువుగా వుంది వెంటనే ఏదీ జ్ఞాపకం రాలేదు. ఆలోచనలు, ఆలోచనల్లోంచి అనుభూతులు గందరగోళంగా, చిందరవందరగా తిరుగుతున్నాయి మనసులో.

నజీమ్ శవాన్ని చూస్తూ కూర్చున్నాడు. గలగలమని నవ్వే ఆమె నవ్వు. ఆమె వేడి ఊపిరి, ఆమె వేళ్ళ స్పర్శ, ఆమె కళ్ళల్లో కాంతి, ఆమెతో గడిపిన దివ్యమైన రోజులు, తమ ప్రేమని శంకించి మతం పేరిట, కులం పేరిట తననీ, నజీమ్‌నీ విడదీయటానికి ప్రయత్నించిన సంకుచితుల మాటలు అవన్నీ జ్ఞాపకం వస్తున్నాయి అతనికి.

నజీమ్ చచ్చిపోయింది. చచ్చిపోలేదు. ఎవరో చంపేశారు. నజీమ్‌ని ఎవరో చంపేశారని ఎవరికయినా చెప్పాలి. చెప్పి తీరాలి. కానీ కదలలేడు. రాతిబొమ్మలా అయిపోయాడు.

## 2

దాదాపు ఆరునెలల క్రితం తనకీ, నజీమ్‌కీ స్నేహం అయింది. అదీ పార్కులో. తను చేస్తున్న పరిశోధన పూర్తి అయింది. కాయితాలు అధికారులకి యిచ్చేశాడు. మనస్సు తేలికపడింది. సాయంకాలం పార్కులో తిరుగుతున్నాడు. తిరిగి తిరిగి సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు. చిన్నకేక వినపడింది. ఉలిక్కిపడి తలెత్తి చూశాడు. ఒక అందమైన అమ్మాయి నేలమీద, మోకాళ్ళమీద వొంగి బాధపడుతోంది.

"ఏమైంది?" అంటూ దగ్గరికి వెళ్ళాడు.

"ఏమీలేదు. కాలు మడతపడింది" అన్నది ఆమె.

"నిలుచోలేరా?" అడిగాడు.

"కాలు ఆనించలేకుండా వున్నాను" అన్నది. తను చెయ్యి అందించి, సిమెంటు బెంచీమీదకి తీసుకువచ్చాడు.

"ఏ కాలు? చూపించండి" అన్నాడు.

"ఒద్దు. అదే పోతుంది" సిగ్గుపడుతోంది ఆమె.

"ఫర్వాలేదు. బెణికి వుంటుంది. మసాజ్ చేస్తే పోతుంది" అంటూ ఆమె పాదానికి వున్న జరీచెప్పు తీసేశాడు. పువ్వులా వుంది ఆమె పాదం. లేతగా, పల్చగా వుంది. తన రెండు అరచేతుల మధ్య ఆమె పాదాన్ని పట్టుకుని నిమురుతూ వుంటే తనలో ఎక్కడెక్కడో, ఏవేవో కొత్తకొత్త రాగాలు పలుకుతున్నాయి.

"మీ పేరు?"

"నజీమ్" చెప్పింది.

"నా పేరు కుమార్"

"థాంక్ యు. తగ్గింది" అంటూ పాదం కిందపెట్టింది. అదీ వాళ్ళ మొదటి పరిచయం. ఆ మొదటి కలయికలోనే తన గుండె ఆమెకి ఇచ్చేశాడు. ఆమె కళ్ళల్లో ఆప్యాయత, ఆమె పెదిమలమీది చిరునవ్వు, ఆమె మాటల్లో ఆదరణ బట్టి తనమీద ఆమెకి ఆకర్షణ ఏర్పడింది అని గ్రహించాడు. ఆ తర్వాత మళ్ళీ మర్నాడు అదేచోట కలుసుకున్నారు ఆ మర్నాడూ అంతే. రెండురోజుల తర్వాత చెప్పాడు నజీమ్‌కి.. ఆమె అంటే తనకి పిచ్చి అనీ, తనకి ఆమె ప్రాణం అనీ. ఆమె సిగ్గుతో తలవంచుకుంది. "ఆ మొదటిరోజునే నా గుండెనీ, నా సర్వస్వాన్నీ నీకు ఇచ్చేశాను" అన్నది.

ఇద్దరి మతాలూ వేరు. పెద్దల అభ్యంతరాలుంటాయని తెలుసు. ఆ అభ్యంతరాలు తమ ప్రేమకి అంతరాయం కలిగించకూడదని నిశ్చయించుకున్నారు. ప్రపంచమంతా ఏకమైనా, ఎవరు ఏమన్నా, ఎన్ని కష్టాలు కలిగినా పెళ్ళిచేసుకోవాలనీ, జీవితాలని పంచుకోవాలనీ నిశ్చయించుకున్నారు. అనుకున్నట్టే జరిగింది. ఒకరోజు పార్కులోంచి, చీకటి పడుతుండగా నజీమ్, తనూ బయలుదేరారు. నజీమ్‌ని వీధి చివర దిగబెట్టి తను వెనక్కి తిరిగాడు. వెనకనించి ఎవడో తన షర్టుకాలరు పట్టుకుని "ఎవ్వడ్రా నువ్వు?" అడిగాడు పొగరుగా.

దాదాపు తనంత పొడుగూ, తనంత బలంగానూ వున్నాడు. తన వయస్సే. అతని చెయ్యి ఒక్క దులుపు, "నువ్వు ఎవడివిరా?" ఎదురు ప్రశ్న వేశాడు కుమార్.

"నీకు బతకాలని వుంటే మళ్ళీ నా చెల్లెలు నజీమ్‌తో మాట్లాడక. ఎముకలు విరగకొట్టేస్తాను" అతను నజీమ్ అన్న సులేమాన్. అతను నజీమ్ అన్నే కాకపోతే ఎవరి ఎముకలు విరిగేవో అప్పుడే తేల్చుకునేవాడు "నజీమ్ అంటే నాకు చాలా యిష్టం. మేము పెళ్ళి చేసుకుంటాం" కుమార్ వాక్యం పూర్తి చేయకముందే "నోరుముయ్యి. పళ్ళు ఊడగొడతాను" బెదరించాడు సులేమాన్. అతనితో యింక మాట్లాడి ప్రయోజనం లేదని తను వెళ్ళిపోయాడు.

మరికొన్ని రోజుల తర్వాత ఒక సాయంకాలం "మా నాన్నగారికి చెప్పాను. నీతో ఒకసారి మాట్లాడాలిట. నిన్ను రమ్మన్నారు" అన్నది నజీమ్ కుమార్‌తో.

"ఎప్పుడు రమ్మన్నారు?" అడిగాడు కుమార్.

"ఇప్పుడే రా! నాన్నగారు తీరికగా వుంటారు" అన్నది నజీమ్. జంకు బెంకు లేకుండా వెళ్ళాడు ఆమె ఇంటికి.

అది చాలా పెద్ద ఇల్లు. శ్రీమంతులని లోపల అడుగుపెట్టగానే తెలిసింది. తివాసీలూ, సోఫాలూ, బల్లలూ అన్నీ చాలా ఖరీదైనవి.

"కూర్చో, నాన్నగారికి చెప్పి వస్తాను" అని నజీమ్ లోపల గదిలోకి వెళ్ళింది. అయిదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చి "రా" అన్నది. కూడా వెళ్ళాడు.

నజీమ్ తండ్రి షేక్ హ్యాండ్ యిచ్చి "గ్లాడ్ టు మీట్ యూ. కూర్చోండి" అన్నాడు. భారీమనిషి, ఎర్రగా వున్నాడు. విశాలమైన నుదురు, తీక్షణమైన చూపు.

"కాఫీ, టీ, ఏం తాగుతావు?" అడిగాడు నజీమ్ తండ్రి హుస్సేన్.

"ఏదయినా సరే" చెప్పాడు కుమార్.

"నజీమ్! నువ్వు వెళ్ళి రెండు కప్పుల టీ పంపించు" అని కుర్చీలోంచి లేచి పచార్లు చేయడం ప్రారంభించాడు హుస్సేన్. నౌఖరు రెండు కప్పుల టీ తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు. హుస్సేన్ ఒక కప్పు కుమార్‌కి అందించి తను ఒక కప్పు తీసుకుని టీ చప్పరిస్తూ. "మీ నాన్నగారు ఏం చేస్తుంటారు?"

అడిగాడు.

"అడ్వకేట్"

"మీ కులం?"

"బ్రాహ్మణులం."

"స్ట్రిక్ట్ వెజిటేరియన్లా?"

"అవును."

"కుమార్! నజీమ్ చెప్పింది మీ విషయం. మీ యిద్దరూ ప్రేమించుకున్నారనీ, పెళ్ళిచేసుకోవడానికి నిశ్చయించుకున్నారనీ. ప్రేమ అనేది ఒక ఆవేశం. ఆవేశం తగ్గిన తరవాత జాతి మత విబేధాల సంఘర్షణ ప్రారంబం అవుతుంది. నీకోసమని చాలా రోజులు మాంసాహారం మానేస్తుంది. కోర్కె చంపుకుంటుంది. కానీ ఎప్పుడో ఒకప్పుడు వుండబట్టలేక ఏ పులావో తెప్పించుకుతింటుంది. అప్పుడు నీకెలా వుంటుంది?"

కుమార్ ఏదో అందామనుకున్నాడు. అతన్ని మాట్లాడనివ్వకుండా "నేను చెప్పేది విను. ఇటువంటి పెళ్ళిళ్ళు సక్సెస్ ఫుల్ కావాలంటే, ఆ యువతీ యువకులకే కాక, వాళ్ళ బంధువులకీ, వాళ్ళ స్నేహితులకీ, వాళ్ళు తిరిగే సమాజంలోని వ్యక్తులకీ ఎంతో సంస్కారం, విశాల దృక్పథం వుండాలి. మాకు లేవు. మీవాళ్ళకు వున్నాయని నేను అనుకోను. కనుక మీ ఫూలిష్ ఐడియా మానుకోండి."

"ఈ విషయం చెప్పడానికేనా నన్ను రమ్మన్నారు?" అడిగాడు కుమార్ కోపంగా.

"అవును. ఈ విషయం చెప్పడానికే పిలిచాను. అంతేకాదు. ఈరోజు నించీ నువ్వు నజీమ్‌ని కలుసుకోవడం మానెయ్యాలి."

"నేను మానను. మానలేను."

నజీమ్ తండ్రి ఒక్క క్షణం ఆగి "మీ నాన్నగారి టెలిఫోన్ నెంబరేమిటి?" అడిగాడు.

తండ్రి టెలిఫోన్ నెంబరు చెప్పాడు. హుస్సేన్ కుమార్ తండ్రికి ఫోన్ చేశాడు.

"హల్లో శివరాం గారా! నా పేరు హుస్సేన్. నజీమ్ నా కుమార్తె. మీ అబ్బాయి మా అమ్మాయి నజీమ్ ప్రేమించుకున్నారుట. పెళ్ళి చేసుకుంటాం అంటున్నారు. మీ అబ్బాయి ఇప్పుడు యిక్కడే ఉన్నాడు. ఇటువంటి పెళ్ళిళ్ళు సాఫీగా సాగవనీ, నాకు యిష్టంలేదనీ, మంచిది కాదనీ నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. వెరీగుడ్ మీ అభిప్రాయము అదేనన్నమాట. అవును. వివేకం వున్నవాళ్ళు ఎవరయినా అదే చెపుతారు. మీ అబ్బాయి మళ్ళీ మా అమ్మాయిని కలుసుకోవడం క్షేమం కాదు. దయచేసి మీరు కుమార్‌కి నచ్చచెప్పండి" అని హుస్సేన్ టెలిఫోన్ పెట్టేసి, "ఇక నువ్వు వెళ్ళవచ్చు కుమార్! నీ ప్రాణం మీద నీకు తీపి వుంటే నువ్వు మళ్ళీ నజీమ్‌ని కలుసుకోవద్దు" అన్నాడు.

రెండు రోజుల తర్వాత తనూ నజీమ్ రహస్యంగా కలుసుకున్నారు. వెక్కి వెక్కి ఏడ్చింది నజీమ్.

"మనం పెళ్ళి చేసుకుంటే మా అన్నయ్య నన్ను చంపేస్తానంటున్నాడు. మా నాన్న నిన్ను చంపేస్తానంటున్నాడు. నీవాళ్ళూ ఒప్పుకోవడంలేదు. నన్ను మర్చిపో కుమార్. నీకేమన్నా జరిగితే నేను బతకలేను" అని భోరున ఏడ్చింది. ఆమెని చేతుల్లోకి తీసుకుని, "నిన్ను వదల్లేను నజీమ్. మనం పెళ్ళి చేసుకుని తీరతాం. ఏ మహాపట్నానికో, మారుమూల పల్లెకో పోదాం. ఇటు మీవాళ్ళకీ అటు మావాళ్ళకీ తెలియకుండా. సరేనా?" అన్నాడు.

తలూపింది నజీమ్.

రహస్యంగా ఎవరికీ తెలియకుండా ఒక రోజున ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళి చేసుకున్న రోజే వెంటనే రహస్యంగా ఆ ఊర్నించి విశాఖపట్నం నించి బయలుదేరి ఊటీకి వెళ్ళిపోయారు. దాదాపు పదిరోజులు ఊటీలో ఒకళ్ళ చేతుల్లో ఒకళ్ళు ప్రపంచాన్ని మర్చిపోయి హాయిగా గడిపారు.

3

నజీమ్ శవాన్ని ఒళ్ళోకి తీసుకున్నాడు కుమార్. ఆమె రెండు చెంపల్నీ మునివేళ్ళతో నింజురుతూ "బాధపడ్డావా నజీమ్. నీమీద ఒట్టు పెడుతున్నాను.

ప్రాణానికి ప్రాణం తీస్తాను. నిన్ను చంపినవాడు ఎవడైనా సరే వాణ్ణి పట్టుకుని చంపి తీరతాను. ఒట్టు నజీమ్ నిజానికి నాకు బతకాలని లేదు. ఇప్పుడే ఈ క్షణాన్నే చచ్చిపోయి నీ దగ్గరికి రావాలనుంది" అన్నాడు.

ఇలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూనే వున్నాడు రాత్రంతా. కాటేజి నౌఖరు ఎప్పుడు వచ్చాడో కుమార్ చూడనేలేదు. నౌఖరు అడిగిన ప్రశ్నలు కుమార్‌కి వినిపించలేదు. అతను వెళ్ళిపోవడమూ చూడలేదు. ఆ తర్వాత బయట అయిన బూట్ల చప్పుడు వినపడలేదు. హడావిడిగా పోలీసులు లోపలికి రావడమూ గమనించలేదు.

"ఎందుకు వెళ్ళిపోయావు నన్ను వొదిలి? నేను ఎలా బతకగలను అనుకున్నావు?" ఏడుస్తున్నాడు నజీమ్ శవాన్ని ఒళ్ళో పెట్టుకుని.

ఆ దృశ్యం చూసి పోలీసులు కూడా కదల్లేక, మాట్లాడలేక నిలబడిపోయారు.

కుమార్ భుజం మీద చెయ్యిపడింది.

"లే ఇలా ఏడ్చి ప్రయోజనమేమిటి చెప్పు?" అన్న మాటలు వినిపించాయి. ఏదో మత్తులోంచి మేలుకున్నట్టు పక్కకి చూశాడు కుమార్.

"నాన్నా! నువ్వా! ఇక్కడికి ఎలా వచ్చావు? ఎందుకు వచ్చావు? ఈ ఘోరం చేసింది నువ్వేనా?" అంటూ చటుక్కున లేచి శివరాం మెడ రెండుచేతుల్తో పట్టుకున్నాడు.

"నా నజీమ్‌ని చంపింది నువ్వేనా! చెప్పు, నిజం చెప్పు" అంటూ తండ్రి మెడ నలుపుతున్నాడు. అప్పుడు కదిలారు పోలీసులు.

4

వై.ఆర్.శివరాం. అడ్వొకేట్. ఆయిల్ రిఫయినరీ రోడ్, విశాఖపట్నం.

విజిటింగ్ కార్డు చూసి, బల్లమీద పెట్టి, "చెప్పండి. పనిమీదే వచ్చినట్టున్నారు" అన్నాడు డిటెక్టివ్ శివరాం గొంతు సవరించుకున్నాడు. ఏదో అనబోయి మాటలు మింగేశాడు.

"ఎక్కడ ప్రారంభించాలో, ఎలా ప్రారంభించాలో తెలియకుండా వుంది. ఏ హత్యా నేరమో మిమ్మల్ని దర్యాప్తు చెయ్యమని, నేరస్థుణ్ణి పట్టుకోమని మీ క్లయింట్లు మిమ్మల్ని కోరుతారు. నా కోరిక అలాటిది కాదు. నా కొడుకు హత్య చెయ్యకుండా ఆపమని మిమ్మల్ని కోరడానికి వచ్చాను" అన్నాడు శివరాం.

యుగంధర్ శివరాంని ఆశ్చర్యంగా చూశాడు. "ఎవర్ని హత్య చెయ్యకుండా?" అడిగాడు.

"ఎవర్నో నాకు తెలియదు. బహుశా నన్నేనేమో!"

"వాట్ కన్నతండ్రిమీద అంత ద్వేషమూ, కసీ కలగడానికి కారణం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"చెపుతాను. చెప్పడానికే వచ్చాను" శివరాం చెపుతున్నాడు. అప్పుడప్పుడు అతని గొంతు జీరపోతోంది. కళ్ళు తుడుచుకుంటున్నాడు.

యుగంధర్ అసిస్టెంట్ రాజు వివరంగా రాసుకుంటున్నాడు.

అంతా విన్న తర్వాత యుగంధర్ ఒక నిట్టూర్పు వదిలాడు. "కులమూ, మతమూ, భాష, తదితర సంకుచిత తత్వాలతో గుండెలు వొలిచి యిచ్చుకున్న యువతీ యువకుల్ని విడదీయడానికి ఎవరు ప్రయత్నించినా యిలాటి ఘోర పరిణామాలే సంభవిస్తాయి" అన్నాడు.

"సారీ యుగంధర్! మీరు పొరబడుతున్నారు. మతం ఏదైనా, కులం ఏదైనా నేను అభ్యంతరం చెప్పేవాణ్ణికాను. అదికాదు అసలు కారణం"

"అసలు కారణం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"ఎవరో తురకమ్మాయితో కుమార్ తిరుగుతున్నాడని తెలిశాక, రహస్యంగా వాకబు చేశాను ఎవరా అమ్మాయి అని ఆ అమ్మాయి పేరు నజీమ్ అనీ, తండ్రి హుస్సేన్ హార్డ్‌వేర్ మర్చెంట్ అనీ, ఆమె అన్న సులేమాన్ కూడా తండ్రితో కలసి వ్యాపారం చేస్తున్నాడనీ, బాగా వున్న కుటుంబం అనీ తెలిసి సంతోషించాను. నజీమ్, కుమార్ ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకున్నారని తెలిసి యింకా సంతోషించాను" అన్నాడు శివరాం.

"అయితే వాళ్ళ పెళ్ళికి ఎందుకు అభ్యంతరం చెప్పారు?" అడిగాడు రాజు.

"మొదట సంతోషించాను. కానీ కొన్ని విషయాలు తెలిసిన తర్వాత ఏం చెయ్యాలో నాకే తోచలేదు. నజీమ్ పద్దెనిమిదేళ్ళ పిల్లలా కనబడుతుంది కానీ, నిజానికి ఆమె వయస్సు యిరవై ఎనిమిది. మావాడికి యిరవై నాలుగుఏళ్ళే. నాలుగేళ్ళు పెద్దదయినా కూడా వొప్పుకునేవాణ్ణేమో! కానీ యింకో విషయం తెలిసింది. హుస్సేన్ నజీమ్ తండ్రి కాడు. సులేమాన్ నజీమ్ అన్నాకాడు, హుస్సేన్ కొడుకూ కాడు. నిజానికి ఆ ముగ్గురికీ ఒకళ్ళతో ఒకళ్ళకి ఎటువంటి రక్తసంబంధమూ లేదు."

"మరి...?" అడిగాడు రాజు.

"నజీమ్ ఒక వేశ్య. ఖరీదైన వేశ్య. అదే నా అభ్యంతరం" అన్నాడు శివరాం.

"ఈ విషయం మీ అబ్బాయికి ఎందుకు చెప్పలేదు? అతను కళ్ళు తెరిచేవాడేమో?" అడిగాడు యుగంధర్.

"యుగంధర్ ప్రేమ పిచ్చిలో పడ్డాక ఎవరు ఎన్ని చెప్పినా లాభంలేదు. సాక్షాత్తు భగవంతుడే దిగివచ్చి చెప్పినా నమ్మరండీ! నమ్మరు. ప్రియుడికి తను ప్రేమించిన స్త్రీ దేవత" అన్నాడు శివరాం.

యుగంధర్ శివరాంకి సిగిరెట్ అందించి తనూ ఒకటి వెలిగించి, కాసేపు ఆలోచించి, "నజీమ్ మీ అబ్బాయిని నిజంగా ప్రేమించిందా? లేకపోతే ఏదో ప్రయోజనం కోసం ప్రేమిమించినట్లు నటించి పెళ్ళి చేసుకుందా? అసలు పెళ్ళయిందా?" అడిగాడు యుగంధర్.

"రిజిస్ట్రార్ ఆఫీసులో వాళ్ళిద్దరికీ పెళ్ళి అయింది. అంతవరకు నాకు తెలుసు. నిజంగా కుమార్‌ని ప్రేమించిందో, లేక నటించిందో, అలా నటించడానికి కారణం వుందో లేదో మీరు దర్యాప్తు చేసి తెలుసుకోవాలి. అంతేకాదు నజీమ్‌ని ఎవరు, ఎందుకు చంపారు? అదీ కనుక్కోవాలి. నేనో, యింకెవరో నజీమ్‌ని చంపామని అనుకుని వాళ్ళని చంపి, నా కొడుకు హంతకుడు కాకుండా చూసే బాధ్యత మీ మీద పెడుతున్నాను యుగంధర్!"

యుగంధర్ కుర్చీలోంచి లేచి అటూ యిటూ పచార్లు చేయడం ప్రారంభించాడు. పది నిముషాలు మౌనంగా వుండిపోయాడు.

శివరాం ఉండబట్టలేక, "యుగంధర్! ఫీజు గురించి ఆలోచిస్తున్నారా? చెప్పండి ఎంతకావాలో" అంటూ చెక్కుబుక్కు బల్ల మీద పెట్టాడు.

"నో! నో! అదికాదు నేను ఆలోచిస్తున్నది. ఇటువంటి కేసులు నాకన్నా పోలీసులే బాగా దర్యాప్తు చేయగలరు. నజీమ్‌ని హత్యచేసింది ఎవరో కనుక్కుని, వాళ్ళని పట్టుకోగల సమర్థత పోలీసుల కున్నది. మీ అబ్బాయి ఏ అఘాయిత్యమూ చేయకుండా ఆపడమే సమస్య అయితే, కుమార్‌ని ప్రివెంటివ్ కస్టడీలోకి తీసుకోవడమో, లేక యింటరాగేషన్ కోసం కస్టడీలోకి తీసుకోవడమో, అదీ కాకపోతే పోలీస్ సర్వేలెన్స్ ఏర్పాటు చెయ్యడమో చేయవచ్చు" అన్నాడు యుగంధర్.

"పోలీసుల సమర్థతను నేను శంకిస్తున్నానని కాదు యుగంధర్. అలాటి ఏర్పాటేదైనా చేస్తే మావాడి భవిష్యత్తుకి భంగం కలుగుతుంది" అన్నాడు శివరాం.

"అంటే?" అడిగాడు రాజు.

"కుమార్ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో డాక్టరేట్ తీసుకోబోతున్నాడు. అణుశక్తి పరిశోధనా కేంద్రంలో పెద్ద ఉద్యోగం వస్తుంది. కుమార్ కనుక పోలీస్ రికార్డులలోకి ఎక్కాడంటే, కుమార్ నీతీ నిజాయితీల మీద అధికారులకి ఏ మాత్రం అనుమానం వున్నా ఉద్యోగం యివ్వరు."

"ఓ! ఇటీజ్ బికమింగ్ మోర్ యింట్రెస్టింగ్" అని నవ్వి, "హుస్సేన్, సులేమాన్, నజీమ్ యీ ముగ్గురూ పాకిస్తాన్ నుంచి వచ్చిన గూఢచారులనీ అంటారేమో కాసేపుంటే" అన్నాడు రాజు.

"అని నేను అనను. నాకు తెలియదు. నేను కోరిన సహాయం చేసి పెడతారా?" అన్నాడు శివరాం.

"ఈ కేసు ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసరు ఎవరు? పేరు తెలుసా?" అడిగాడు యుగంధర్.

"**మొదట** స్థానిక ఇన్‌స్పెక్టర్ కొంత ఇన్వెస్టిగేట్ చేశాడు. తర్వాత క్రైంబ్రాంచి నించి ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు" అన్నాడు శివరాం.

"దటీజ్ వెరీగుడ్ మీరు నాకు రేపు ఫోన్ చెయ్యండి. ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుతో మాట్లాడి చెపుతాను" అన్నాడు యుగంధర్.

శివరాం లేచి తలుపు వరకూ వెళ్ళాడు.

"మిష్టర్ శివరాం" పిలిచాడు యుగంధర్.

"ఆఁ!"

"ఇంకొక విషయం."

"ఏమిటి?"

"నిజంగా మీకు జాతి మత కుల విభేదాల గురించి పట్టింపు లేకపోయినా కుమార్‌తో అలా ఎందుకు చెప్పారు?" అడిగాడు.

"నజీమ్ శీలాన్ని గురించి ఏమన్నా అంటే వెర్రిప్రేమలో వున్న కుమార్ రెచ్చిపోతాడు. జాతి మతం పేరిట అభ్యంతరం చెపితే అతనికి అర్థం అవుతుందనీ, మా అభ్యంతరం అర్థం చేసుకుంటాడనీ అలా చెప్పాను."

"మీ అబ్బాయి కుమార్‌ని గురించి నాకు సదభిప్రాయం లేదు. క్షమించండి శివరాం" అన్నాడు యుగంధర్.

"ఏం ఎందువల్ల? అతని ప్రవర్తనలో" అడిగాడు శివరాం.

"తన భార్యని మీరు చంపారని, ఏ సాక్ష్యమూ లేకుండా మిమ్మల్ని నిందించడం ఒకటి. మీరే హత్య చేశారని నిశ్చయించుకుని, మిమ్మల్ని చంపడానికి మీ గొంతు పట్టుకోవడం రెండు. ఏ కొడుకూ చెయ్యవలసిన పనికాదు, తండ్రి ఎంత దుర్మార్గుడయినా" అన్నాడు యుగంధర్.

శివరాం కళ్ళల్లో నీళ్ళు నిండాయి. "యుగంధర్ నా కొడుకు కుమార్ చాలా మంచివాడు. గుణవంతుడు. చిన్నతనంనుంచీ నన్నేకాదు, పెద్దలని ఎవర్నీ నొప్పించేవాడు కాడు. ఎదురు చెప్పేవాడు కాడు. నా మాటకి మొట్టమొదటిసారి ఎదురు చెప్పింది నజీమ్ విషయంలోనే. ఇక నన్ను చంపడానికి నా గొంతు పట్టుకోవడం విషయమా! నిజంగా నన్ను చంపివుండేవాడని అనుకోను. తాత్కాలికంగా అతని మనస్సు చలించి, ఉచ్చమూ, నీచమూ తెలియని పిచ్చివాడయ్యాడు. అతనేకాదు, కుమార్‌లా అంతగా ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్య శవంతో, రక్తపు మడుగులో ఒక రాత్రంతా గడిపితే ఎవరయినా పిచ్చివాడవుతాడు. దయచేసి, ఈ సంఘటన దృష్టిలో వుంచుకుని కుమార్ మీద హీనమైన అభిప్రాయం ఏర్పరచుకోవద్దు" అన్నాడు శివరాం.

## 5

"రండి రండి. చాలాకాలమైంది కలుసుకుని. ఏమిటి విషయం?" అడిగాడు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు యుగంధరూ, అతని అసిస్టెంటు రాజూ లోపలికి రాగానే.

"యుగంధర్ గారి సహాయం మీకు అవసరమయ్యే కష్టమైన కేసు ఏదీ రాలేదేమో! అందుకే యీ మధ్య మీరు మా దగ్గరికి రాలేదు" అన్నాడు రాజు నవ్వుతూ.

"అంటే మా సహాయం మీకు అవసరమైందా యిప్పుడు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ తలవూపి "మై డియర్ స్వరాజ్యరావు మీరు యిక్కడ వుంటారనుకోలేదు. అప్పుడే దర్యాప్తు ముగించుకుని వచ్చేశారా?" అడిగాడు యుగంధర్. ఇన్‌స్పెక్టర్ కనుబొమలు చిట్లించి, "నజీమ్ హత్యకేసు గురించా! మీకేమిటి యింట్రస్టు? ఎవరి తరపున దర్యాప్తు ప్రారంభించారు?" అడిగాడు.

"ఇంకా దర్యాప్తు ప్రారంభించలేదు ఎవరి తరపునా. కేసు వివరాలు తెలుసుకుందామని వచ్చాను" చెప్పాడు యుగంధర్.

"గుడ్ చాలా యింట్రెస్టింగ్ కేసు. నేను చెప్పడం కన్నా ఫైల్ మీకిస్తాను చదవండి" అంటూ స్వరాజ్యరావు బల్లసొరుగులోంచి ఫైల్ తీసి యుగంధర్‌కి యిచ్చాడు.

యుగంధర్ చదువుతున్నాడు తను చదివిన కాయితం రాజుకిస్తున్నాడు. ఆ రిపోర్టు అంతా చదవడానికి దాదాపు గంట పట్టింది. ఫైల్ మూసేసి స్వరాజ్యరావుకిస్తూ "ఇంట్రస్టింగ్ గానే ఉంది. గందరగోళంగానూ వుంది. మీ అభిప్రాయాలు, అనుమానాలు యీ రిపోర్టులో రాయలేదేం?" అడిగాడు.

"స్పష్టమైన అభిప్రాయాలు, నిశ్చయమైన అనుమానాలు ఏర్పడకపోవడంవల్ల" అన్నాడు ఇన్స్పెక్టర్.

"యు ఆర్ పర్ఫెక్ట్లీ కరెక్ట్. అనుమానాలు కలగడానికి కానీ అభిప్రాయాలు ఏర్పరచుకోడానికి కానీ తగినన్ని వివరాలు యీ రిపోర్టులో లేవేమో అనిపిస్తుంది. ఊటీలో ఇన్వెస్టిగేషన్ పూర్తిగా అయిపోయినట్టేనా?" అడిగాడు యుగంధర్.

ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు తలవూపి "అక్కడ దర్యాప్తు చెయ్యవలసిందేమీ లేదు. ముఖ్యమైన సాక్షులంతా వాళ్ళ వాళ్ళ యిళ్ళకి వెళ్ళిపోయారు. కుమారూ, అతని తండ్రీ తప్ప. వాళ్ళిద్దర్నీ యిక్కడే మద్రాసులో వుండమన్నాను. ఒక కంట కనిపెడుతున్నాము" అన్నాడు స్వరాజ్యరావు.

"వెరీగుడ్ నేను మళ్ళీ కనబడతాను" అంటూ యుగంధర్ లేచాడు.

"ఓ! జస్ట్ ఎ మినిట్ ఎవరి తరఫున మీరు యీ ప్రశ్నలన్నీ అడిగారో చెప్పనేలేదు."

"అడ్వొకేట్ శివరాం తరఫున. కేసు తీసుకునేదీ లేనిదీ ఇంకా నిర్ణయించుకోలేదు. నేను ఒక నిర్ణయం తీసుకోగానే మీకు తెలియజేస్తాను" అంటూ యుగంధర్ రాజుతో సహా బయలుదేరాడు.

"ఈ హత్య గురించి వివరాలు రాయి" అన్నాడు యుగంధర్. యుగంధర్ చెప్పడం ప్రారంభించాడు. రాజు రాస్తున్నాడు.

"నజీమ్ వయస్సు యిరవై ఆరు, యిరవై ఎనిమిది మధ్య. పద్దెనిమిది ఏళ్ళ యువతిలా కనిపించేది. ఖరీదైన వేశ్య. నజీమ్ తనకై తను ఒక పథకం ప్రకారం ముందు ఆలోచించుకుని, కుమార్తో పరిచయం చేసుకుని, అతన్ని ఆకర్షించి, అతనికి తన గుండె వొలిచి యిచ్చానని చెప్పి, అతను తల్లిదండ్రుల్ని ఎదిరించేటట్టు చేసి, తను తన వాళ్ళని ఎదిరించో, ఎదిరించినట్లు నటించో కుమార్ని పెళ్ళి చేసుకుని అతనితో ఊటీకి వెళ్ళిపోయింది.

కుమార్ని దూరాన ఎక్కడినించో చూసి, అతన్ని తొలిచూపులోనే నిజంగా ప్రేమించి అతనితో ఏరికోరి పరిచయం చేసుకున్నదా? లేదా, మరేదో ఉద్దేశంతో, యింకేదో ప్రయోజనం కోసం ప్రేమించినట్లు నటించి, యింత నాటకమాడిందా?

ఒక వేశ్యగా జీవితం సాగిస్తున్న నజీమ్ తన ప్రియుడైన కుమార్ని, తన యింటికి తీసుకువెళ్ళడానికి ఎందుకు జంకింది? హుస్సేన్ తండ్రి కాడు. సులేమాన్ అన్నా కాడు. వాళ్ళకి ఎందుకు భయపడింది?

ఇదంతా కూడా నాటకమేనా?

తనకేవో అంతరాయాలు, ఆటంకాలు వున్నాయని భ్రమ కలిగించి కుమార్ సానుభూతిని పొంది అతని వాంఛను మరింత రేకెత్తించిందా?

అంటే హుస్సేన్, సులేమాన్, నజీమ్ కలిసి లోపల ప్రవేశించాడు. కాటేజి వాళ్ళిచ్చిన రెండు తాళం చెవుల్లో ఒకటి కుమార్ దగ్గరున్నది. అతను తాళం వేసుకుని వెళ్ళాడని గ్రహించి, డూప్లికేట్ తాళం చెవి ఏ కిటికీలోంచో ఆ వచ్చిన మనిషికి నజీమే యిచ్చివుండాలి. అంటే ఆ వచ్చిన మనిషిని చూస్తే నజీమ్కి ఎటువంటి భయమూ వుండి వుండడానికి అవకాశం లేదు. అంతేకాదు. ఆ వచ్చిన మనిషి నజీమ్కి ఆప్తుడో, ఆప్తురాలో అయివుండాలి. ఆ మనిషే నజీమ్ని హత్యచేసి వుండాలి" అన్నాడు యుగంధర్.

"ఈ వాదనలో ఒక లోపం వుంది సార్" అన్నాడు రాజు.

"ఏమిటది?" అడిగాడు యుగంధర్.

"నజీమ్ యిచ్చిన డూప్లికేట్ తాళంతో లోపలికి వచ్చిన మనిషి నజీమ్‌తో ఏదో మాట్లాడి వెళ్ళిపోయి వుండవచ్చు. నజీమ్ లోపల తలుపు గడియ పెట్టుకోవడం మరిచిపోయి వుండవచ్చు నజీమ్ పడుకుని వుండగా మరెవరో దగ్గిరగా వేసి వున్న తలుపుని తోసుకుని చప్పుడు చేయకుండా లోపలికి వచ్చి పడుకుని వున్న నజీమ్‌ని హత్యచేసి వుండవచ్చు. ఏమంటారు?" అడిగాడు రాజు.

"అదీ ఆలోచిద్దాం రాజూ! బల్లమీద వున్న డూప్లికేట్ తాళం చెవి మీద ఎవరి వేలిముద్రలూ లేవి. ఆ డూప్లికేట్ తాళం చెవితో తలుపు తెరిచి, లోపలికి వచ్చిన మనిషి వేలిముద్రలో, లేక ఆ తాళం చెవి నజీమ్‌కి తిరిగి యిచ్చినందువల్ల నజీమ్ వేలిముద్రలో వుండివుండాలి. ఎవరి వేలిముద్రలూ లేవంటే దానికి అర్థం ఏమిటి? ఆ వేలిముద్రలు ఎవరో తుడిచివేసి వుండాలి. ఏ పాపమూ ఎరుగనివాళ్ళు తాళం చెవిమీద వేలిముద్రలు తుడిచివెయ్యరు. ఏమంటావు?" యుగంధర్ అడిగాడు.

రాజు నవ్వి "అవును. తాళం చెవి విషయం మర్చిపోయాను" అన్నాడు.

మళ్ళీ యుగంధర్ చెప్పడం ప్రారంభించాడు.

"హత్య వివరాలు: రాత్రి 8గంటలకి 9 గంటలకి మధ్య హత్య జరిగిందని పోస్ట్‌మార్టం ద్వారా నిర్ణయమైంది. నజీమ్ తనని హత్యచేసిన మనిషితో పోట్లాడినట్లుగాని, పెనుగులాడినట్లుగానీ నిదర్శనాలు లేవు. నజీమ్ మంచం మీద వుండగానే హత్య జరిగింది.

నజీమ్ పడుకునుండగా హత్య జరిగిందా, కూర్చునుండగా హత్య జరిగిందా అనేది ఆలోచించాలి. పడుకునుండగా హత్య జరిగితే మనకేమిటి తెలుస్తుంది?

కత్తి నజీమ్ వీపులో దిగబడింది కనుక హత్య చేయబడిన సమయంలో నజీమ్ బోర్లా పడుకుని వుండాలి. పడకగదిలో యింకొకరు ఎవరో వుండగా నజీమ్ ఎందుకు బోర్లా పడుకుంటుంది? నిద్రపోతోందా? తను డూప్లికేట్ తాళం యిచ్చి, ఎవర్నో లోపలికి ఆహ్వానించి తను నిద్రపోతుందా? అది అసందిగ్ధంగ లేదా?

నజీమ్ మెలుకువగానే వుండి వుండాలి. అయితే మరి బోర్లా ఎందుకు పడుకుంది? ఏ పరిస్థితుల్లో బోర్లా పడుకుంటుంది? అది ఊహించవలసిందే మనం.

ఆ వొచ్చిన మనిషి మాటలకి ఆపుకోలేని దుఃఖం వచ్చి వుండాలి. బోర్లా పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ వుండాలి. హత్య అప్పుడు జరిగివుండాలి అని మనం అనుకోవాలి. లేదా నజీమ్ మంచం మీద కూర్చుని వుండగా హత్య జరిగింది అనుకుందాం.

నజీమ్ మంచం మీద కూర్చుంది. ఆ వచ్చిన మనిషి అటూ యిటూ పచార్లు చేస్తూ వెనకవైపుకి వెళ్ళి చటుక్కున కత్తితో పొడిచి చంపివుండాలి" అన్నాడు యుగంధర్.

"ఇంకొక అవకాశం కూడా వుంది సార్" అన్నాడు రాజు.

"ఏమిటది?"

"ఆ వచ్చిన మనిషి నజీమ్‌కి పూర్వప్రియుడో, విటుడో అయ్యుండవచ్చు. మంచం దగ్గిరకి వచ్చి నజీమ్‌ని కావిలించుకుని ఆ సమయంలో నజీమ్‌ని పొడిచి చంపి వుండవచ్చు" అన్నాడు రాజు.

యుగంధర్ తలవూపి "యస్. యు ఆర్ కరెక్ట్" అని మళ్ళీ ప్రారంభించారు. హత్యచేసిన మనిషిని గురించి మనకేం తెలుస్తుంది? హత్య జరిగేముందు నజీమ్‌కి ఆ వచ్చిన వ్యక్తికీ కొంత వాగ్వివాదం జరిగివుండాలి. బోర్లాపడుకుని వున్న మనిషిని వీపులో కత్తితో పొడిచి చంపడానికి ఎక్కువ బలం అవసరం లేదు. కనుక హత్య చేసిన మనిషి ఆడదీ అయ్యుండవచ్చు, మొగవాడూ అయ్యుండవచ్చు.

కూర్చునుండగా పొడిచివుంటే దానిని బట్టి ఏం తెలుస్తుంది? ఆ వచ్చిన మనిషినించి తనకి అపకారం జరుగుతుందని నజీమ్ అనుకుని వుండదు.

ఇక మూడోది: ప్రియుడో, విటుడో అనే విషయం ఆలోచిద్దాం. ఆ రాత్రి నజీమ్ ప్రియుణ్నో, విటుణ్నో లోపలికి రానిస్తుందంటే నమ్మదగిందిగా లేదు. భోజనం తేవడానికి హోటల్‌కి వెళ్ళిన కుమార్ ఏ క్షణాన అయినా తిరిగి రావచ్చు. అటువంటప్పుడు నజీమ్ పాతప్రియుణ్ణి, ఖాతాదారుణ్ణి లోపలికి రానిస్తుందా? రానివ్వదు.

ఆ మనిషి గదిలో వుండగా కుమార్ వచ్చినా ఆ వచ్చిన మనిషిని పడక గదిలో కుమార్ చూసినా తా ప్రేమనిగాని, తన ఉద్దేశాన్ని గాని కుమార్ శంకించడానికి కారణం వుండదని నజీమ్ అనుకుని వుండాలి. అంటే హత్య చేసిన మనిషితో కుమార్‌కి పరిచయం వుండి వుండాలి. నజీమ్‌కి హత్యచేసిన మనిషికీ వున్న బాంధవ్యం అనుమానానికి అవకాశం లేనిదిగ వుండివుండాలి."

రాజు కలం బల్లమీద పెట్టి, వొళ్ళు విరుచుకుని నవ్వి, "అదంతా ఏదో అస్పష్టంగా, కేవలం వూహించడం అవుతుంది సార్" అన్నాడు.

యుగంధర్ తలవూపి "అవును. పోలీస్ దర్యాప్తులో హత్యకి సంబంధించిన వివరాలు ఎక్కువలేవు. అందుకే ఊహాగానం ఎక్కువగా వుంది. నజీమ్‌ని హత్యచేసిన..."

అంతలో బల్లమీద టెలిఫోన్ గణగణ మోగింది. యుగంధర్ రిసీవర్ అందుకుని "హల్లో!" అన్నాడు.

"డిటెక్టివ్ యుగంధర్ వున్నారా?"

"యుగంధర్ స్పీకింగ్ హియర్."

"నజీమ్ హత్య గురించి మీరు దర్యాప్తు చెయ్యడం మంచిది కాదు."

స్వరాన్ని బట్టి ఆడమనిషో, మగవాడో స్పష్టంగా తెలియడం లేదు యుగంధర్‌కి.

"ఎవరికి మంచిది కాదు?" అడిగాడు యుగంధర్.

"మీకే మీకే మంచిది కాదు. ఇంకా కొంతకాలం బతికి వుండడం మీకిష్టంలేదా?"

యుగంధర్ నవ్వి "నా క్షేమం గురించి మీకెందుకు అంత బెంగ?" అన్నాడు.

"మిష్టర్ యుగంధర్ ఊసుపోక మీకు టెలిఫోన్ చెయ్యడం లేదు. ఇదే మొదటి హెచ్చరిక, ఆఖరి హెచ్చరిక. కేసునించి మీరు తక్షణం తప్పుకోకపోతే సృష్టికర్తని కలుసుకుంటారు. జాగ్రత్త" క్లిక్ మన్నది. టెలిఫోన్ డిస్‌కనెక్ట్ అయింది. యుగంధర్ రిసీవర్ హుక్ మీద పెట్టేసి "కేసు యింత తొందరగా పక్కానికి వస్తుందనుకోలేదు. మతాంతర వివాహం చేసుకున్న యువతి యువకుల్ని చూసి సహించలేక, సన్నిహితులెవరో చేసిన హత్యకాదిది" అని క్షణం ఆగి "ఇలా బెదిరించినంత మాత్రాన నేను బెదిరిపోతానని, యిలాంటి బెదిరింపే యీ కేసుపై నాకు యింట్రెస్ట్ ఎక్కువ చేస్తుందని ఆ మనిషికి తెలియదేమో" అంటూ యుగంధర్ బల్ల సొరుగులోంచి శివరాం విజిటింగ్ కార్డు బయటికి తీసి చూసి టెలిఫోన్ నెంబరు తిప్పాడు.

"హోటల్ శరత్. రూమ్ నెం 62కి కనెక్ట్ చెయ్యండి."

"హల్లో మిష్టర్ శివరాం. యుగంధర్ స్పీకింగ్ హియర్. కేసు తీసుకుంటున్నాను. దర్యాప్తు ప్రారంభిస్తున్నాను" అని రిసీవర్ హుక్ మీద పెట్టేశాడు. రాజు లోలోన నవ్వుకుంటున్నాడు.

"ఏమిటి రాజూ! నవ్వుకుంటున్నావు?" అడిగాడూ యుగంధర్.

"మీ తత్వం బాగా తెలిసి ఇలా బెదిరిస్తే అది ఒక సవాలుగా తీసుకుని యీ కేసు మీరు తప్పకుండా దర్యాప్తు చేస్తారని శివరామే మీకు అలా ఫోన్ చేశాడేమో"

రాజు వాక్యం పూర్తి చెయ్యగానే టెలిఫోన్ మళ్ళీ మోగింది. మళ్ళీ రిసీవర్ తీసుకున్నాడు యుగంధర్. "యుగంధర్ నా హెచ్చరిక ఖాతరు చెయ్యలేదు మీరు. ఇక ఘడియలు లెక్కపెట్టుకోవచ్చు" అని అవతలి మనిషి డిస్కనెక్టు చేశాడు.

యుగంధర్ రిసీవర్ హుక్ మీద పెట్టేసి, వచ్చిన బెదిరింపు గురించి రాజుకి చెప్పాడు.

"కేసు తీసుకుంటానని శివరాంతో మీరు చెప్పారు. కొద్దిక్షణాల తర్వాత మిమ్మల్ని బెదిరిస్తూ టెలిఫోన్ కాల్ వచ్చింది. అర్థమేమిటి?" అన్నాడు రాజు.

"నో. యు ఆర్ రాంగ్. నన్ను బెదిరించి ఆ విధంగా నాకు యీ కేసులో ఇంట్రెస్టు కల్పించి, నేను యీ కేసు దర్యాప్తు చేయాలనుకోవడమే ఆ బెదిరింపుకి కారణమైతే, నేను కేసు తీసుకున్నాక మళ్ళీ బెదిరిస్తూ ఫోను చెయ్యవలసిన అవసరమేమిటి? కనుక శివరాం చేశాడని నేను అనుకోను నేను. ఫోన్ చేస్తున్నప్పుడు శివరాం గదిలో యింకెవరో వుండి యీ విషయం తెలుసుకుని బయటికొచ్చి నాకు ఫోన్ చేసివుండాలి. లేదా హోటలు ఆపరేటరో ఆ ఆపరేటర్‌తో లాలూచీపడ్డ మరో మనిషో యీ బెదిరింపు కాల్ చేసి వుండాలి. ఎవరైనా, యీ విషయం తర్వాత దర్యాప్తు చేద్దాం. ముందు మన సమీక్ష పూర్తికానీ" అన్నాడు యుగంధర్.

రాజు మళ్ళీ కాయితాలు, కలం సర్దుకున్నాడు. యుగంధర్ చెప్పడం ప్రారంభించాడు.

"రాజూ! అనుమానితుల జాబితా రాసుకో.

కుమార్: నజీమ్‌ని హత్యచేయడానికి కుమార్‌కి కారణం వుండి వుంటుందా? నజీమ్ ఒక వేశ్య అనీ తనకన్నా వయసులో చాలా పెద్దదనీ తనని మోసం చేసిందనీ, భోజనం తీసుకురావడానికి వెళ్ళిన కుమార్‌కి హోటల్‌లోనో, దోవలోనో ఎవరి ద్వారానో తెలిసివుంటే కాటేజికి తిరిగిరాగానే నజీమ్‌కి కుమార్‌కి ఘర్షణ జరిగివుండవచ్చు. ఆ ఘర్షణలో వొళ్ళు తెలియని కోపంతో కుమారే నజీమ్‌ని హత్య చేసివుండవచ్చు. కనుక నజీమ్‌ని హత్య చేయడానికి కుమార్‌కి ప్రోద్బలం వుండివుండవచ్చునని తేలుతోంది. ఇంక అవకాశం గురించి ఆలోచిద్దాం.

కుమారే నజీమ్‌ని హత్యచేసి వుండడానికి ఎటువంటు ఆటంకమూ లేదు.

అభ్యంతరం: డూప్లికేట్ తాళం చెవి మీద వేలిముద్రలు లేకుండా ఎలా పోయాయి? అనుమానం తనమీదికి రాకుండా వుండడానికి కుమారే ఆ వేలిముద్రలు తుడిచేశాడా? అంటే కుమార్ ముందు ఆలోచించి, బుద్ధిపూర్వకంగా యీ హత్య చేసి వుండాలి. లేదా ఏ అర్ధరాత్రో లేచి, ఆలోచించి, హత్య తనమీదికి రాకుండా వుండేందుకు, పోలీసులు యింకెవరినో అనుమానించేందుకు తప్పుడు సాక్ష్యం సృష్టించి వుండాలి.

ఆ డూప్లికేట్ తాళం చెవిమీద వేలిముద్రలు అతను తుడిచి వుండాలి. అంతగా ప్రేమించి, అందర్నీ ఎదిరించి నజీమ్‌ని పెళ్ళి చేసుకున్న కుమార్ ఆమెను హత్య చేస్తాడా? అదీ బుద్ధిపూర్వకంగా ఆలోచించి చేస్తాడా? తన మీదికి నేరం రాకుండా వుండేందుకు దొంగసాక్ష్యం సృష్టిస్తాడా? సహజంగా లేదు.

వాదనకోసం అయితే కుమార్‌ని అనుమానితుల జాబితాలో చేర్చుకోవాలేమోగానీ, అంతకన్నా అతనికి ప్రాముఖ్యత యివ్వనవసరంలేదు.

శివరాం: నజీమ్‌ని హత్య చేయడానికి శివరాంకి తగినంత కారణం వుంది.

అవకాశం : హత్య జరిగేముందు నాలుగురోజుల్నుంచీ శివరాం ఊటీలో వుంటున్నాడు భార్యతో సహా. కుమార్‌ని, నజీమ్‌ని ఒక కంట కనిపెడుతున్నాడు. వాళ్ళని కనిపెడుతుండడం తప్ప వేరే పనిలేదు.

కుమార్ భోజనం తీసుకురావడానికి హోటల్‌కి వెళ్ళడం శివరాం గమనించి వుండవచ్చు. అది అవకాశంగా తీసుకుని నజీమ్ వున్న కాటేజి తలుపు తడితే నజీమ్ మామగారిని చూసి ఏ అనుమానమూ లేకుండా డూప్లికేట్ తాళం చెవి యిచ్చివుండవచ్చు.

కనుక శివరాంకి అవకాశం వుంది.

తాళం చెవి: శివరాం అడ్వొకేట్. అందులోనూ క్రిమినల్ లాయర్. డూప్లికేట్ తాళం చెవి మీది వేలిముద్రలు తుడిచివేస్తే, కుమార్ మీదికి అనుమానం రాదు అని వూహించగల తెలివితేటలున్నాయి శివరాంకి. హత్యచేసిన తరువాత డూప్లికేట్ తాళం చెవితో కాటేజి తలుపు తాళం వేసి, తాళం చెవి తనకూడా ఎందుకు తీసుకుపోలేదు?

తాళం చెవిమీద వేలిముద్రలు తుడిచి బల్లమీదే పెట్టడంలో గూడార్థం ఏమిటి? హత్యకి ఉపయోగించిన కత్తి శవం వీపులోగానీ, కాటేజిలోగానీ లేదు. హంతకుడు ఆ కత్తిని ఎక్కడో దాచివుండాలి. లేదా పారేసి వుండాలి. డూప్లికేట్ తాళం చేవిమిది వేలిముద్రలు తుడిచివేసినట్లే కత్తిపిడి మీద వేలిముద్ర తుడిచి, దాన్ని అక్కడే ఎందుకు వదిలివేయలేదు?

కత్తినిబట్టి హత్యచేసిన మనిషిని పట్టుకుంటారేమో అన్న భయంవల్లే అయివుండాలి. హత్యకి ఉపయోగించిన కత్తి పోలీసులకి దొరకలేదని జ్ఞాపకం ఉంచుకోవాలి.

హుస్సేన్: ఇతను నజీమ్ తండ్రి కాడు. కానీ తండ్రినని చెప్పుకుంటున్నాడు. నజీమ్‌ని వ్యాపారంలోకి దింపి డబ్బు సంపాదిస్తున్నాడు. నజీమ్ ఎవర్నో పెళ్ళి చేసుకుని వెళ్ళిపోవడం వల్ల నజీమ్ మీద, కుమార్ మీద కసి ద్వేషం కలిగివుండవచ్చు.

అంతమాత్రాన నజీమ్‌ని హత్యచేస్తాడా! అది హత్యకి కారణం అనడానికి సమంజసంగా లేదు. తననించి నజీమ్‌ని దూరంగా తీసుకుపోయిన కుమార్‌ని హత్యచేయడం ఎక్కువ సహజం.

అవకాశం హుస్సేన్‌కి ఉంది.

సులేమాన్: హుస్సేన్ విషయంలో వూహించిన కారణాలు, అభ్యంతరాలు యితనికీ వర్తిస్తాయి.

ఈ హత్యని గురించి తెలుసుకోవాలంటే అసలు కిటుకు ఆ డూప్లికేటు తాళం చెవిలో వుంది" అని ముగించాడు యుగంధర్.

"చాలా సులభంగానే కేసు తేలిపోయింది సార్" అన్నాడు రాజు.

"ఎలా?" అడిగాడు యుగంధర్.

"డూప్లికేట్ తాళం చెవిమీది వేలిముద్రలు తుడవడానికి కారణం హత్యానేరం కుమార్ మీదికి రాకుండా వుండడానికే అని అనుకుందాం. కుమార్ మీదికి నేరం రాకుండా వుండడానికే అని అనుకుందాం. కుమార్ మీదికి నేరం రాకుండా వుండాలని ఉద్దేశించే వాళ్ళెవరు? మొదటివాడు కుమార్ రెండవవాడు అతని తండ్రి శివరావు. ఈ యిద్దరిలో ఒకళ్ళు నజీమ్‌ని హత్యచేసి వుండాలని తేలుతోంది" అన్నాడు రాజు.

"కుమార్ అంత నాటకమాడాడంటావా? తనే నజీమ్‌ని చంపి, తన ప్రియురాల్ని చంపినవాళ్ళ ప్రాణం తీస్తానని శపథం పట్టి, తను హంతకుడు కాడని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నాడంటావా? ఆల్ రైట్. వెళ్ళి కుమార్‌ని కలుసుకుందాం పద" అని యుగంధర్ కుర్చీలోంచి లేచాడు.

"చాలా చిత్రంగా వుంది యీ కేసు. మన క్లయింటు శివరాం అతనిద్వారా కుమార్ కూడా మన క్లయింటు అన్నమాట. ఈ కేసు దర్యాప్తు ప్రారంభంలోనే మనం మన క్లయింటులను అనుమానిస్తున్నాం" అన్నాడు రాజు.

"రాజూ! అపరాధ పరిశోధకులుగా మన ధర్మం మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. యదార్థం తెలుసుకోవడం నేరస్థుణ్ణి పట్టుకోవడం మన వృత్తిధర్మం. పక్షపాతమనేది ఉండకూడదు. మన క్లయింటులైనా సరే. ఆప్తులైనా సరే నేరస్థుల్ని పట్టుకోవాలి. అంతే" అన్నాడు యుగంధర్.

## 6

**రాజు క్రిజ్లర్ కారు** ఆపాడు. యుగంధర్ కారు దిగి ఆ నాలుగు అంతస్థుల మేడని పరీక్షగా చూశాడు. అదే హోటల్ శరత్.

డిటెక్టివ్‌లు యిద్దరూ హోటల్లోకి వెళ్ళారు. చాలామంది వున్నారు రిసెప్షన్ హాలులో. యుగంధర్‌ని కానీ, రాజుని కానీ ఎవరూ గమనించినట్టు లేదు.

"కుమార్ గది ఎక్కడున్నదీ రిసెప్షన్‌లో అడగాలా?" అడిగాడు రాజు.

"ఒద్దు" అంటూ యుగంధర్ మెట్లవైపు దారి తీశాడు.

లిఫ్టు వున్నా ఎందుకు ఉపయోగించడం లేదా అని రాజు అనుకున్నాడే కానీ యుగంధర్‌ని అడగలేదు. యుగంధర్‌తో పాటు అతనూ మెట్లు ఎక్కాడు.

మొదటి అంతస్తు చేరుకున్నారు.

మెట్లకి కొంచెం దూరంలో, నడవాలో ఒక స్టూలు మీద కూర్చునున్న మనిషి యుగంధర్‌నీ, రాజునీ పరీక్షగా చూశాడు.

రాజు చిన్ననవ్వు నవ్వి "ఇతను మఫ్టీలో వున్న పోలీస్ కానిస్టేబుల్ అయ్యుండాలి" అన్నాడు.

"ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు చెప్పారుగా కుమార్‌ని ఒక కంట కనిపెడుతున్నామని" రాజుతో అని, స్టూలుమీద కూర్చునున్న అతన్ని సమీపించి, "కుమార్ గది ఏది?" అడిగాడు యుగంధర్.

"ఎందుకు?" ఎదురు ప్రశ్న వేశాడు ఆ మనిషి.

"వెరీ గుడ్" అంటూ యుగంధర్ జేబులోంచి తన ఐడెంటిఫికేషన్ పత్రం తీసి చూపించాడు.

"క్షమించండి సార్. గుర్తుపట్టలేదు. మిమ్మల్ని ఎప్పుడో ఒకసారి దూరాన్నించి చూశాను" అంటూ ఆ కానిస్టేబుల్ క్షమాపణలు చెప్పడం ప్రారంభించాడు.

యుగంధర్ నవ్వి ఆ కానిస్టేబుల్ భుజం తట్టి, "నీ తప్పేమీ లేదు సరికదా నీ డ్యూటీ నువ్వు సరిగా చేశావు. కుమార్ గది?" అడిగాడు మళ్ళీ.

"రూం నెంబర్ 79. కుడివైపున నాలుగో గది" చెప్పాడు కానిస్టేబుల్.

"కుమార్ గదికి దూరంగా ఎందుకు కూర్చున్నావు?" అడిగాడు యుగంధర్.

"కుమార్‌ని ఒక కంట కనిపెట్టమనీ, అతన్ని కనిపెడుతున్నామని అతనికి తెలియనివ్వద్దనీ ఇన్స్పెక్టర్ చెప్పాడు. అందుకే నేను హోటల్ తాలూకు మనిషిలా ఇక్కడ మెట్ల దగ్గిర కూర్చున్నాను" అన్నాడు అతను.

"ఎనీథింగ్ టు రిపోర్ట్?" అడిగాడు రాజు.

"లేదు సార్. కుమార్ తండ్రి శివరాంగారు, కుమార్ గదిలోకి వెళ్ళారు. అంతే" అన్నాడు కానిస్టేబుల్.

"శివరాం గది ఎక్కడున్నది?" అడిగాడు యుగంధర్.

"ఈ అంతస్థులోనే. అవతలవైపు - ఆ చివర. రూం నెంబర్ 602" చెప్పాడు కానిస్టేబుల్.

యుగంధర్ 79 నెంబర్ గది కాలింగ్ బెల్ నొక్కాడు. ఎవరూ తలుపు తియ్యలేదు. ఒక్క నిముషంపాటు బెల్ మీట నొక్కే వుంచాడు. లోపల గంట గణగణా మోగడం వినిపిస్తోంది. అంతే. అలికిడి లేదు. యుగంధర్ మునివేళ్ళతో తలుపు గట్టిగా తట్టాడు. అప్పటికీ కుమార్ తలుపు తియ్యలేదు.

"మిష్టర్ కుమార్! కుమార్" అని బిగ్గరగా పిలిచాడు. ఆ పిలుపుకీ జవాబు లేదు.

కానిస్టేబుల్ యుగంధర్ పక్కకి వచ్చి నిలుచున్నాడు.

"నువ్వు పొరబడ్డావనుకుంటాను. కుమార్ బయటికి వెళ్ళి వుండాలి" అన్నాడు యుగంధర్.

"నేను పొరబడలేదు సార్. నేను నా స్థానంలోంచి కదలలేదు సార్. కుమార్ గదిలోంచి బయటికి వచ్చివుంటే నాకు కనిపించేవాడు. నేను నా దృష్టి ఎటూ మరల్చలేదు" కానిస్టేబుల్ కంగారుగా చెప్పుకుపోతున్నాడు తనమీద కోపం వస్తుందనే భయంతో.

"అయితే కుమార్ ఎందుకు తలుపు తియ్యలేదంటావు?" అడిగాడు యుగంధర్.

"మొద్దునిద్రపోతున్నాడేమో సార్"

యుగంధర్ తల విదిలించి "ఎంత మొద్దునిద్ర అయినా ఇంత గొడవ జరుగుతుంటే లేచి వుండేవాడు" అన్నాడు. కానిస్టేబుల్ కంగారుగా "నేను హోటల్ మేనేజర్ దగ్గిరకి వెళ్ళి" అంటున్నాడు.

"అవసరంలేదు. నువ్వు వెళ్ళి నీ స్థానంలో కూర్చో, ఇటు చూడక."

రాజుని చూసి యుగంధర్ తలవూపాడు. రాజు జేబులోంచి కొన్ని వస్తువులు తీశాడు. అరచేతితో వాటిని కప్పిపట్టుకుని తలుపు తాళం క్షణంలో తీశాడు. తలుపుకున్న పిడి పక్కకి తిప్పాడు. క్లిక్ మన్నది. తలుపు తెరుచుకున్నది.

ముందు యుగంధరూ, వెనక అతని అసిస్టెంటు రాజు లోపలికి వెళ్ళారు.

అంతే. ఇద్దరూ రాతిబొమ్మల్లా వూపిరికూడా తీసుకోకుండా తలుపుదగ్గిరే ఆగిపోయారు.

ఇన్నేళ్ళుగా ఈ ఇద్దరు డిటెక్టివ్‌లూ ఎన్నో కేసులు పరిశోధన చేశారు. ఎంతో దౌర్జన్యాన్ని, ఎన్నో హింసల్ని, ఎంతో క్రౌర్యాన్ని కళ్ళారా చూశారు.

మనుషుల్లో వున్న క్రౌర్యాన్నీ, పైశాచికాన్నీ పూర్తిగా చూసేశాం అనుకున్నారు. కానీ యిప్పుడు ఈ క్షణంలో, యిక్కడ, ఈ గదిలో వాళ్ళు చూసిన దృశ్యం వేరు. ఇంతకుముందు వాళ్ళు చూసిన దృశ్యాలన్నిటికన్నా ఘోరంగా ఇక చూడలేక యిద్దరూ వెనక్కి తిరిగారు.

ఇద్దరికీ కడుపులో తిప్పినట్లయింది. ముచ్చెమటలు పోశాయి. యుగంధరే ముందు తేరుకున్నాడు. రాజు భుజం మీద చెయ్యివేసి "నువ్వు బయటికి వెళ్ళు రాజూ. స్వరాజ్యరావుని రమ్మని ఫోన్ చెయ్యి" అన్నాడు.

బలహీనంగా నవ్వాడు రాజు "అవసరంలేదు."

"ఈ పని చేసింది మనిషి కాదు. రాక్షసుడు. కసీ, ద్వేషమూ యీ రాక్షసత్వానికి కారణం అయ్యుండాలి" అన్నాడు యుగంధర్.

గదిమధ్య ఉన్నది మంచం. మంచంపైన కప్పుకి వున్న ఎలక్ట్రిక్ ఫ్యాన్ తిరుగుతోంది. అదొక్కటే ఆ గదిలో చలనం.

మంచం మీద శవం వెల్లకిలా వున్నది. శవం మొహం మీద, మొహం కనిపించకుండా రెండు అరిచేతులున్నాయి. అరిచేతులు మాత్రం వున్నాయి. చేతులు లేవు. అంటే అరిచేతులు నరికి, అరిచేతుల్ని మాత్రం విడివిడిగా మొహం మీద పెట్టాడు హంతకుడు.

దుప్పటి, దిండు, శవం ఒంటిమీద బట్టలు అన్నీ రక్తంతో తడిసి, ఎర్రగా వున్నాయి. అంత రక్తం అసలు ఒక మనిషి వొంట్లో వుంటుందా అని అనుమానం కలిగేటట్లున్నది. బిందెలతో ఎక్కణ్ణుంచో రక్తం తెచ్చి శవం మీదా, మంచం మీదా పోసినట్లున్నది.

శవం రెండు చేతులూ పక్కకి పూర్తిగా జాపి వున్నాయి. చేతులున్నాయి కానీ ఆ చేతులకి అరిచేతులు లేవు. అవి మొండిచేతులు.

పొట్ట అనేది లేదు. పొట్ట వుండేచోట ఎర్రని రక్తపు మడుగు మాత్రం వుంది. పొట్టలోంచి పేగులు బయటికి లాగి ఆ పేగులు ఛాతీమీదనించి మెడవరకూ ఏదో హారం వేసినట్లున్నది.

ఆ భీకరదృశ్యం చూస్తూ ఇద్దరు డిటెక్టివ్‌లూ చలనం లేకుండా నిలబడిపోయారు.

గదిలో భయంకరమైన నిశ్శబ్దం ఏర్పడింది. ఆ యిద్దరి ఊపిరి వాళ్ళకే సముద్రపు హోరులా వినిపిస్తోంది.

శవానికి జుట్టులేదు. అంతేకాదు తలమీద చర్మంలేదు. తోలు వొలిచినట్లు తెల్లగా పుర్రె కనిపిస్తోంది. "దీన్నే చిత్రవధ అంటారు కాబోలు. పాపం కుమార్ ఎంత బాధపడివుంటాడో" అన్నాడు రాజు.

యుగంధర్ క్షణంపాటు కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు తెరిచి ఒక్క నిట్టూర్పు వొదిలి, శవాన్ని సమీపించి తన మునివేళ్ళతో శవం మొహం మీద వున్న అరిచేతుల్ని పైకి ఎత్తాడు.

అంతే. ఇద్దరు డిటెక్టివ్‌లకీ ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లయింది. చనిపోయిన మనిషి కుమార్ కాడు. కుమార్ తండ్రి శివరాం. యుగంధర్ క్లయింట్ శివరాం.

## 7

యుగంధరూ, రాజు గదిలోంచి బయటికి వచ్చారు. రాజు తలుపు మూసి, గడియపెట్టాడు.

మెట్లదగ్గిర బెంచీమీద కూర్చున్న కానిస్టేబుల్ చటుక్కున లేచి నిలబడ్డాడు. రమ్మని సంజ్ఞ చేశాడు యుగంధర్. కానిస్టేబుల్ దగ్గరికి వచ్చిన తర్వాత "నువ్వు యీ తలుపు దగ్గిరే నిలుచో, తలుపు తియ్యకు. ఎవర్నీ, ఏ కారణం చెప్పినా, ఎటువంటి సందర్భంలోనూ లోపలికి వెళ్ళనివ్వద్దు" అని చెప్పాడు యుగంధర్.

"యస్ సర్" అన్నాడు కానిస్టేబుల్.

"రాజూ! నువ్వు వెళ్ళి ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుకి ఫోన్ చెయ్యి. వెంటనే తన పరివారంతో రమ్మని చెప్పు. ఆ తర్వాత ఈ హోటల్ మేనేజర్‌తో మాట్లాడు.

పోలీసులు వచ్చి బందోబస్తు యేర్పాట్లు చేసేంతవరకూ యీ హోటల్లోంచి పురుగుకూడా బయటికి వెళ్ళకుండా తగిన కట్టుదిట్టాలు చేయమను. ఆ యేర్పాట్లు నువ్వు దగ్గర వుండి చేయించు" అన్నాడు యుగంధర్.

"యస్ సర్" అని రాజు వెళ్ళిపోయాడు.

కానిస్టేబుల్ 79 నెంబర్ గది తలుపుకి అడ్డంగా నిలుచున్నాడు.

యుగంధర్ దీర్ఘంగా ఆలోచిస్తూ నడవా అవతల చివరవరకూ నడిచాడు. 62 నెంబర్ గదిముందు ఆగాడు. అదే శివరాం గది. క్షణంపాటు ఆ గది తలుపు పరీక్షగా చూసి బూట్ కాలితో తలుపుని నెమ్మదిగా తోశాడు. తలుపు తెరుచుకున్నది. అయినా యుగంధర్ లోపలికి వెళ్ళలేదు. తలుపు బయటే నిలుచుని గదిలోకి చూశాడు.

గది కిటికీ తలుపులు మూసి వున్నాయి. అయినా వెంటిలేటర్‌లోంచి వెలుగు బాగానే పడుతోంది. గదిలో ఎవరూ లేరు. గదిమధ్య మంచం. మంచం పక్కనున్న బల్లమీద పుస్తకాలు. మంచానికి కొంచెం దూరంలో కోట్‌స్టాండు. ఆ స్టాండ్ వంకీకి కోట్లు, పాంట్లు, తువ్వాళ్ళు వున్నాయి. బల్లమీద ఒక తోలుపెట్టె.

గదిలో ఏదో చప్పుడు ఎవరో కదిలినట్లు చప్పుడు అయింది. ఏమిటా చప్పుడు? ఎక్కణ్ణుంచి? గదిలో ఎవరూ లేరే, చప్పుడు ఎలా అయింది? యుగంధర్ చెవులు రిక్కించుకుని వింటున్నాడు. మళ్ళీ దడదడ చప్పుడయింది. నీళ్ళగదిలోంచి చప్పుడు వినిపిస్తోంది

యుగంధర్ జేబులోంచి రివార్వల తీశాడు. సేఫ్టీకాచ్ లాగేశాడు. మీటమీద వేలు పెట్టుకునున్నాడు తయారుగా. అడుగులో అడుగువేసుకుంటూ చప్పుడు చెయ్యకుండా నీళ్ళగది తలుపు దగ్గరికి వెళ్ళి చెవి తలుపుకి ఆనించి విన్నాడు.

చిన్న అలికిడి, ఏదో కదిలినట్లు వినిపించింది. యుగంధర్ ఒక్క అడుగు వెనక్కి వెళ్ళి కాలుజాపి, ఒక్క తన్ను తన్నాడు తలుపుని.

తలుపు బార్లా తెరుచుకున్నది. నీళ్ళగదిలో ఎవరూ లేరు. ఎవరూ పారిపోవడానికి యింకో తలుపు కానీ మార్గం కానీ లేదు.

షెల్ఫుమీద వున్న సోపు పెట్టెమీదనుంచి రెండు ఉడతలు కిచకిచమంటూ పరిగెత్తి పై నున్న వెంటిలేటర్ సందులోంచి పారిపోయాయి.

యుగంధర్ తన నెర్వస్‌నెస్‌కి తనే నవ్వుకున్నాడు. తను ఎన్నడూ ఇంత నెర్వస్ అవలేదు. కుమార్ గదిలో చూసిన భీకరదృశ్యం తనని అంత నెర్వస్‌గా చేసి వుండాలి.

వెనక్కి తిరిగాడు యుగంధర్.

చెవులు చిల్లులు పడేటట్టు, ఆ నిశ్శబ్దం బద్దలు చేస్తూ గణగణా మోగింది టెలిఫోన్. రిసీవర్ తీద్దామా, వద్దా అని రెండుక్షణాలు సందేహిస్తూ వుండిపోయాడు. జేబురుమాలుతో రిసీవర్ తీసి "హల్లో" అన్నాడు యుగందర్.

"హల్లో! డిటెక్టివ్ యుగంధర్. నా హెచ్చరిక వినిపించుకోలేదు. వినిపించుకుని, మీరు జోక్యం కల్పించుకోకుండా వుండి వుంటే, శివరాం బతికే వుండేవాడు. ఇప్పుడిక మీరు పశ్చాత్తాపపడి, యీ కేసునుంచి విరమించుకుంటానన్నా ప్రయోజనం లేదు. మీకూ అదే గతి పడుతుంది" టెలిఫోన్ డిస్కనెక్ట్ అయింది.

యుగంధర్ రిసీవర్ హుక్‌మీద పెట్టేశాడు. ఎవరీ మనిషి? తను ఎప్పుడు, ఎక్కడ, ఏం చేస్తున్నదీ, ఎవరితో మాట్లాడుతున్నదీ, ఏ క్షణానికి ఆ క్షణం ఆ మనిషికి ఎలా తెలుస్తోంది? ఎవరతను? మాంత్రికుడా? అతనికి దివ్యదృష్టి వుందా?

తను కుమార్ గదిలోకి వెళ్ళడం అతనికి తెలిసింది. తను శివరాం గదిలోకి రావడం అతనికి తెలిసింది. తను టెలిఫోన్ తీయగానే "హల్లో!" అనగానే "యుగంధర్" అంటూ సంబోధించాడు. ఆశ్చర్యం. మళ్ళీ జేబురుమాలుతో రిసీవర్ తీశాడు. "హల్లో ఆపరేటర్ దిస్ ఈజ్ రూం నెంబర్ సిక్స్‌టీ టూ. రెండు క్షణాల క్రితం యీ రూంకి ఒక టెలిఫోన్ కాల్ వచ్చింది. అది ఎక్కణ్ణించి వచ్చిందో చెప్పగలరా?" అడిగాడు.

"సారీ సర్. బయటినించి ఎక్కణ్ణుంచో వచ్చింది. రూం నెంబర్ 62 కావాలని అంటే కనెక్టు చేశాను" అన్నది టెలిఫోన్ ఆపరేటరు.

"థాంక్ యు" అని యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు.

యుగంధర్ మళ్ళీ ఆలోచిస్తున్నాడు. ఇది ఎలా సాధ్యం? ఈ హోటల్లో లేని, ఎక్కడో దూరాన, ఇంకెక్కడో వున్న మనిషికి తను శివరాం గదిలో వున్నట్టు ఎలా తెలిసింది? రిసీవర్ తను తియ్యగానే "హల్లో! యుగంధర్" అన్నాడు. ఎలా అంత నిశ్చయంగా తెలుసు?

ఏమిటీ విచిత్రం.

యుగంధర్ అనగానే స్వరాజ్యరావు కాస్త విసుగ్గా "ఏం నా వాదనలో లోపం ఏమిటి?" అడిగాడు.

"మీది వాదనకాదు. కేవలం అభిప్రాయం వెలిబుచ్చారు. సరే. మీరు అనుమానిస్తున్నట్లు కుమారే తండ్రిని హత్యచేశాడని అనుకుందాం. మీ పోలీస్ కానిస్టేబుల్ కాపలా వుండగా, వెయ్యికళ్ళతో కుమార్ వున్న గదిని కనిపెడుతూ వుండగా ఎలా గదిలోంచి బయటికి వచ్చాడు? ఎలా హోటల్లోంచి బయటికి వెళ్ళాడు? పోనీ హోటల్లోంచి ఎలాగో బయటికి వెళ్ళాడు అనుకున్నా తర్వాత ఏమయ్యాడు? టాక్సీ ఎక్కి వెళ్ళాడా? నడిచి వెళ్ళాడా? హోటల్ బయట కుమార్‌ని ఎవరూ చూడలేదా? హోటల్ గేటు జవాను విషయం

ఏమిటి? ఇంతమంది కళ్ళకి కనపడకుండా గాలిలో కలిసిపోయాడా? నో! నో! ఇన్స్పెక్టర్ మీరు చెపుతున్నంత, అనుకున్నంత సింపుల్ కేసు కాదు ఇది. ఇంకొక విషయం. శివరాం బలహీనుడు కాడు. కుమార్ భీముడు కాడు. శివరాం తన ప్రాణాన్ని రక్షించుకునేందుకు ఏ ప్రయత్నమూ చేయలేదు. పోట్లాట జరిగినట్లు కానీ శివరాం తన ఆత్మరక్షణకి ప్రయత్నం చేసినట్లు కానీ నిదర్శనం ఒక్కటీ లేదు. ఇక పోగా, ఈ కేసు దర్యాప్తు చెయ్యవద్దని నన్ను బెదిరిస్తూ ఎవరో టెలిఫోన్ చేశారు. ఆ టెలిఫోన్ కాల్స్ విషయం ఏమిటి? ఈ ప్రశ్నలకి వేటికీ మీరు సమాధానాలు చెప్పలేదు. చెప్పలేరు'' అని ముగించాడు యుగంధర్.

''అయితే మీ అభిప్రాయం ఏమిటి యుగంధర్. కుమార్ హంతకుడు కాడు. సరే, ఒప్పుకుంటాను. మరి కుమార్ ఏమయ్యాడు?''

''అదే మనం తెలుసుకోవాలి. హత్య జరిగిన గదిలో అన్ని వస్తువులూ అలాగే వున్నాయా?'' అడిగాడు యుగంధర్.

''శవాన్ని మార్చురీకి తీసుకెళ్ళారు. గదిలో చీపురుపుల్ల కూడా కదల్చలేదు. అన్నీ అలాగే వున్నాయి'' అన్నాడు ఇన్స్పెక్టర్.

''మీకు అభ్యంతరం లేకపోతే మళ్ళీ మనం అక్కడికి వెళదాం'' అన్నాడు యుగంధర్.

''అభ్యంతరమా! ప్లీజ్ రండి వెళదాం'' అని ఇన్స్పెక్టర్ లేచాడు.

ఒకళ్ళకి నలుగురు పోలీస్ కానిస్టేబుల్స్ వున్నారు నడవాలో. రూం నెంబర్ 79 తాళం వేసి వుంది. తలుపుకి అడ్డంగా నిలుచున్నాడు ఓ పోలీస్. ఇన్స్పెక్టర్ని చూడగానే సెల్యూట్ చేసి తలుపుకి అడ్డం తొలిగాడు. ఇన్స్పెక్టర్ తాళం తెరిచాడు. యుగంధర్, రాజు, స్వరాజ్యరావు ముగ్గురూ లోపలికి వెళ్ళారు.

మంచం మీద శవం లేదుకానీ రక్తమూ, మిగతా అన్ని వస్తువులూ అలాగే వున్నాయి. యుగంధర్ గది మధ్య నిలబడి గదంతా పరీక్షగా చూశాడు. యుగంధర్ దృష్టి రెండు కుర్చీల మధ్య వున్న బల్లమిదా, బల్లమీద వున్న రెండు కాఫీ కప్పులమీదా ఆనింది. వెళ్ళి కాఫీ కప్పులు చూశాడు. అడుగున రెండు కప్పుల్లో కాఫీ కాస్త మిగిలి వుంది. మడ్డిగా వుంది.

''ఈ కాఫీ కప్పులు గదిలోకి ఎలా వచ్చాయి?'' అడిగాడు యుగంధర్.

''హోటల్ కుర్రాడు తెచ్చివుంటాడు'' అన్నాడు ఇన్స్పెకటర్.

''కాపలా వున్న కానిస్టేబుల్ని పిలువూ రాజూ'' అని యుగంధర్ వొంగి కాఫీ కప్పుని జేబురుమాలుతో పైకి ఎత్తి వాసన చూశాడు. అంతలో రాజు కాపలా వున్న కానిస్టేబుల్తో వచ్చాడు గదిలోకి.

''కానిస్టేబుల్ నడవాలోనే కాపలా వున్నాననీ, శివరాం తప్ప కుమార్ గదిలోకి ఇంకెవ్వరూ వెళ్ళలేదనీ చెప్పావు. ఈ కాఫీకప్పులు యీ గదిలోకి ఎప్పుడు వచ్చాయి?'' అడిగాడు యుగంధర్.

''మీరు రాకముందు ఒక గంటన్నర క్రితం హోటల్ బాయ్ తీసుకెళ్ళాడు సార్'' అన్నాడు కానిస్టేబుల్.

''అవును. నీ తప్పుకాదు. అర్థమవుతోంది. హోటల్లో యూనిఫాంలో వున్న హోటల్ కుర్రాడు కాఫీ కప్పులు తీసుకుని గదిలోకి వెళితే ఎవరూ గదిలోకి వెళ్ళినట్లు అనిపించదు. ఆల్రైట్! ఈ గదిలోకి కాఫీ తీసుకువచ్చిన కుర్రాడు ఎవరో అతన్ని పిలుచుకురా'' చెప్పాడు యుగంధర్.

''యస్ సార్'' అని కానిస్టేబుల్ గదిలోంచి వెళ్ళాడు.

రాజు చేతిలో వున్న తోలుపెట్టె తీసుకుని బల్లమీద పెట్టి అందులోంచి కొన్ని సీసాలు, టెస్టుట్యూబ్‌లూ, ఒక స్పిరిట్ లాంప్ బయటికి తీశాడు యుగంధర్. ముందు ఒక కప్పు అడుగున వున్న కాఫీ ఒక కాఫీ టెస్ట్ ట్యూబ్‌లో పోసి, అందులో ఏదో మందులు కలిపాడు. దానిమిద 'ఎ' అని గుర్తుపెట్టాడు.

తర్వాత రెండో కప్పులో అడుగున వున్న కాఫీ యింకో టెస్ట్‌ట్యూబ్‌లో పోసి, దానిలోనూ మందు కలిపి 'బి' అని ఆ టెస్ట్‌ట్యూబ్ మీద రాశాడు. రెండు నిముషాల తర్వాత రెండింటినీ వేడిచేశాడు. బాగా వేడెక్కిన తర్వాత పైన వున్న కాఫీని యింకో సీసాలో పోసేశాడు. అడుగున మడ్డి తయారయింది టెస్ట్‌ట్యూబ్‌లో. మళ్ళీ ఆ మడ్డిలో యింకో మందేదో కలిపాడు. ఆ మడ్డి తెల్లరంగు అయింది.

"ఏమిటి తేలింది యుగంధర్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఈ రెండు కప్పుల్లో వున్న కాఫీలో చాలా ఘాటయిన మత్తుమందు కలపబడిందని తేలింది" అన్నాడు యుగంధర్.

అంతలో కానిస్టేబుల్ తిరిగి వచ్చి "హోటల్లో వున్న రూం బాయిస్ అందర్నీ పిలుచుకు వచ్చాను సార్" అన్నాడు.

"కాఫీ తెచ్చిన కుర్రాణ్ణి మాత్రం తీసుకురమ్మన్నాను" అన్నాడు యుగంధర్.

"మొత్తం పద్దెనిమిదిమంది రూం బాయిస్ వున్నారు యీ హోటల్లో. ఈ పొద్దున్న కాఫీ ఒక కప్పు తెచ్చి కుమార్ కాఫీ తాగిన తర్వాత ఖాళీ కప్పు తీసుకుని వెళ్ళానని ఒక రూంబాయ్ చెప్పాడు. తర్వాత మళ్ళీ ఎవరూ యీ గదికి కాఫీ తీసుకురాలేదంటున్నారు. అందుకని అందరినీ యిక్కడికి పిలుచుకు వచ్చాను సార్" కానిస్టేబుల్ చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు బయటికి వెళ్ళాడు.

"రాజూ! బీభత్సంగా వున్న శవాన్ని చూసినప్పుడు, మనం యిద్దరం యీ గదిలో యింకేమీ గమనించలేదు. ఇది కుమార్ గది. అతని పెట్టె, అతని బట్టలు, అతని చెప్పులు, కాయితాలు ఏవి లేవు. గది యింత ఖాళీగా ఎలా వుంది? ఎవరు ఎలా తీసుకుపోయారు గదిలోంచి సామానులన్నీ? నడవాలో పోలీస్ కానిస్టేబుల్ కాపలా వుండగా" అన్నాడు యుగంధర్.

"అవును. ఇంకొక విషయం. మనం యిక్కడికి వచ్చే గంటన్నర ముందు శివరాం.... కుమార్ గదికి వచ్చాడని కానిస్టేబుల్ చెప్పాడు. మళ్ళీ శివరాం తన గదికి వెళ్ళినట్లు చెప్పలేదు మరి..."

**"అవును.** నేను ఫోన్ చేసినపుడు... నేను దర్యాప్తు చేస్తానని శివరాంకి ఫోన్ చేసినపుడు, శివరాం తనగదిలో లేడు. ఇంకెవరో వుండి వుండాలి. శివరాంలా మాట్లాడి వుండాలి. అతనే క్షణం తర్వాత నన్ను బెదిరిస్తూ ఫోన్ చేసి వుండాలి నేను కేసు తీసుకున్నానని ఆ మనిషికి ఎలా తెలిసిందా అనే సంశయం తీరింది" అంతలో ఇన్‌స్పెక్టర్ తిరిగివచ్చాడు.

"హోటల్లో వున్న పనివాళ్ళనందరినీ తరిచి తరిచి ప్రశ్నించాను ఈ గదిలోకి వాళ్ళెవరూ కాఫీ తీసుకురాలేదని తేలింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కనుక ఎవడో హోటల్ బాయ్ దుస్తులలో యీ గదిలోకి కాఫీ తెచ్చివుండాలి. కాఫీలో మత్తుమందు కలిపాడు. ఆ కాఫీ తాగగానే శివరాం, కుమార్ ఇద్దరికీ స్పృహ పోయివుండాలి" అన్నాడు యుగంధర్.

యుగంధర్ ఆలోచనాక్రమాన్ని చెడగొట్టడం యిష్టంలేక రాజు, ఇన్‌స్పెక్టర్ మౌనంగా వుండిపోయారు.

"స్పృహ పోయిన కుమార్‌ని ఈ గదిలోంచి తీసుకువెళ్ళి వుండాలి. అంతేకాదు కుమార్ సామానులన్నీ యీ గదిలోంచి తీసుకువెళ్ళి వుండాలి. శివరాంని హత్య చెయ్యడం, అందులో అంత దారుణంగా హత్య చెయ్యడం ఐదు, పదినిమిషాల్లో పూర్తి అయ్యే

పనికాదు. కనీసం అరగంట అయినా పట్టివుంటుంది. స్పృహలేని కుమార్ గదిలో వుండగానే ఈ హత్య జరిగిందా లేక కుమార్‌ని ఈ గదిలోంచి తీసుకెళ్ళాక శివరాంని హత్యచేశారా అనేది యింకొక విషయం. ఏమయినా, నడవాలో కాపలా వున్న కానిస్టేబుల్ పూర్తి నిజం చెప్పడంలేదో లేక, పొరపాటు చేశాడో ఏదో జరిగింది. ఆ కానిస్టేబుల్‌ని పిలవండి'' అన్నాడు యుగంధర్.

ఇన్‌స్పెక్టర్ పిలవగానే కానిస్టేబుల్ గదిలోకి వచ్చాడు.

''నువ్వు భయపడవలసిన అవసరంలేదు. నేను అడిగే ప్రశ్నలకి జంకులేకుండా నిజం చెప్పాలి'' అన్నాడు యుగంధర్.

కానిస్టేబుల్ తలవూపాడు.

''కుమార్ గది. నెంబర్ 79లోంచి, కుమార్ని స్పృహలేని మనిషిని అతని వస్తువుల్ని యీ గదిలోంచి బయటికి తీసుకువెళ్ళారు. నువ్వు బయట వసారాలోనే కూర్చుని వున్నానన్నావు. రోజంతా నువ్వు యిక్కడే వుండి వుండాలి. కానీ, ఏ ఐదు నిముషాలో బయటికి వెళ్ళివుండాలి. లేదా, ఇంకేదో సంఘటన నీ దృష్టిని ఆకర్షించి, నువ్వు ఎటో చూస్తూ వుండి వుండాలి. జ్ఞాపకం చేసుకుని చెప్పాలి'' అన్నాడు యుగంధర్.

కానిస్టేబుల్ ఒక్క క్షణంపాటు ఆలోచించి ''అవును. ఒక పదినిముషాలు నేను'' అని ఇన్‌స్పెక్టర్‌ని చూసి ఆగిపోయాడు.

''ఊ! చెప్పు'' అన్నాడు యుగంధర్.

''హోటల్ బాయ్, కుమార్ గదిలోకి వెళ్ళిన కాసేపటి తర్వాత నడవా అవతలవైపున, అంటే శివరాం గదికి ఎదురుగది ప్రాంతాల గొడవ జరిగింది'' అన్నాడు కానిస్టేబుల్.

''ఏం గొడవ?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

''ఇద్దరు తాగినవాళ్ళు గది తలుపు దగ్గిర గొడవ ప్రారంభించారు. ఒకతను తన గది అనీ, రెండో అతను తన గది అనీ తలుపు దగ్గిర గొడవ ప్రారంభించి కొట్టుకునేటంతవరకూ వచ్చారు అప్పుడు నేను వెళ్ళి యిద్దర్నీ విడదీశాను. వాళ్ళమధ్య తగాదా తీర్చి సర్దుబాటు చేసేదుంకు దాదాపు పదినిముషాలు పట్టి వుంటుంది'' చెప్పాడు కానిస్టేబుల్.

''ఇంతకీ ఆ తగాదా ఎలా తీరింది?'' అడిగాడు రాజు.

కానిస్టేబుల్ చిన్న నవ్వు నవ్వి ''నిజానికి యిద్దరూ అదే గదిలో వుంటున్నారు. బాగా తప్పతాగి వున్నారేమో'' అన్నాడు.

''రాజూ! నువ్వు కానిస్టేబుల్‌తో వెళ్ళి, ఆ గదుల్లో ఎవరున్నారో చూసిరా'' అన్నాడు యుగంధర్. రాజు వెళ్ళిపోయాడు.

యుగంధర్ దీర్ఘంగా ఆలోచిస్తూ యిటూ, అటూ పచార్లు చేస్తున్నాడు ''ఏమిటీ ఆలోచిస్తున్నారు?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

''స్పృహలేని కుమార్‌నీ, అతని వస్తువులనీ, యీ హోటల్లోంచి బయటికి తీసుకువెళ్ళడానికి పదినిముషాల వ్యవధి చాలదు. అంతేకాదు, కానిస్టేబుల్ యిటు తిరిగాడంటే, కుమార్ గదివైపు చూశాడంటే ఆ హంతకులు పట్టుబడి పోతారు. ఆ విషయం ఆలోచిస్తున్నాను'' అని చటుక్కున సార్జంటువైపు తిరిగి ''ఈ గదికి ఎదురుగా వున్న రెండు మూడు గదుల్లో ఎవరెవరు వున్నారో తెలుసుకురా'' అన్నాడు యుగంధర్. సార్జంటు శివం గదిలోంచి బయటికి వెళుతున్నాడు. రాజు తిరిగి వచ్చాడు.

''ఆ గదుల్లో యిప్పుడు ఎవరూ లేరు. ఎవరో యిద్దరు పొద్దున్న దిగారుట. మనం రాకముందు పదినిముషాల ముందే గది ఖాళీ చేశారుట'' చెప్పాడు రాజు.

''ఆ యిద్దరూ హంతకుల మనుష్యులని అనుకోవచ్చు. కానిస్టేబుల్ దృష్టి యింకోవైపు తిప్పేందుకు వాళ్ళు ఆ పన్నాగం పన్నారు అనీ అనుకోవచ్చు'' యుగంధర్ తలుపువైపు చూశాడు. సార్జంటు వచ్చాడు.

"ఈ గదికి ఎదురుగా వున్న రెండుగదుల్లో ఓ గదిలో ఒక డాక్టర్ వున్నారు. ఆయన తిరుపతినించి వచ్చారు వేలూరు వెళుతున్నారు. ఇంకోగదిలో ఎవరూ లేరు. ఇవాళే ఖాళీ చేశారుట. ఇద్దరు దిగారుట. వాళ్ళు కోయంబత్తూరునించి వచ్చారుట. ఆ యిద్దరూ స్టెయిన్‌లెస్ స్టీల్ వ్యాపారస్తులుట. ఈ హోటల్లో యీ గొడవ ప్రారంభం కాకముందు వెళ్ళిపోయారు గది ఖాళీచేసి" అన్నాడు సార్జంటు.

"ఆల్‌రైట్ ఆ గది తెరిచేవుందా?" అంటూ గదిలోంచి బయటికి వెళ్ళాడు యుగంధర్. కూడా రాజు, ఇన్‌స్పెక్టర్, సార్జంటు వెళ్ళారు ఎదురుగా వున్న గదిలోకి. అన్ని గదుల్లాగే వున్నది ఆ గది. రెండు మంచాలు, డ్రెస్సింగ్ టేబుల్, కోట్ స్టాండ్, బల్లలు, కుర్చీలు వాష్‌బేసిన్, బాత్‌రూం.

యుగంధర్ గది మధ్య నిలబడి గదంతా పరీక్షగా చూశాడు. చటుక్కున వంగి, నేలమీదనించి ఏవో ఏరడం మొదలుపెట్టాడు. యుగంధర్ ఏమిటి తీస్తున్నాడో చూసి రాజుకూడా ఏరడం మొదలుపెట్టాడు.

"ఏమిటి వెతుకుతున్నారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మేకులు, చిన్న చిన్న మొక్కలు. ఈ తివాసీమీద ఏదో బరువు వస్తువు పెట్టినట్లు, లాగినట్లు గుర్తులున్నాయి" అన్నాడు యుగంధర్.

"ఈ గదిలో వున్నవాళ్ళు స్టెయిన్‌లెస్ స్టీల్ వ్యాపారస్తులు కదా! బహుశా సామానులు" అంటున్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఔను. వాటిని చెక్కపెట్టెల్లో తీసుకువెళ్ళి వుండాలి. ఆ చెక్కపెట్టెలు ఎంత పెద్దవో. ఎన్నో. ఎప్పుడు ఎలా తీసుకెళ్ళారో కనుక్కోవాలి" యుగంధర్ అనగానే రాజు గదిలోంచి బయటికి వెళ్ళాడు.

అంతలో గది తలుపు దగ్గిర ఎవరో వచ్చి నిలుచునుండడం యుగంధర్ గమనించి "ఎవరది?" అడిగాడు.

అతను లోపలికి రాబోతుంటే సార్జంటు అడ్డం వెళ్ళి, "ఎవరు మీరు అసలు మిమ్మల్ని యిక్కడికి ఎవరు రానిచ్చారు? ఎలా వచ్చారు?" అడిగాడు.

తలుపు దగ్గర నిలుచున్న అతను ముప్పయిఏడు ఏళ్ళలోపున మనిషి సన్నగా, పొడుగ్గా, చాకులా వున్నాడు.

"యుగంధర్‌గారితో మాట్లాడడానికి వచ్చాను" అన్నాడు.

సార్జంటు యింకా ఏదో ప్రశ్నించబోతున్నాడు. యుగంధర్ తలుపు దగ్గరకి వెళ్ళి "యస్" అన్నాడు.

ఆ వచ్చిన యువకుడు యుగంధర్‌కి అరిచెయ్యి చూపించాడు.

"అరిచేతిలో సిరాతో `ఏ.ఐ4` అని వుంది.

యుగంధర్‌కి అర్థమైంది. ఎ - అంటే ఏజెంటు.

ఐ - అంటే యింటిలిజెంటు. 4 - అతని నెంబర్.

"కమ్ యిన్" అన్నాడు యుగంధర్.

అంతలో రాజు గదిలోకి తిరిగివచ్చాడు. "యు ఆర్ కరెక్టు. ఈ గదిలో దిగినవాళ్ళు యిద్దరు. వాళ్ళ పేర్లు కోదండపాణి, స్వామినాథన్. మనం ఈ హోటల్లోకి రాకముందు గంటముందు వాళ్ళు గది ఖాళీచేసి వెళ్ళారు. వాళ్ళు కొన్ని స్టెయిన్ లెస్ స్టీల్ షీట్సు తీసుకువెళుతున్నామనీ చెప్పారుట ఆ వ్యాపారస్తులు. వాళ్ళ స్వంతవ్యాన్ అది. అందులో ఆ పెట్టెలు పెట్టుకుని మిగతా సామానులు సర్దుకుని వెళ్ళిపోయారుట. ఆ వ్యాన్ నెంబర్ ఎం.ఎస్.ఎల్.989092. కోయంబత్తూర్లో వాళ్ళ అడ్రస్ ఆండాళ్ అమ్మాజీ వీధి. నెంబర్ 82. ఎక్స్‌లెంట్ స్టెయిన్‌లెస్ స్టీల్ కంపెనీ" అని ముగించాడు రాజు.

యుగంధర్ స్వరాజ్యరావు వైపు చూసి "ఇన్ స్పెక్టర్ ఆ వ్యాన్ గురించి వాళ్ళ గురించి వెంటనే తెలుసుకునేందుకు ప్రయత్నించండి" అన్నాడు.

9

యుగంధర్ కన్సల్టింగ్ రూమ్‌లో యుగంధర్, రాజూ, ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు, స్పెషల్ బ్రాంచి ఏజెంట్ కూర్చుని వున్నారు.

"మీ పేరు?" అడిగాడు యుగంధర్ ఏజెంట్‌ని.

"శంకర్"

"మిష్టర్ శంకర్ మీరు నాకు కొన్ని విషయాలు చెప్పాలన్నారు. ఇక్కడికి వచ్చి మనం కూర్చుని అయిదు నిముషాలయింది. సందేహిస్తున్నారు ఎందువల్ల? ఇక్కడ నా అసిస్టెంటు రాజు వున్నాడనా? నేను దర్యాప్తు చేసే ప్రతికేసు విషయమూ రాజుకు చెప్తాను కనుక నిస్సంకోచంగా మీరు మాట్లాడవచ్చు" అన్నాడు యుగంధర్.

"నాకు అభ్యంతరం లేదు. అది మీ బాధ్యత" అన్నాడు శంకర్.

"ప్రారంభించండి" అన్నాడు యుగంధర్.

శంకర్ గొంతు సవరించుకున్నాడు. "కుమార్ కనిపించడంలేదనీ మా బాస్, అంటే స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్‌కి ట్రంకాల్ చేసి చెప్పాను. వెంటనే మిమ్మల్ని కలుసుకుని వివరాలనీ మీకు చెప్పమన్నారు" అన్నాడు శంకర్.

"మొదటనుంచీ నాకు అనుమానంగానే వుంది యీ కేసు సామాన్యమైన కేసు కాదని. ఆల్ రైట్. ఆ వివరాలు ఏమిటో చెప్పండి" అన్నాడు యుగంధర్.

"దాదాపు రెండు నెలల క్రితం నాకు మా డిపార్టుమెంట్ నించి ఆదేశం వచ్చింది. కుమార్ అనే అతన్ని ఓ కంట కనిపెడుతూ వుండమని, అతనికి ఎటువంటి ప్రమాదము జరగకుండా చూడమని. ఈ రెండు నెలలూ నేను, నా అసిస్టెంటూ కుమార్‌కి నీడలా వున్నాము. ఈ విషయం కుమార్‌కి తెలియదు. ఊటీనించి కుమార్, అతని తండ్రి శివరాం మద్రాసుకి వచ్చారు. కుమార్ తల్లి విశాఖపట్నం వెళ్ళిపోయింది. కుమార్ మా హోటల్ శరత్‌లో రూం నెంబర్ 79లో, శివరాం నెంబర్ 62లో బస చేశారు. మేమూ అదే హోటల్లో, అదే అంతస్తులో కుమార్ గదికి ఎదురుగా వున్న గది పక్కగదిలో బసచేశాము. రాత్రింపగళ్ళు నేను, నా అసిస్టెంట్ కుమార్‌ని కనిపెడుతూనే వున్నాము. అయినా" అని ఆగాడు శంకర్.

"అయినా?" అడిగాడు యుగంధర్.

"అయినా కుమార్ అదృశ్యమయ్యాడు."

"అదృశ్యమయ్యాడు అంటున్నారు. కళ్ళార్పకుండా మీరూ, మీ అసిస్టెంటు కుమార్ గదివైపే చూస్తూ కూర్చున్నాము అంటున్నారు. అయినా కుమార్ గదిలోంచి ఎలా వెళ్ళిపోయాడు" అడిగాడు యుగంధర్.

"అదే నాకు ఆశ్చర్యంగా వుంది. నా అసిస్టెంటు మంచం మీద పడుకుని నిద్రపోతున్నాడు. నా వంతు వచ్చింది. నేను మా గది తలుపు దగ్గిర కుర్చీ వేసుకుని కూర్చున్నాను మా గది తలుపు ఒక రెక్క కొద్దిగా తెరిచిపెట్టి, ఆ చిన్న సందులోంచి కుమార్ గదివైపే చూస్తూ కూర్చున్నాను. అంతకుముందే నిద్రపోయి లేచాను. చల్లనీళ్ళతో మొహం కడుక్కుని కాఫీ తాగి కూర్చున్నాము. విచిత్రం. ఎలా పట్టిందో, ఎందుకు నిద్రపట్టిందో తెలియదు. ఆ కుర్చిలో వెనక్కి వాలిపోయి మొద్దునిద్ర పోయాను. మళ్ళీ మెలుకువ వచ్చేటప్పటికి నడవాలో చాలా గొడవగా వుంది. విచారిస్తే శివరాం, కుమార్ గదిలో హత్య చేయబడ్డాడనీ, కుమార్ గదిలో లేడనీ తెలిసింది. మీరు,

ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు హోటల్ నౌకర్లని ప్రశ్నిస్తున్నారనీ, దర్యాప్తు చేస్తున్నారనీ తెలిసింది. వెంటనే ఈ విషయం మా స్పెషల్ బ్రాంచ్ డైరెక్టర్ బండార్కర్ గారికి ట్రంకాల్ చేసి చెప్పాను" అని ముగించాడు శంకర్.

యుగంధర్ నవ్వి "వాట్ ఏ సింపుల్ ట్రిక్. మీరు గది తలుపులు కొద్దిగా తెరిచి పెట్టుకుని కూర్చున్నారు. తలుపు వెనక కుర్చీలో మీరు కూర్చునుండటం పరీక్షగా చూసినవాళ్ళకి కనిపిస్తుంది. అవునా?" అడిగాడు.

శంకర్ తలవూపాడు.

"మీ గది తలుపు పక్కకి వచ్చి గోడకో, ఇంకెక్కడో ఆనుకుని నిలుచుని యీథర్ వాయువులాటి మత్తుమందు మీ గదిలోకి స్ప్రేగన్‌తో పంపు చేసి వుండాలి. అందువల్లే మీకు స్పృహపోయి వుంటుంది" అన్నాడు యుగంధర్.

శంకర్ ఆలోచనలో పడ్డాడు. ఏదో జ్ఞాపకం చేసుకుంటున్నట్లు రెండు క్షణాలు కళ్ళు మూసుకుని "అవును. మీరు చెపుతుంటే జ్ఞాపకం వస్తోంది. ఏదో తియ్యని వాసన వచ్చింది గదిలోకి. ఆ తరువాత నాకు మొద్దునిద్ర పట్టింది. హోటల్ వాళ్ళు డిస్ ఇన్ ఫెక్టెంట్ స్ప్రే చేస్తున్నారని అనుకున్నాను" అన్నాడు.

"దట్ యీజ్ ఆల్ రైట్ జరిగింది జరిగిపోయింది. స్పెషల్ బ్రాంచికి కుమార్ విషయం యింత శ్రద్ధ ఎందుకు కలిగింది?" అడిగాడు యుగంధర్.

"నాకు తెలియదు. నాకు చెప్పలేదు. తనకి ఫోన్ చెయ్యమని మీకు బండార్కర్ చెప్పమన్నారు" అన్నాడు శంకర్.

"ఆల్ రైట్ తరువాత బండార్కర్‌కి ఫోన్ చేస్తాను. మీరు హోటల్ శరత్‌లో కుమార్ రూంకి ఎదురుగా వున్న గదిలో వుండి కుమార్ గదిని కనిపెడుతూ వున్నారు కదా! శివరాం హత్యగురించి కానీ, కుమార్ అదృశ్యం అవడం గురించి కానీ ఏమైనా చెప్పగలరా? కుమార్‌ని కలుసుకొనడానికి అతని గదిలోకి ఎవరయినా వచ్చారా?" అడిగాడు యుగంధర్.

"అతని తండ్రి శివరాం తప్ప కుమార్ గదిలోకి ఎవరూ వెళ్ళలేదు. అంతవరకూ నిశ్చయంగా చెప్పగలను. నాకు స్పృహ పోయిన తర్వాత కుమార్ గదిలోకి ఎవరు వెళ్ళారో నేను చెప్పలేను" అన్నాడు శంకర్.

"ఊటీలో కూడా మీరు కుమార్‌ని ఓ కంట కనిపెడుతూనే వున్నామని చెప్పారు. పోనీ, నజీమ్ హత్య గురించి ఏమైనా చెప్పగలరా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"కుమార్, నజీమ్‌లతో పాటు నేను, నా అసిస్టెంటు ఊటీ వెళ్ళాము. వాళ్ళు దిగిన కాటేజీకి కొంచెం దూరంలో వున్న కాటేజీ మేము అద్దెకి తీసుకుని వున్నాము. నేను, నా అసిస్టెంటు వంతులమీద కిటికీ దగ్గర బైనాక్యులర్స్ పట్టుకుని కుమార్‌వైపే చూస్తున్నాము. వారం రోజుల పాటు వాళ్ళు యిద్దరూ కాటేజీలోనే వున్నారు. అసలు బయటికి కదలలేదు ఇద్దరూ. నజీమ్ ఒకసారైనా వసారాలోకి కూడా రాలేదు కుమార్ మాత్రం భోజనానికో, కాఫీకో కేరియరో ఫ్లాస్కో తీసుకుని హోటల్‌కి వెళ్ళి వచ్చేవాడు. అదీ రోజూ అన్ని పూట్లా వెళ్ళేవాడు కాడు. ఒక్కొక్కరోజున అసలు కాటేజీలోంచి కదిలేవాడు కాడు. ఏం తినేవాళ్ళో ఏం తాగేవాళ్ళో. ఇక హత్య జరిగిన రాత్రిగురించి చెపుతాను. కుమార్ క్యారియర్ తీసుకుని కాటేజిలోంచి బయటికి వచ్చి కాటేజీకి తాళం వేసి బయలుదేరాడు. నేను కుమార్ కూడా బయలుదేరాను."

"మీ అసిస్టెంటు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మా కాటేజీలోనే వున్నాడు. నేను కుమార్ వెనకే అతనికి తెలియకుండా అతన్ని వెంబడించాను. అతను హోటల్‌కి వెళ్ళి కేరియర్లో అన్నం పెట్టించుకుని కాటేజీకి తిరిగివచ్చాడు. అతను కాటేజీకి వెళ్ళాక నేను మా కాటేజీకి వెళ్ళాను."

"తర్వాత?" అడిగాడు యుగంధర్.

"ఆ రాత్రంతా నేను, నా అసిస్టెంటు కుమార్ కాటేజీని కనిపెడుతూనే వున్నాము. పొద్దున్న అయాక కాటేజీ కుర్రాడు వచ్చి వెళ్ళిపోయాక, పోలీసులు వచ్చాక కానీ జరిగిన విషయం ఏమిటో మాకు తెలియలేదు."

"మీరు కుమార్‌ని వెంబడించి వెళ్ళారు కదా! మీ అసిస్టెంటు కాటేజీని కనిపెడుతూ లేడా?" అడిగాడు రాజు.

"లేడు. నా అసిస్టెంటు స్నానానికి వెళ్ళాడు. ఆ తర్వాత అతను ఏదో ఉత్తరాలు రాస్తూ కూర్చున్నాడట. కుమార్‌ని కనిపెట్టటమే మా పని. కుమార్‌ని వెంబడించి నేను వెళుతున్నానని అతనికి చెప్పాను. అతని వంతు సాయంకాలమే అయిపోయింది. మళ్ళా రాత్రి పన్నెండు గంటలనించీ కాపలా కాయం అతనివంతు" అన్నాడు శంకర్.

"వాటే పిటీ! మీ అసిస్టెంట్ కనుక కాటేజీని కనిపెడుతూ వుండివుంటే కాటేజీలోకి ఎవరు వెళ్ళారో చూసేవాడు. హత్యచేసింది ఎవరో తెలిసేది? అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అవును. కుమార్‌కి ఏ ఆపదా రాకుండా చూడమని మాకు ఆదేశం. నజీమ్ విషయం మాకు ఇన్‌స్ట్రక్షన్స్ లేవు. అంతేకాక మధ్యాహ్నంనుంచి కదలకుండా బైనాక్యులర్స్ పట్టుకుని కూర్చున్నాడు నా అసిస్టెంటు కిటికీ దగ్గర."

"మిమ్మల్ని, మీ అసిస్టెంటుని తప్పుపట్టడంలేదు మిష్టర్ శంకర్. మీరు మీ పని చేశారు. బాగానే చేశారు. థాంక్ యు. ఇంతేనా, ఇంకేమైనా చెప్పవలసింది వుందా?" అడిగాడు యుగంధర్.

"ఒక్క విషయం మాత్రం మీకు చెప్పాలి. చాలా ముఖ్యమైన విషయం హత్యకి సంబంధించిన విషయం" అన్నాడు శంకర్.

"ఏమిటది?" అడిగాడు యుగంధర్.

"హత్య చెయ్యబడిన మనిషి.. ఆ స్త్రీ.. నజీమ్ కాదు."

"ఏమిటీ? నజీమ్ కాదా? నజీమ్ కాకపోతే మరెవరు?" అరిచాడు ఇన్‌స్పెక్టర్.

"హత్య చెయ్యబడిన స్త్రీ ఎవరో నాకు తెలియదు. ఆమె నజీమ్ అని ఆమె తండ్రీ, అన్న, అందరూ గుర్తుపట్టారు. కుమార్ తండ్రి శివరాం ఐడెంటిఫై చేశారు. తన భార్య హత్య చెయ్యబడిందని కుమార్ భోరున ఏడ్చాడు. వీళ్ళందరికి కళ్ళు లేవా? మతులు చెడాయా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఐ యామ్ వెరీసారీ ఇన్‌స్పెక్టర్. మీరు నా మీద కోపం తెచ్చుకుని ప్రయోజనం లేదు. నేను కొంతకాలం నించీ కుమార్‌ని వెంటాడుతున్నానని చెప్పానుగా. విశాఖపట్టణంలో కుమార్‌ని, నజీమ్ పార్కులో మొదటిసారి కలుసుకున్నప్పటినుంచీ యిద్దరూ రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళిచేసుకొనడం వరకూ చూశాను. ఊటీకి వాళ్ళు రైలులో వచ్చినపుడు నేను పక్క కంపార్టుమెంటులో ఎక్కి ప్రతి స్టేషన్‌లో, రైలు ఆగినప్పుడల్లా యిద్దర్నీ చూస్తూ వచ్చాను. జనీమ్‌ని చాలా దగ్గరగా, చాలాసార్లు చూశాను. కుమార్ గదిలో ఆ రాత్రి హత్యచెయ్యబడ్డ స్త్రీ నజీమ్ కాదని నిశ్చయంగా చెప్పగలను."

"మిష్టర్ శంకర్! చనిపోయిన స్త్రీ నజీమ్ అని గుర్తుపట్టిన సులేమాన్, శివరాం, ఆమె భర్త కుమార్‌ల కన్నా నజీమ్‌తో మీకు పరిచయం ఎక్కువ అని చెప్పగలరా?" అడిగాడు ఇన్‌సెప్క్టర్

"అవును. మీరు అడిగితే జ్ఞాపకం వచ్చింది. కుమార్ తండ్రి శివరాం నాకు తెలిసినంత వరకూ నజీమ్‌ని దగ్గిరగా ఎప్పుడూ చూడలేదు. ఆమె నజీమ్ అని శివరాం ఎలా గుర్తుపట్టాడో నాకు అర్థంకాకుండా వుంది. కుమార్ ఏ కారణం వల్ల మీతో అబద్ధం చెప్పాడో వూహించలేకుండా వున్నాను."

"మైడియర్ ఫెలో అబద్ధం చెప్పడం కాదు, రాత్రంత భోరున ఏడ్వడం నజీమ్‌ని చంపిన మనిషిని చంపుతానని శపథం పట్టడం, అంతా అతను నాటకం ఆడాడంటావ్. నేను నమ్మలేను. నజీమ్ విషయంలో పొరపాటు మీదే అంటాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

శంకర్ తొణకలేదు. బెణకలేదు. "హుస్సేన్, నజీమ్ తండ్రి. చనిపోయిన స్త్రీ నజీం అని చెప్పడానికి కారణాలు ఏమైనా వున్నవేమో తెలుసుకోవాలి. రికార్డులకోసం నేను నజీమ్‌ని, కుమార్‌ని కలిపి ఒక ఫోటో తీశాను వాళ్ళకి తెలియకుండా వాళ్ళు పార్కులో వుండగా. ఇదిగో ఫోటో. అందులోంచి నజీం మొహం మాత్రం విడిగా ఎన్‌లార్జ్ చేశాను. మీరే చూడండి" అంటూ రెండు కార్డు సైజు ఫోటోలు ఇన్‌స్పెక్టర్‌కి యిచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ ఆ రెండు ఫోటోలు పరిశీలనగా చూసి, "యస్.. యీ ఫోటోలో వున్న అమ్మాయి నజీం అయితే, చనిపోయిన స్త్రీ నజీం కాదు" అంటూ ఫోటో యుగంధర్‌కి యిచ్చాడు.

"కేసు చాలా విచిత్రమైన మలుపులు తిరుగుతోంది. మిష్టర్ శంకర్ మీరు యింకా చెప్పవలసిన విషయాలున్నాయా?" అడిగాడు యుగంధర్.

"ఇంకేమీలేవు. నేను హోటల్ శరత్‌లోనే వుంటున్నాను. మీకు రిపోర్టు చేసిన మరుక్షణం నించీ మీ అజ్ఞానుసారం నన్ను, నా అసిస్టెంట్‌ని నడుచుకొమ్మని బండార్కర్ చెప్పారు. నేను ఏం చెయ్యాలో మీరే చెప్పండి" అన్నాడు శంకర్.

"వెరీగుడ్ మీరు హోటలుకి వెళ్ళండి. మీకు మళ్ళీ నేను కబురు చేస్తాను అవసరం కలగగానే" అన్నాడు యుగంధర్.

శంకర్ వెళ్ళిపోయాడు.

టెలిఫోన్ గణగణా మోగింది. రాజు రిసీవర్ తీసుకుని "ఇన్‌స్పెక్టర్ మీకు" అంటూ స్వరాజ్యరావుకి అందించాడు రిసీవర్. అయిదునిముషాలు మాట్లాడి రిసీవర్ హుక్ మీద పెట్టేసి, "ఆ వ్యాన్ నెంబర్ దొంగ నెంబర్. ఆ నెంబర్ కల వ్యాన్" అంటున్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఎవరిది?" అడిగాడు రాజు నవ్వుతూ.

"అది మినిస్టరీ ఆఫ్ ఫుడ్ ది. సెంట్రల్ గవర్నమెంటుది. నెలరోజులుగా రిపేరులో వుంది. గవర్నమెంటు వర్కుషాపులో వుంది. ఇంకా అక్కడే వర్కుషాపులో వుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఊఁ! తర్వాత?" అడిగాడు యుగంధర్.

"కోయంబత్తూరులో ఎక్సలెంట్ స్టెయిన్‌లెస్ స్టీల్ కంపెనీ అనేదే లేదుట. ఆండాళ్ అమ్మాళ్ నెంబర్ 82 యిల్లే లేదుట" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అయితే యిక సందేహం లేకుండా తేలిపోయింది. కుమార్‌ని ఆ చెక్కపెట్టెలో పెట్టి తీసుకుని వెళ్ళివుండాలి" అన్నాడు యుగంధర్.

"కుమార్ని అంటే.. కుమార్ని చంపి కుమార్ శవాన్నా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"కుమార్‌ని చంపడమే వుద్దేశ్యం అయితే కుమార్ని చంపి శివరాం శవంతోపాటు అతని శవాన్నీ ఆ గదిలోనే అక్కడ వొదిలి వెళ్ళివుండేవారు. కుమార్ సజీవంగా, బతికున్న మనిషిగా అవసరమై అతన్ని ఎత్తుకుపోయి వుండాలి" అన్నాడు యుగంధర్.

ఇన్‌స్పెక్టర్ ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగాడు రాజు.

"ఈ కేసు చాలా గందరగోళంగా తయారయింది. చనిపోయిన మనిషి శివరాం కాదని యింకెవరో వచ్చి చెపుతారని భయంగా వుంది. ఏమంటావ్?" అన్నాడు స్వరాజ్యరావు.

"అవును. ఇది సింపుల్ కేసు కాదు. కుమార్ చేస్తున్న పరిశోధనకీ యీ హత్యలకీ సంబంధం వుంది. ఆ పరిశోధన గురించి వివరాలు తెలియాలి మనకి ముందు. బండార్కర్‌కి ట్రంక్ కాల్ బుక్ చేస్తాను" అన్నాడు యుగంధర్ రిసీవర్ తీస్తూ. అంతలో బజర్ చప్పుడయింది. రాజు లేచి వెళ్తున్నాడు.

"జాగ్రత్త రాజూ! మనల్ని చంపుతామని బెదిరిస్తున్న విషయం మర్చిపోక" అని హెచ్చరించాడు యుగంధర్. రాజు రివాల్వర్ తీసుకుని వెళ్ళాడు. నిముషం తర్వాత స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్‌తో తిరిగి వచ్చాడు.

"మీకు నూరేళ్ళు. ఇప్పుడే మీకు ట్రంకాల్ చెయ్యాలని అనుకుంటున్నాను" అన్నాడు యుగంధర్.

"ఫోన్‌లో మాట్లాడడం కన్నా సమక్షంలో మాట్లాడడం మంచిదని నేనే వచ్చేశాను. ఏర్‌పోర్టునించి తిన్నగా వచ్చాను యిక్కడికి. మా ఏజెంటు ఎ.ఐ.4 మిమ్మల్ని కలుసుకున్నాడా?" అడిగాడు బండార్కర్.

"ఆ! ఇప్పుడే వెళ్ళాడు. తనకి తెలిసిన విషయాలు చెప్పాడు. కానీ అతనికి తెలిసిన విషయాలు చాలా తక్కువ" చెప్పాడు యుగంధర్.

"అవును. కుమార్‌కి యే ఆపదా కలగకుండా అతన్ని కనిపెట్టమన్నాను. అంతకన్నా అతనికి యేమీ చెప్పలేదు. ఇటువంటిది జరుగుతుందని నేను అనుకోలేదు" అన్నాడు బండార్కర్.

"ఆల్‌రైట్ అసలు కుమార్ గురించి మీ డిపార్ట్‌మెంటు ఎందుకు యింత యింట్రెస్ట్ చూపించింది? యేమిటి కథ?" అడిగాడు యుగంధర్.

"కుమార్ ఎం.ఎస్.సి పాసయి కొత్త లోహాల గురించి పరిశోధన చేస్తున్నాడు డాక్టరేట్ కోసం. అతను యూనివర్శిటీకి పంపిన కాయితాలలో అతను ఒక కొత్త లోహం కనుక్కున్నట్లు వుంది. నిజంగా అటువంటి లోహమే తయారు చెయ్యగలిగితే దేశరక్షనకి దాని ఉపయోగం యింతా అంతాకాదు. ఇటు చైనాకానీ, అటు పాకిస్తాన్ కానీ, మరే దేశం కానీ యిక ఎన్నడు మన దేశం మీదికి యుద్ధానికి రాదు. అసలు అటువంటి ఆలోచనే రాదు."

"అలాగా! అంత ముఖ్యమైన లోహం కనుక్కున్న కుమార్‌ని ఏదో లాంఛనంగా కనిపెట్టి వుండమని మీరు మీ ఏజెంటుకి చెప్పడం ఆశ్చర్యంగా వుంది. కుమార్‌ని వెంటనే ఎందువల్ల మీరు ఢిల్లీకి తీసుకెళ్ళి అక్కడ తగిన రక్షణ యిచ్చి, అతనికి పరిశోధనా కేంద్రం అప్పచెప్పలేదు?" అడిగాడు యుగంధర్.

బండార్కర్ కాస్త యిబ్బందిగా చూశాడు యుగంధర్ని.

"ఇప్పుడు ఆలోచిస్తే పొరపాటే అనిపిస్తోంది. కానీ అప్పుడు కుమార్ విషయం మేము అంత సీరియస్‌గా తీసుకోలేదు. కారణం యూనివర్శిటీ వాళ్ళే అతం సీరియస్‌గా తీసుకోకపోవడం. కుమార్‌కి యీ పరిశోధనలో గురువుగా వున్న ప్రొఫెసర్ కూడా యీ లోహం గురించి ఎక్కువగా ఆలోచించలేదు."

"ఎందువల్ల?" అడిగాడు రాజు.

"ఈ సైంటిస్టులంతా అంతే అనుకుంటాను. వాళ్ళు చేస్తున్న పరిశోధన గురించికానీ, దాని ఫలితం యేమిటి అని కానీ ఆలోచించరని అనుకుంటాను. డిఫెన్స్ ప్రొడక్షన్ డిపార్ట్‌మెంటువారికి కుమార్ చేస్తున్న పరిశోధన గురించి తెలియగానే మా డిపార్ట్‌మెంటుకి తెలియజేశారు. వాళ్ళు కోరినది కూడా కుమార్‌ని ఒక కంట కనిపెట్టమని" "డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ వారికి కుమార్ పరిశోధన గురించి ఎలా తెలిసింది?" అడిగాడు యుగంధర్.

"యూనివర్శిటీ వారు తెలియజేశారుట. మొదట్లో మాకూ డిఫెన్స్‌వారు యేమీ చెప్పలేదు. కుమార్ అదృశ్యమయ్యాడు అని తెలియగానే నేను డిఫెన్స్ ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని కలుసుకున్నాను. ఆయన చెప్పాడు విషయాలు" అన్నాడు బండార్కర్.

యుగంధర్ అయిదు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించాడు.

"నేను యీ కేసు దర్యాప్తు చెయ్యకూడదని ఎవరో చాలా ప్రయత్నిస్తున్నారు. నన్ను చంపుతానని బెదిరించారు. కుమార్ని ఎత్తుకుపోయారు. అంతవరకూ అర్థం అవుతోంది. కానీ చచ్చిపోయిన స్త్రీ నజీం కాకపోవడం ఒకటి, కుమార్ తండ్రి శివరాంని చంపడం రెండు. ఈ రెండింటికీ కారణాలు కనిపించడం లేదు. కుమార్‌కి పరిశోధనలో గురువుగా వున్న ప్రొఫెసర్ని నేను కలుసుకోవాలి. తర్వాత డిఫెన్స్ ప్రొడెక్షన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని కలుసుకోవాలి. కుమార్ పరిశోధన గురించిన కాయితాలు చదవాలి" అన్నాడు యుగంధర్.

"కుమార్ పరిశోధన గురించిన కాయితాలు మాత్రం చదవలేరు" అన్నాడు బండార్కర్.

"ఏం?" అడిగాడు యుగంధర్.

"అతను యూనివర్శిటీకి పంపిన కాయితాలు ఎలా మయమయ్యాయో ఎవరికీ తెలియదు. ఆ కాయితాలు లేవు" చెప్పాడు బండార్కర్.

★★★★★★★★★★

కుమార్ కళ్ళు తెరిచాడు. బద్ధకంగా కలయచూశాడు గదంతా.

తనెక్కడున్నాడు? హోటల్లో తన గది కాదే యిది. నెమ్మదిగా మంచం మీది నించి లేచి కిటికీ దగ్గరకి వెళ్ళి బయటికి చూశాడు. పెద్ద తోట, విశాలమైన ఆవరణ. దూరాన ఎక్కడో గేటు. ఎత్తైన పెద్ద ప్రహరీ గోడ. చాలా ప్రశాంతంగా వుంది. తను హోటల్ శరత్‌లో లేడని నిశ్చయించుకున్నాడు. జ్ఞాపకం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. నజీం హత్య చేయబడడము, పోలీసులు తనను తరిచి తరిచి ప్రశ్నించడం నజీం జ్ఞాపకం రాగానే గుండె ఎవరో పట్టి నలిపినట్లయింది. పొంగివస్తున్న దుఃఖం అణుచుకున్నాడు. తర్వాత తను మద్రాసు రావడం, హోటల్ శరత్‌లో దిగడమూ, తనతోపాటు తన తండ్రీ అదే హోటల్‌లో బసచేయడమూ అదంతా స్పష్టంగా జ్ఞాపకముంది.

"కుమార్ పోలీసులు సమర్థులు. నజీమ్‌ని హత్య చేసిన వాళ్ళని పట్టుకోవడం వాళ్ళపని, వాళ్ళ బాధ్యత. నజీమ్‌ని చంపినవాళ్ళని నువ్వే పట్టుకుని ఆ మనిషిని చంపుతానని యేదో ఆవేశంలో అంటే అన్నావు. నీ బాధ, నీ దుఃఖం నాకర్థమవుతుంది. ఈ వూళ్ళో యేం చేస్తావు? ఇంటికి పోదాం రా" అన్నాడు తన తండ్రి.

"నువ్వు ఎన్ని చెప్పినా, ఎంత చెప్పినా నా మనసు మార్చుకోను. దయచేసి నువ్వు వెళ్ళు" అన్నాడు తను.

తండ్రి గదిలోంచి వెళ్ళిపోయిన తర్వాత తను ఏడుస్తూ పడుకున్నాడు ఒక రోజంతా. ఆ మర్నాడు మళ్ళీ వచ్చాడు తన తండ్రి. ఎవరో ప్రైవేట్ డిటెక్టివ్‌ని దర్యాప్తు చెయ్యమని తను కోరానని, ఆ డిటెక్టివ్ గొప్ప మేధావి అనీ, నజీమ్‌ని హత్య చేసిన మనిషిని ఆ డిటెక్టివ్ పట్టుకు తీరుతాడనీ, తండ్రి యేదేదో చెప్తున్నాడు. అంతలో రూమ్ బాయ్ తలుపు తట్టాడు. తండ్రే వెళ్ళి తలుపు తీశాడు. రూమ్ బాయ్ బల్లమీద పెట్టాడు రెండు కప్పుల కాఫీ. తను కాఫీ తెమ్మనలేదు. తండ్రే తెప్పించి వుండాలి.

"కాఫీ తాగు కుమార్" అంటూ తన తండ్రి ఒక కప్పు తీసుకున్నాడు. తను కాఫీ తాగడం ప్రారంభించాడు. తర్వాత?

తర్వాత విషయాలు మసకమసగ్గా అస్పష్టంగా సరిగ్గా జ్ఞాపకం రావడంలేదు. కాఫీ కప్పు చేతిలో పట్టుకునే తన తండ్రి తల వెనక్కి వాల్చేశాడు.

"ఏమిటి నాన్నా?" అంటూ తను లేవబోయి కాలు తడబడి ముందుకు పడ్డాడు. కళ్ళు చీకట్లు కమ్మాయి. అంతే. ఆ తర్వాత ఏం జరిగిందీ యేమీ జ్ఞాపకం లేదు. ఇప్పుడు యీ గదిలో తను కళ్ళు తెరిచాడు.

వెనక యేదో అలికిడి అయి కుమార్ చటుక్కున వెనక్కి తిరిగాడు. ఫుల్ సుటులో వున్నాడు, ఎర్రగా, సన్నగా, పొడుగ్గా నెరిసిన జుట్టు, తీక్షణమైన చూపులు.

"గుడ్ మార్నింగ్ యంగ్‌మాన్! హౌ డు యు ఫీల్?" అడిగాడు చెయ్యి అందించి.

"మీరెవరు?" అడిగాడు కుమార్.

"నా పేరు సిన్హా. నేషనల్ ఆటమిక్ రీసెర్చి సెంటర్‌క్ డిప్యూటీ డైరెక్టర్‌ని."

"ఓ! నేను ఎక్కడున్నాను? ఇక్కడికి ఎలా వచ్చాను?"

"అది చాలా పెద్ద కథ. క్లుప్తంగా చెపుతాను. నేషనల్ ఆటమి రీసెర్చి సెంటర్ డిపార్టుమెంటు వారి కేంద్రాలు దేశంలో మొత్తం పధ్నాలుగు వున్నాయి. ఒక పరిశోధనా కేంద్రంలో వున్నారు మీరు. ఇక్కడికి ఎలా వచ్చాను అని అడిగారు. జరిగినవన్నీ మికేమాత్రం జ్ఞాపకమున్నాయో నాకు తెలియదు. మీరు, నజీము పెళ్ళి చేసుకుని హనీమున్‌కి ఊటీ వెళ్ళడం జ్ఞాపకముందా?" తల వూపాడు కుమార్.

"ఊటీలో వుండగా మీరు ఒక రాత్రి భోజనం తీసుకురావడానికి హోటల్‌కి వెళ్ళడం జ్ఞాపకముందా?" అడిగాడు సిన్హా.

మళ్ళీ తల వూపాడు కుమార్.

"హోటల్లో మీరు నాలుగు పరోటాలు, వెజిటబుల్ కుర్మా కట్టించుకుని బయటికి వెళ్ళడం జ్ఞాపకముందా?"

"ఆ!"

"హోటల్లోంచి మీరు బయటికి రాగానే కోయంబత్తూరుకు వెళ్ళే బస్సు ఎన్ని గంటలకు వుంది అని ఒకతను మిమ్మల్ని అడిగాడు. మిమ్మల్ని కబుర్లలోకి దింపి తను ఒక సిగిరెట్ వెలిగించి, మీకొక సిగిరెట్ యిచ్చాడు. జ్ఞాపకముందా?"

"లేదు."

"అవును. జ్ఞాపకముండదు. మీకు అతనిచ్చిన సిగిరెట్ మందు కూరిన సిగిరెట్. మారిజోనా సిగిరెట్టో, ఎల్.ఎస్.డి. సిగిరెట్టో అయివుండాలి. కొంచెం దూరం నడిచిన తర్వాత మీరు పడిపోయారు" అని ఆగాడు సిన్హా.

"మీరు పొరపడుతున్నారు. నేను..."

"దయచేసి నేను చెప్పేది పూర్తిగా వినండి. మీకు ఆ మత్తుమందు యిచ్చిన వ్యక్తి ఒక విదేశ గూఢచారి. మీరు స్పృహపోయి పడిపోగానే అతనూ, అతని అనుచరులూ కలిసి మిమ్మల్ని కారులో ఎక్కడికో ఎత్తుకుపోవడానికి ప్రయత్నించారు. అదృష్టవశాత్తు స్పెషల్ బ్రాంచి ఏజెంటు ఒకతను చాలాకాలంగా మీకు తెలియకుండా మీ వెంట నీడలా మీకూడా వున్నాడు. అతను ఆ కారుని తరిమి, ఆపి, వాళ్ళతో పోట్లాడి మిమ్మల్ని రక్షించాడు. దురదృష్టవశాత్తు ఆ విదేశ గూఢచారులు పట్టుబడకుండా పారిపోయారు. స్పృహలేని మిమ్మల్ని ఆ స్పెషల్ బ్రాంచి ఏజెంటు తన యింటికి తీసుకెళ్ళి జరిగినదంతా పై అధికారులకి తెలియజేశాడు. ఆటమిక్ రీసెర్చి సెంటర్ డైరెక్టర్ ఛటర్జీ, స్పెషల్ బ్రాంచి డైరెక్టరూ, యీ డిపార్టుమెంటుకి సంబంధించిన మంత్రులూ వెంటనే సమావేశమయ్యారు. మీకు పూర్తి ఆరోగ్యం చేకూరేందుకు, మీ పరిశోధన జయప్రదంగా, ప్రశాంతంగా సాగేందుకు యిక్కడికి తీసుకురావాలని నిశ్చయించారు. అందుకే మిమ్మల్ని యిక్కడికి తీసుకువచ్చాం. మీ ప్రశ్నలకి జవాబులు చెప్పాననుకుంటాను" అన్నాడు సిన్హా.

తనకి పిచ్చిపట్టిందా, అతనికి పిచ్చిపట్టిందా? ఏమిటీ కథ? విదేశీ గూఢచారిట, మందుకూరిన సిగిరెట్టుట. వాట్ నాన్సెన్స్.

"మిష్టర్ సిన్హా! నా కళ్ళతో చూసినది నా చేతులతో ముట్టుకున్నది, నేననుభవించినది, అదంతా ఏమైంది? నేను కాటేజీకి వెళ్ళాను. నా భార్య నజీమ్ శవాన్ని చూశాను. ఆమె హత్య చేయబడింది. ఆ తర్వాత " కుమార్‌ని వాక్యం పూర్తిచెయ్యనివ్వలేదు సిన్హా.

"మిష్టర్ కుమార్! అదంతా హేలూస్‌నేషన్" అన్నాడు సిన్హా.

"ఏమిటి?"

"అవును. అది భ్రమ. మారిజోనా, ఎల్.ఎస్.డిలాంటి మత్తుమందులు కొందరికి అలాంటి భ్రమలు కలగజేస్తాయి. మనసులో ఎక్కడో అట్టడుగున అంతరాంతరాల్లో వున్న భయాలు నిజంగా జరిగాయి అనిపించేటట్లు భ్రమ కలిగిస్తాయి. నజీమ్‌ని ఎవరో హత్య చేస్తారనే భయం మీలో వుండివుండాలి. అందుకే అలాంటి భ్రమ కలిగింది" అన్నాడు సిన్హా.

ఏదో ఆశ. ఆ ఆశవల్ల ఏదో ఆనందం కలిగింది కుమార్‌కి.

"నిజంగానా? అయితే నజీమ్..."

సిన్హా చిన్న నవ్వు నవ్వి "నజీమ్ యీజ్ హేల్ అండ్ హెల్దీ. మీకు స్పృహరాగానే అడుగుతారని తెలుసు. అందుకే నజీమ్‌ని కూడా యిక్కడికి రప్పించాము. ఇక్కడే వుంది. ఇక్కడే వుంటుంది" అని సిన్హా తలుపు దగ్గరికి వెళ్ళి "మిసెస్ నజీమ్" అని పిలిచాడు.

గాజుల గలగల, చీర గరగర. ఊపిరి బిగపట్టి తలుపువైపే చూస్తున్నాడు కుమార్. లోపలికి వచ్చి నిలబడింది. తననే చూస్తోంది. ఆమె నజీమే.

తన కళ్ళని తను నమ్మాలా వద్దా? ఈమె నజీమే.

జరిగింది ఒక పీడకల. ఇది నిజం. నజీమ్ బతికే వుంది. జరిగింది నిజం. నజీమ్ చచ్చిపోయింది. ఇది తీయని కల. ఏది నిజం? ఏది కల?

"కుమార్"

"నజీమ్"

"కుమార్ ఎందుకలా చూస్తావు నన్ను" రెండడుగులు ముందుకు వచ్చింది. అతనూ ముందుకు జరిగాడు. ఆమె చేతులు పట్టుకున్నాడు. ఆమె భుజాలు నిమురుతున్నాడు. ఆమె చెంపల్నీ, కురుల్ని, పెదిమల్నీ ఆమెనంతటినీ స్పర్శిస్తూ, ఆనందిస్తూ "నజీమ్! నువ్వేనా?" అన్నాడు.

"నేనే కుమార్"

"నువ్వు చచ్చిపోలేదూ?"

"వెర్రివాడా ఎలా చచ్చిపోతాను? నిన్ను వొదిలి ఎలా పోతాను? ఎక్కడికి పోతాను?"

చిన్నదగ్గు వినిపించేసరికి యిద్దరూ మళ్ళీ ఈ ప్రపంచంలోకి వచ్చారు. నజీమ్ అతనికి కాస్త దూరంగా జరిగి గదిలో ఇంకెవరో వున్నారని కళ్ళతో చూపించింది.

"థాంక్స్ మిష్టర్ సిన్హా. మెనీ మెనీ థాంక్స్" అన్నాడు కుమార్.

"నేను చేసింది ఏమీలేదు. వెళ్తాను. తర్వాత వస్తాను. విశ్రాంతి తీసుకోండి" అన్నాడు సిన్హా.

"ఒక్క క్షణం ఆగండి మిష్టర్ సిన్హా. నాకు కొన్ని సందేహాలు."

"అడగండి."

"ఎవరో విదేశ గూఢచారులు నన్ను ఎత్తుకుపోవడానికి ప్రయత్నించారు అన్నారు. వాళ్ళు నాకు యిచ్చిన మత్తుమందువల్ల భయంకరమైన భ్రమలేవో కలిగాయని చెప్పారు. ఎవరో విదేశ గూఢచారులు నన్ను ఎందుకు ఎత్తుకుపోతారు? వాళ్ళకి నావల్ల లాభం ఏమిటి? దయచేసి చెప్తారా?" అడిగాడు.

"నిజంగా మీకు తెలియదా?" అడిగాడు సిన్హా.

కుమార్ తల విదిలించాడు.

"విచిత్రం ఇంత తెలివైనవారు. లోకజ్ఞానం లేకపోవడమేమిటి? మీరు రీసెర్చి చేశారు డాక్టరేట్ కోసం. మీరు చేసిన రీసెర్చి ఏమిటి?" అడిగాడు సిన్హా.

"అణుశక్తితో ఒక కొత్తలోహం తయారుచెయ్యడానికి రీసెర్చి చేశాను."

"లోహం పేరేమిటి?"

"ఆ లోహం తయారు చెయ్యనేలేదు. పేరెక్కడ పెట్టను? ఇంకా ఒక ఐడియా మాత్రమే."

"పోనీ ఆ లోహం లక్షణాలు?" అడిగాడు సిన్హా.

"ఆ లోహం చాలా తేలికగా వుంటుంది. బరువు చాలా తక్కువ. చాలా గట్టిగా బలంగా వుంటుంది. వేడికి సాగదు. కరగదు."

సిన్హా చిన్నగా ఒక నవ్వు నవ్వి "ఆ లోహం ఉపయోగాలు చెప్పండి" అన్నాడు.

"నిజంగా ఆ లోహమే తయారు చేయగలిగితే, సైకిళ్ళు మొదలు ఏరోప్లేన్‌ల వరకు, ఒకటేమిటి ఎన్నటికో ఉపయోగపడుతుంది. ఆ లోహాన్ని ఎట్లా ఉపయోగించుకోవలసిందీ ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు నిర్ణయించుకోవాలి. నేనా విషయాలు ఆలోచించలేదు" అన్నాడు కుమార్.

సిన్హా మళ్ళీ నవ్వి "అందుకే లోకజ్ఞానం తక్కువ అన్నాను. అటువంటి లోహం తయారు చేసి విమానాలు, ట్యాంకులు, ట్రక్కులు, హెవీ మిషన్ గన్స్ తయారుచేస్తే ఏమవుతుందో ఆలోచించారా? యాంటీ ఎయిర్ క్రాఫ్టు గన్‌ల గుళ్ళకి విమానాలు కూలాణఊ. ట్యాంకుల్ని ఎవరూ ఆపలేరు. మిషన్‌గన్‌లు చెడవు.

ఏ దేశానికైతే ఈ లోహం ముందు లభిస్తుందో, ఆ దేశాన్ని యుద్ధంలో ఎవరూ జయించలేరు. దేశరక్షణకి మాత్రమే కాదు, రాజ్య విస్తరణకి కూడా ఉపయోగపడుతుందని మాత్రం జ్ఞాపకముంచుకోండి.

ఈ లోహం ఎలా తయారుచెయ్యాలో, ఆ రహస్యం కనుక్కోడానికి చిన్న దేశమైతేనేం, ప్రతివాళ్ళూ ప్రయత్నిస్తారు. అందులో ఆశ్చర్యం లేదు. రాజ్య విస్తీర్ణ కాంక్ష వున్న మరో దేశంలోకాక, ఈ దేశంలో భారతదేశంలో మీరు పుట్టడం మానవాళి అదృష్టం. రాజ్య విస్తరణ చెయ్యాలని కానీ, మరో రాజ్యాన్ని జయించాలని కానీ మనము ఎప్పుడూ కాంక్షించలేదు. సామాన్యుడి బ్రతుకు సుఖవంతం చేయడానికి, జీవిత ప్రయాణం పెంచడానికి అనుక్షణమూ ప్రయత్నిస్తున్నాము. ఈ కొత్త లోహాన్నీ అందుకే ఉపయోగిస్తాం. ఇప్పుడు అర్థమైందా?" అడిగాడు సిన్హా.

తల వూపాడు కుమార్.

"మీ పరిశోధన పూర్తి అయ్యేంతవరకూ మీరు ఇక్కడినుంచి కదలకూడదు. మీ పరిశోధనకి కావలసిన వసతులు, సామాగ్రి, అన్నీ ఏర్పాటు చేశాము. బయటినించి ఒక్క పురుగు కూడా లోపలికి రాకుండా, లోపల్నించి బయటకి ఎవరూ పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాము. నజీం మీతోపాటు యిక్కడే వుంటుంది. ఇంక మీక్కావలసింది ఏమిటి చెప్పండి" అన్నాడు సిన్హా.

కుమార్ నజీం కళ్ళలోకి చూస్తూ "నాకింకేమీ అవసరంలేదు" అన్నాడు.

"వెరీ గుడ్! కొంచెం తేరుకున్నాక పని ప్రారంభిద్దురుగాని. వస్తాను" అని సిన్హా వెళ్ళిపోయాడు.

ఆ0

"రీసెర్చ్ స్కాలర్, తన పరిశోధన తాలుకు కాయితాలు నాలుగు కాపీలు మాకు పంపాలి. మిష్టర్ కుమార్ నాలుగు కాపీలు పంపారు" అన్నాడు యూనివర్శిటీ రిజిస్ట్రార్.

"ఇప్పుడు ఆ నాలుగు కాపీలు కనిపించకుండా పోయాయా? ఎలా పోయాయి?" అడిగాడు యుగంధర్.

"అదే మాకూ ఆశ్చర్యంగా వుంది. అఫ్‌కోర్స్. పోలీస్‌కి రిపోర్టు యిచ్చాము" అన్నాడు రిజిస్ట్రార్.

"కుమార్ మీకు ఇచ్చిన కాయితాలలో వున్న విషయాలు వివరంగా కాకపోయినా, కనీసం స్థూలంగానైనా ఎవరెవరికి ఎలిసివుంటుందో చెప్పగలరా?" అడిగాడు యుగంధర్.

రిజిస్ట్రార్ కాసేపు ఆలోచిఒడ "నిజం చెప్పాలంటే, నా ఆఫీసులో అందరికీ తెలిసి వుండాలి. ఆ కాయితాలు రహస్యమైన కాయితాలు అని నాకు తెలియదు. నాకు ఎవరూ చెప్పలేదు" అన్నాడు రిజిస్ట్రార్.

"థాంక్ యు. అందరికీ తెలిసి వుండాలి అన్నారు. దయచేసి అందరూ అంటే ఎంతమంది? వాళ్ళ పేర్లేమిటి? వాళ్ళు ఇక్కడ చేస్తున్న ఉద్యోగాలు ఏమిటి?" అడిగాడు యుగంధర్.

రిజిస్ట్రార్ కాయితం తీసుకుని ఆరుగురి పేర్లు వ్రాశాడు.

ఆ. సుబ్రహ్మణ్యం: పర్సనల్ అసిస్టెంటు.

2. రహమన్: ఫైలింగ్ క్లర్క్.

3. మిస్ కమల: రికార్డు సెక్షన్ సూపరింటెండెంటు.

4. జగన్మోహనరావు: స్టెనోగ్రాఫర్.

5. మిసెస్ ఎమిలీ థామస్: ఆఫీసు హెడ్‌క్లర్క్.

6. వై. కృష్ణమూర్తి: రిజిస్ట్రారు.

"వీళ్ళందరూ యీ అయిదుగురూ ఆఫీసులోనే వున్నారా?" అడిగాడు యుగంధర్ ఆ జాబితా చదివి.

"యస్. వీళ్ళ యింటి చిరునామాలు, వీళ్ళ గురించిన పర్సనల్ ఫైల్స్ కావాలా? తెప్పిస్తాను" అన్నాడు రిజిస్ట్రార్.

"థాంక్ యు వెరీ మచ్. తెప్పించండి" అన్నాడు యుగంధర్.

రిజిస్ట్రార్ బెల్ నొక్కాడు. రిజిస్ట్రార్ పర్సనల్ అసిస్టెంటు సుబ్రహ్మణ్యం రాగానే వాళ్ళ పర్సనల్ ఫైల్స్ తీసుకుని రమ్మని చెప్పాడు రిజిస్ట్రార్ కృష్ణమూర్తి.

"పోలీస్ అధికారులు దర్యాప్తు చేశారు. వారికే తెలియలేదు ఎలా పోయాయో?" అన్నాడు రిజిస్ట్రారు.

"ఆ కాయితాలు ఎక్కడ పెట్టారు? వాటిని తీసుకునేందుకు ఎవరెవరికి అవకాశం వుంది?"

"బీరువాలో పెట్టాము. నాతోపాటు మా ఆరుగురికీ ఆ కాయితాలు ఈ ఆఫీసునించి అపహరించే అవకాసం వుంది. ఈ విషయమూ పోలీస్ అధికారులకి చెప్పాను" అన్నాడు రిజిస్ట్రారు.

"కుమార్ పరిశోధన్ ఫలితాలు దేశరక్షణకి చాలా ముఖ్యమైనవి మినిస్టరీ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ వారికి ఎవరో తెలియజేశారు మీరు తెలియజేశారా?" అడిగాడు యుగంధర్.

"నో చెప్పానుగా. కుమార్ పరిశోధన గురించిన వివరాలు స్థూలంగా తప్ప ఎవరికీ వివరంగా ఏమీ తెలియదు. బహుశా కుమార్‌కి ఈ పరిశోధనలో గురువుగా వున్న ప్రొఫెసర్ శర్మ మినిష్టరీకి తెలియజేశారేమో?" అన్నాడు రిజిస్ట్రార్.

"ఆ ప్రొఫెసర్ పూర్తిపేరు?"

"నిజానికి ఆయన యూనివర్శిటీలో రీడర్. పేరు. వై.జి.శర్మ. ఇంటి చిరునామా కావాలా?"

యుగంధర్ తలవూపాడు. రిజిస్ట్రార్ మళ్ళీ తన పర్సనల్ అసిస్టెంటుని పిలిచి వై.జి.శర్మ చిరునామా వ్రాసి తెమ్మన్నాడు.

**విశాఖపట్నంలో** అది కొత్తగా కట్టిన కాలనీ. యూనివర్శిటీ బిల్డింగ్స్‌కి దగ్గర్లో వున్నది. ఇళ్ళు దూర దూరంగా వున్నాయి. అన్నీ ఒకేరకమైన ఇళ్ళు. నిలువుగానూ, అడ్డంగానూ రోడ్లు. నెంబర్లు స్పష్టంగా ప్రతి యింటిగేటుమీదా వ్రాసి వున్నాయి. వై.జి.శర్మ అనే బోర్డుకూడా వుంది. రాజు క్రిజ్లర్ కారు ఆ యింటిముందు ఆపాడు.

గేటు తెరిచేవుంది. వీధి తలుపు మూసివుంది. రాజు బజర్ నొక్కాడు. ఎవరూ పలకేదు. తలుపు తియ్యలేదు. తట్టాడు. అప్పటికీ ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు. యుగంధర్ తలుపు తోశాడు. తెరుచుకున్నది. అది హాలు. హాల్లో పిల్లల ఆటవస్తువులు అడ్డదిడ్డంగా పడివున్నాయి. సోఫాలు, నేలమిద తివాసీ, గదిలో ఒక మూలగా బల్ల.. బల్లమీద టెలిఫోన్.

"శర్మగారూ!" పిలిచాడు యుగంధర్.

యుగంధర్ పిలుపుకి జవాబుగా టెలిఫోన్ మ్రోగింది. మ్రోగుతూనే వుంది. లోపలినించి ఎవరయినా వచ్చి రిసీవర్ తీస్తారేమోనని యుగంధర్ మూడు నిముషాలు తలుపుకి బయటే నిలబడ్డాడు.

ఎవరూ లోపల్నించి రాలేదు. యుగంధర్ వెళ్ళి రిసీవర్ తీసుకున్నాడు.

"హల్లో యుగంధర్" ఆ మాటలు వినపడగానే అంతటి ధీశాలి, భయమనేది ఎన్నడూ తెలియని యుగంధర్‌కి వెన్నులో చలి పుట్టుకు వచ్చింది.

"వై.జి.శర్మ శవం పడకగదిలో వుంది. శర్మగారి భార్య సుమిత్ర, పిల్లలు యిద్దరితో ఆమె తల్లిదండ్రుల యింటికి వెళ్ళింది తండ్రికి జబ్బుగా వుందని కబురు రాగానే. బహుశా ఇంకో పదినిముషాలలో తిరిగివస్తుంది. ఆమెని ఓదార్చడం మీవంతు" క్లిక్‌మన్నది టెలిఫోన్.

యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు. పడకగది తలుపువైపు చూస్తూ నిలుచున్నాడు ఒక నిముషం. తలుపు వేసివుంది. తలుపు తెరిస్తే ఏం కనిపిస్తుందో తెలుసు. అయినా తప్పదు. పడకగది తలుపు తోశాడు. తెరుచుకుంది. పడకగది మధ్య మంచం మీద పడుకున్నాడు వై.జి.శర్మ. ప్రాణం లేదని చూస్తూనే తెలిసింది. ఛాతీమీద యింకా ఎర్రగా వున్న రక్తం.

"పిస్తోలుతో కాల్చి చంపబడ్డాడు" అన్నాడు రాజు.

యుగంధర్ తలవూపాడు. అంతలో హాల్లో అలికిడి అయింది. పిల్లల మాటలు వినిపించాయి. "అంతా మోసం. ఎవడో వెధవ అల్లరికి" ఆగిపోయింది సుమిత్ర. ఎవరో కొత్తవాళ్ళు యిద్దరు హాల్లో, తమ పడకగది తలుపు దగ్గిర వుండడం చూసి "ఎవరు మీరు?" అడిగింది ధైర్యం తెచ్చుకుని. రాజు చటుక్కున పడకగది తలుపు మూసేశాడు.

"నాన్నా! నాన్నా! తాతయ్య మమ్మల్ని రేపు ఆదివారం సినిమాకి" అంటున్నాడు శర్మ పన్నెండేళ్ళ కొడుకు.

"ఉష్! అరవకండి. చెప్పండి ఎవరు మీరు?" మళ్ళీ అడిగింది ఆమె.

ఎనిమిదేళ్ళ అమ్మాయి - శర్మ కూతురు తల్లివెనక నక్కి నిలుచున్నది.

ఈమెకి ఎలా చెప్పడం. ఈ పిల్లలకి ఎలా చెప్పడం. ఏ పాపమూ చెయ్యని ఏమీ తెలియని యీ తల్లీ బిడ్డల గుండెలు బద్దలయ్యే వార్త తన నోటవెంట ఎలా చెప్పడం? యుగంధర్ గుండె ఎవరో పట్టి నలుపుతున్నట్లయింది. అపరాధపరిశోధన అనేది వృత్తిగా ఎందుకు తీసుకున్నానా అనే చింత మొట్టమొదటిసారిగా కలిగింది.

యుగంధరూ, రాజూ తన ప్రశ్నలకి జవాబులు చెప్పకపోయేసరికి ఆమెకి భయం వేసింది. వాళ్ళు దొంగలు అయివుండాలి అనుకుని అరవబోయింది.

"భయపడకండి. మేము దొంగలం కాము" అన్నాడు యుగంధర్.

"ఎవరు మీరు?"

"నా పేరు యుగంధర్, నా అసిస్టెంట్ రాజు."

"ఎక్కడినించి వచ్చారు? మా వారు ఏమయ్యారు? మా పడకగది దగ్గిర ఏం చేస్తున్నారు?" ధైర్యం వచ్చింది ఆమెకి. ప్రశ్నల వర్షం కురిపిపిస్తోంది.

"మద్రాసు నించి వచ్చాము. రిజిస్ట్రారు కృష్ణమూర్తిగారు పంపిస్తే వచ్చాము. తలుపు దగ్గరిగా వేసి వుంది. కాలింగ్‌బెల్ నొక్కితే ఎవరూ పలకలేదు. తలుపు తోస్తే తెరుచుకుంది. లోపలికి వచ్చి"

"వచ్చి?" అడిగింది.

"మీవారికోసం"

"మావారు ఏరి? మా పడకగదికి అడ్డంగా నిలబడ్డారేం?" అంటూ పడకగది తలువైపు వెళ్ళింది.

"అమ్మా! సుమిత్రాదేవీ మీవారు ఏమయ్యారో, ఎక్కడున్నారో అదంతా సావకాశంగా మనం మాట్లాడుకోవచ్చు. మీతో కొన్ని విషయాలు నేను విడిగా మాట్లాడాలి. ముందు మా కారులో వెళ్ళి పిల్లల్ని మీ నాన్నగారి యింట్లో దింపి రండి" అన్నాడు యుగంధర్.

ఆమెకి అనుమానం యింకా ఎక్కువయింది. ఇంకోవైపు భయం.

"ఎందుకు పిల్లల్ని మా నాన్నయింట్లో దింపాలి? ఏమిటిది? ఏం జరిగింది చెప్పండి. ఆ తలుపుకి అడ్డం లేవండి" అన్నది.

"ఐ యాం వెరీ సారీ. ఇక నిజం చెప్పక తపప్దు. సుమిత్రాదేవిగారూ నేను డిటెక్టివ్‌ని మీ వారితో మాట్లాడడానికి వచ్చాను. చెప్పానుగా తలుపు తెరిచి వున్న విషయం."

"ఆఁ"

"మీ వారు పడకగదిలో వున్నారు. ప్రాణంతో లేరు. హత్య చెయ్యబడ్డారు."

ఆమెకి అర్థంకాలేదు. అర్థం అయి, మెదడు మొద్దుబారిందేమో తెలియలేదు. వెర్రిచూపు చూస్తూ అక్కడే సోఫాలో చతికిలబడింది. పిల్లలకి అసలు ఏమీ తెలియలేదు. తల్లి అలా అచేతనురాలు అవడం చుసి, వాళ్ళిద్దరూ బొమ్మల్లా వెళ్ళి తల్లిపక్కన నిలుచున్నారు.

ఆమె ఏడ్చినా, గుండె బాదుకున్నా, రొద పెట్టినా యుగంధర్‌కి కొంత గుండెబరువు తగ్గేది. ఆమె అలా ప్రాణంలేని కొయ్యబొమ్మలా అయిపోవడంతో, "రాజూ! లోపలికి వెళ్ళి నీళ్ళు తెచ్చి ఆమె మొహం మీద జల్లు" అని తను టెలిఫోన్ వద్దకు వెళ్ళాడు.

"హల్లో! పోలీస్ కంట్రోల్ రూమా! డిటెక్టివ్ యుగంధర్ స్పీకింగ్. అవును, ఇక్కడి వచ్చాను మద్రాసునించి. వెంటనే వెంకటేశ్వర కాలనీలో ఆరవ క్రాస్ స్ట్రీ నెంబరు 32 యింటికి వై.జి. శర్మగారింటికి పోలీస్ పరివారాన్ని పంపండి. ఇది హత్యకేసు. ఆ! నేను యిక్కడే వుంటాను" అని యుగంధర్ రిసీవర్ పెట్టేశాడు. రాజు చల్లనినీళ్ళు సుమిత్ర మొహం మీద జల్లాడు. అంతవరకూ కళ్ళు తెరుచుకున్న ఆమె, ఆ నీళ్ళు మొహం మీద పడగానే కళ్ళు మూసుకుని సోఫాలో వెనక్కి వాలిపోయింది. పిల్లలు యిద్దరూ ఘొల్లుమని ఏడ్వడం ప్రారంభించారు.

"నాన్న.. నాన్న ఏరి?" అడిగాడు అబ్బాయి.

యుగంధర్ గొంతులో ఏదో అడ్డుపడినట్టయింది. జవాబు చెప్పలేక, కళ్ళు తుడుచుకుని గొంతు సవరించుకున్నాడు. అంతలో పోలీసులు వచ్చారు.

ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, యిద్దరు కానిస్టేబుల్స్.

"ఎవరు రిపోర్టు చేసింది. మీరేనా?" అడిగాడు యుగంధర్ని.

"అవును. నా పేరు డిటెక్టివ్ యుగంధర్" అన్నాడు యుగంధర్.

ఆ యిన్స్పెక్టర్ యుగంధర్ని ఆపాదమస్తకమూ పరీక్షగా చూశాడు. ప్లీజ్ మీ ఐడెంటిఫికేషన్ పేపర్సు?" అడిగాడు. యుగంధర్ జేబులో చెయ్యిపెట్టబోతున్నాడు.

"జస్ట్ ఒన్ మినిట్. జేబుల్లో పెట్టకండి. ప్రమాదం."

ఇన్స్పెక్టర్ చేతిలో పిస్తోలున్నది. "సారీ సర్ మీరు నిజంగా యుగంధర్, అని తేలేంతవరకూ జాగ్రత్తపడాలి" అని "503, 502, యీ యిద్దరి జేబులు సోదా చెయ్యండి" అన్నాడు.

"వెరీగుడ్ నేను యుగంధర్ని అని చెప్పినంత మాత్రాన నమ్మకుండా తగిన శ్రద్ధ వహించడం మీ వృత్తిధర్మం. గో ఎ హెడ్" అంటూ యుగంధర్ రెండు చేతులూ పైకి ఎత్తాడు. రాజు అలాగే చేశాడు.

యుగంధర్, రాజుల జేబుల్లోవున్న పిస్తోళ్ళని తీసుకున్నారు కానిస్టేబుల్స్. తర్వాత కాయితాలనీ, డబ్బునీ అన్నిటినీ తీశారు.

"ఇప్పుడు చెప్పండి. ఏదీ మీ ఐడెంటిఫికేషన్ కార్డు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఆ మడిచివున్న ఎర్రని రంగు అట్ట."

ఇన్స్పెక్టర్ ఆ అట్టని తీసి చూసి, మళ్ళీ యుగంధర్ని పరీక్షగా చూసి "ఐయామ్ వెరీసారీ. ఈ ఐడెంటిఫికేషన్ కార్డు నాకు తృప్తికరంగా లేదు" అన్నాడు.

"ఏం?"

"ఇందులోని ఫోటోమీద మరకలున్నాయి. మిమ్మల్ని గుర్తుపట్టడానికి వీలవకుండా వుంది. క్షమించండి. మిమ్మల్ని అనుమానించడంలేదు. మీరు చాలాగొప్పవారు, పెద్దవారు. నా స్వంత బాధ్యతమీద నేను ఏమీ చెయ్యలేను. దయచేసి మీరు మా సూపరింటెండెంట్తో మాట్లడండి" అన్నాడు.

"దట్ యీజ్ ఆల్రైట్. అయినా నా ఐడెంటిఫికేషన్ కార్డులో ఫోటోమీద మరకలు ఎలా వచ్చాయి?"

"నాకు ఎలా తెలుస్తుంది. ఇప్పుడిక మీ రిపోర్టు యివ్వండి. డైరీలో వ్రాసుకుంటాను" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ముందు శవాన్ని..."

"అది తర్వాత. దయచేసి మీ రిపోర్టు యివ్వండి."

"ఆల్రైట్" అని యుగంధర్ తనూ, రాజూ అక్కడికి రావడ్మ మొదలు పోలీసులు రావడం వరకూ చెప్పాడు. "వెరీ గుడ్ సర్. మీరు హత్య జరిగిన గదిలో ఏదీ కదల్చలేదు, ఏదీ ముట్టుకోలేదు. ఎవర్నీ రానివ్వలేదు. అవును, మీరు డిటెక్టివ్గా. ఇప్పుడిక దయచేసి మీరు పోలీస్ హెడ్క్వార్టర్స్కి వెళ్ళండి. అక్కడ సూపరింటెండెంట్ వుంటారు. ఆయనతో మాట్లాడండి. ఇక్కడ దర్యాప్తు ముగించిన తర్వాత నేను అక్కడికి వస్తాను" అన్నాడు ఇన్స్పెక్టర్.

యుగంధర్, రాజ్ ఒక్క అడుగు వేశారు. "జస్ట్ ఒన్ మినిట్ సర్. దయచేసి, మా సబ్ యిన్స్పెక్టర్ని, కానిస్టేబుల్ని మీ కూడా పంపిస్తాము. మా వ్యాన్లో వెళ్ళండి."

"ఇన్స్పెక్టర్. మీరు హద్దు దాటుతున్నారు. దట్ యీజ్ ఇన్సల్టింగ్" అన్నాడు యుగంధర్.

"ఐ యామ్ సారీ. నా డ్యూటీ నేను చేస్తున్నాను" ఇన్స్పెక్టర్ చేతిలో పిస్తోలు అలాగే వున్నది. యుగంధర్ వేపుకి గురిపెట్టి వున్నది. కానిస్టేబుల్స్ చేతిలోనూ పిస్తోళ్ళు వున్నాయి.

"పోలీస్ కానిస్టేబుల్స్‌కి పిస్తోళ్ళు యివ్వడం ఎప్పట్నించీ మొదలుపెట్టారు?" అడిగాడు యుగంధర్.

"మర్డర్ కేస్ అనగానే నేనే యిచ్చాను."

"అలాగా, మీకు అధికారం వుందా?" యుగంధర్ ఇన్స్పెక్టర్ని యింకా సంభాషణలోకి దింపడానికి ప్రయత్నిస్తూ బూట్సుకాలితో నేలమీద టకటక కొడుతున్నాడు. కోపంతో వున్న మనిషి కాలు నేలకేసి కొడుతున్నట్టు.

"బుద్ధిలేకుండా ప్రవర్తించకండి యుగంధర్. ఆ మాత్రం కోడ్ మాకూ తెలుసు. తప్పించుకునేందుకు ప్రయత్నించాలని, శబ్దాలతో మోర్సుకోడ్ వాడుతున్నారు. మీరు అటువంటు ప్రయత్నం చెయ్యడం క్షేమంకాదు" అన్నాడు ఇన్స్పెక్టర్.

యుగంధర్ రాజుని చూశాడు. రాజు చిరునవ్వు నవ్వి "మనకయి మనం వచ్చి వలలో పడ్డాము" అన్నాడు.

"మా పని మమ్మల్ని చేసుకోనివ్వండి. దయచేసి మీరు వెళ్ళండి" అన్నాడు ఇన్స్పెక్టర్.

"నో! మేము ఇక్కణ్ణుంచి కదలము. ధైర్యం వుంటే మమ్మల్ని కాల్చి చంపండి" అన్నాడు యుగంధర్.

"మిష్టర్ యుగంధర్! మీరు నన్ను చాలా యిబ్బంది పెడుతున్నారు" అంటూ పిస్తోలు యుగంధర్ మీదికి, ఛాతీమీదికి కాదు, మోహం మీద గురిపెట్టాడు. యుగంధర్ అది గమనించాడు ఊపిరి బిగపట్టాడు. ఇన్సెప్క్టర్ పిస్తోలు మీట నొక్కాడు. వెంటనే చల్లగా, తియ్యగా మొహం మీద జల్లులా పడింది ఏదో. మరుక్షణం యుగంధర్ నేలకూలాడు.

రాజు ఒక్క వురుకు ఉరికాడు ఇన్స్పెక్టర్ మీదికి. రాజు తనమీదికి వచ్చేలోపులే ఇన్స్పెక్టర్ మళ్ళీ పిస్తోలు మీట నొక్కాడు. రాజు మొహం మీదా జల్లుపడింది. రాజూ పడిపోయాడు. స్పృహ పోయింది.

11

చీకటిగా వుంది. కారు వేగంగా వెళుతోంది. యుగంధర్ ఛాతీమీద రెండుకాళ్ళ బరువుగా వున్నాయి. చీకట్లో తను కళ్ళు తెరిచి చూసిన శత్రువులకి తెలియదనే ధైర్యంతో యుగంధర్ కళ్ళు తెరిచిచూశాడు. నీడల్లా, చీకటిలో సీటుమీద, పిస్తోళ్ళతో కూర్చున్న పోలీస్ యూనిఫాంలో వున్న యిద్దరి ఆకారాలు కనపడ్డాయి. అది తన కారే.. క్రిజ్లర్.

రాజు ఎక్కడున్నాడు? సీటుమీదా ముందు సీటులోనా? తను వెనక సీటుకీ, ముందు సీటుకీ మధ్య వున్న స్థలంలో కింద పడుకుని వున్నాడు. అంతవరకూ తెలుస్తోంది యుగంధర్‌కి.

ఎప్పుడయితే కానిస్టేబుల్స్ పిస్తోళ్ళు తీశారో అప్పుడే గ్రహించాడు యుగంధర్ వాళ్ళు నిజంగా పోలీసులు కారనీ, పోలీసుల వేషంలో వచ్చిన శత్రువులనీ. వాళ్ళు ఎలా అక్కడికి వచ్చారు, తను పోలిసులకి చేసిన ఫోన్‌కాల్ విషయం ఏమిటి అనే సంశయాలు కలగలేదు. శర్మయింట్లో ఫోన్ తీగ కట్ చేసి, బహుశా ఏ పక్కయింట్లోనే డైరెక్టు లైన్ ఆ ఫోన్‌కి కనెక్ట్ చేసివుండాలి. యుగంధర్ శర్మ ఇంటికి రావడం పక్క ఇంట్లోంచో, ఎదురు ఇంట్లోంచో చూసి, వీళ్ళు పోన్ చేసి వుండాలి. అప్పుడే తను ఫోన్ తీసుకున్నాడు. ఆ తర్వాత తను పోలీస్ కంట్రోల్ రూంకి ఫోన్ చేసినప్పుడు శత్రువులే అవతల టెలిఫోన్‌లో పోలీసుల్లా తనతో మాట్లాడి వుండాలి.

జరిగింది జరిగిపోయింది. ఇప్పుడు ఏం చెయ్యాలి? తప్పించుకునేందుకు ప్రయత్నించడమా లేక శత్రువుల వ్యూహంలోకి వెళ్ళి బేధించడానికి ప్రయత్నించడమా! ఆలోచిస్తున్నాడు యుగంధర్. శత్రువులు కర్కోటకులు సందేహంలేదు. మనిషి ప్రాణం తియ్యడానికి కొంచెమైనా వెనుదీయరు. ఆ ఇంట్లోనే తననీ, రాజునీ చంపకుండా బందీలుగా తీసుకుపోతున్నారంటే దానికి కారణం వుండి వుండాలి. ఇన్స్పెక్టర్ వేషంలో వున్న అతను ఎప్పుడయితే పిస్తోలు తన ఛాతీమీదికి కాక, మొహం మీదికి గురిపెట్టాడో అప్పుడే యుగంధర్ ఊహించాడు. పిస్తోకు గుండుతో తనని కాల్చడనీ, ఏదో మత్తుమందు మొహం మీద జల్లుతాడనీ. ఎదురు తిరిగి ప్రయోజనం లేదు. వెనక ఇద్దరున్నారు పిస్తోళ్ళతో. అందుకే ఊపిరి బిగపట్టాడు. మొహం మీద జల్లు పడగానే స్పృహపోయినట్లు నటించి, నేలమీదికి

కూలాడు. రాజు గ్రహించి నాటకమాడాడో నిజంగానే రాజు స్పృహ పోయి పడ్డాడో తెలియదు. ఏమైనా యీ శత్రువులనించి తప్పించుకోవాలి. వాళ్ళ వ్యూహంలోకి వెళ్ళి తప్పించుకుని రాగలననే ధైర్యం లేకపోయింది యుగంధర్‌కి. శివరాం శవం భీకరంగా చిత్రవధ చెయ్యబడ్డ శివరాం. ఆ దృశ్యం అతని మనస్సులో నాటుకుపోయింది.

శత్రువులు వాళ్ళ కారులోకాక, తన కారులోనే తనని బందీగా తీసుకెళ్ళడం తన అదృష్టం. అంతేకాదు తన చేతులూ, కాళ్ళూ కట్టకుండా వుండడమూ అదృష్టమే. నెమ్మదిగా, చప్పుడు కాకుండా, కూర్చునున్న ఆ యిద్దరికీ కనిపించకుండా యుగంధర్ ఒక చెయ్యి కొద్దిగా జాపి, ముందు సీటు కిందకి పోనిచ్చాడు. ఆ సీటు కింద ఒక తీగ వుంది. నెమ్మదిగా ఆ తీగ లాగాడు. మరుక్షణం కారు యింజన్ టప్‌టప్ మని చప్పుడయి ఆగిపోయింది.

"ఏమిటిది? ఎందుకు వెళుతున్న కారు ఆగిపోయింది?" ఇన్‌స్పెక్టర్ వేషంలో వున్న అతని కంఠస్వరం అది.

"చూడాలి" సబ్‌ఇన్‌స్పెక్టర్ వేషంలో వున్న అతని జవాబు. బానెట్ తీసి, మూత లాగిన చప్పుడు.

యుగంధర్ కదలలేదు. స్పృహ లేనట్లే పడుకుని వున్నాడు.

"టార్చిలైటు" అన్నాడు ఒకతను.

వెనక సీటులో కూర్చున్న అతను టార్చిలైటు తీసి, కిటికీలోంచి అందించాడు. అయిదు నిముషాలు గడిచాయి.

"ఏమిటో తెలియడంలేదు. ఎందుకు ఆగిపోయింది?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ సీటుకింద వున్న యింకో తీగలాగాడు.

"ఇంకోసారి సెల్ఫ్ స్టార్టర్ స్విచ్ లాగు" అన్నాడు ఇన్ స్పెక్టర్.

సబ్ ఇన్‌స్పెక్టర్ కారెక్కి సెల్ఫ్ స్టార్టరు లాగాడు.

ఢాం ఢాం ఢాం అంటూ పెద్ద పెద్ద పేలుళ్ళు.

కారు యింజన్లోంచి మంటలు వచ్చాయి.

"గుడ్‌గాడ్" అంటూ ఇన్‌స్పెక్టరూ, సబ్ ఇన్‌స్పెక్టర్ కారు పేలుతుందేమోనని కారుకి దూరంగా వెళ్ళారు.

కారు తగలబడిపోతుందని భయపడి పిస్తోళ్ళు పట్టుకుని పక్కన వున్న ఇద్దరు కానిస్టేబుల్స్ కారులోంచి ఒక్క దూకు దూకారు.

మళ్ళీ లాగాడు యుగంధర్ తీగని. మళ్ళీ ఢాం ఢాం అని చప్పుడు.

"కారు పేలిపోతుంది. యుగంధర్ని, రాజునీ బయటికి లాగండి" ఇన్‌స్పెక్టర్ కేక వినపడింది.

అంటే రాజు కారులోనే వున్నాడన్నమాట. వెరీగుడ్ అనుకున్నాడు యుగంధర్.

కారు ఏ క్షణాన్నయినా పేలుతుందని భయపడుతున్నప్పుడు, ఆ కారులోకి వచ్చి, తననీ రాజునీ బయటికిలాగే ధైర్యం వాళ్ళకి వుండదని యుగంధర్‌కి తెలుసు. అది ట్రంక్ రోడ్ చీకటి. ఆ చీకట్లో కారులో వున్న తను బయట వున్నవాళ్ళకి కనిపించడని యుగంధర్‌కి తెలుసు.

క్షణంలో సీటు వెనకనించి లేచి ముందుసీటులోకి వెళ్ళి స్టీరింగ్ వీల్ వెనక వున్న మీట నొక్కాడు. కారు స్టార్ట్ అయింది. అరక్షణంలో యుగంధర్ గేర్ మార్చాడు. యాక్సిలేటర్ నొక్కాడు. క్లచ్ వొదిలాడు. కారు రివ్వున ముందుకు సాగింది.

"వాళ్ళు యింకా అక్కడ వుంటారా? పారిపోయి వుంటారు."

"చూద్దాం" అన్నాడు రాజు. యుగంధర్ క్రిజ్లర్ కారు వెనక్కి తిప్పాడు.

"మన కారులో వాళ్ళు బయలుదేరడం వల్ల, మన కారుకి మనం యీ ఏర్పాట్లన్నీ చేసుకొనడం వల్ల తప్పించుకోవడం సాధ్యం అయింది" అంటున్నాడు రాజు.

"ఢాం! ఢాం!" పిస్తోళ్ళు పేలాయి.

"చూశారా! వాళ్ళు పారిపోలేదు. కాచుకున్నారు" అన్నాడు రాజు.

"నిజమే. వాళ్ళు చీకటిలో చెట్టువెనకాల వున్నారు. మనం కారు దిగితే వాళ్ళ గుళ్ళకి ఆహుతి అవుతాం."

"సరే. మన కారు బుల్లెట్ ప్రూఫ్ కారు కదా! మీరు రెండు కిటికీల్లోంచి, షూట్ చెయ్యండి. ఇద్దరం కారులోనే వున్నామని అనుకుంటారు వాళ్ళు. నేను" అంటున్నాడు రాజు.

"నువ్వు కారులోంచి దిగి, వాళ్ళు వెనక్కి వెళతావా?"

"అవును సార్. అభ్యంతరం ఏమిటి?"

"నీ ప్రాణం మీద నాకున్న తీపి. అదే అభ్యంతరం" జవాబు చెప్పాడు యుగంధర్.

"అయితే వీళ్ళని యిలా వొదిలేసి పారిపోదామా మనం" అడిగాడు రాజు రోషంతో.

"కాదు. నువ్వు కిటికీలోంచి షూట్ చేస్తుండగా నేను"

"అలాకాదు. మీరు కారులో వుండడం మంచిది. నాకేమయినా ఆపద కలిగితే మీరు రావచ్చు."

యుగంధర్ రెండు రెండు కిటికీలలోంచి, రెండు పిస్తోళ్ళతో చీకట్లోకి షూట్ చేస్తున్నాడు. చెట్టువెనకనుంచి శత్రువులు పిస్తోళ్ళతో చీకట్లోకి షూట్ చేస్తున్నాడు. చెట్టువెనకనించి శత్రువులు పిస్తోళ్ళు పేలుస్తున్నారు.

చప్పుడు చెయ్యకుండా రాజు కారు తలుపు తెరుచుకుని రోడ్‌మీదికి దొర్లాడు. అలా దొర్లుతూనే రోడ్ సమీపాన వున్న చెట్టు వెనక్కి వెళ్ళి, అప్పుడు లేచి నిలుచున్నాడు.

శత్రువులు నలుగురూ రోడ్‌కి అవతలవైపు వున్నారని తెలుస్తూనే వుంది. అటునుంచి పిస్తోళ్ళు పేలుస్తున్నారు. ఇప్పుడు తను రోడ్ క్రాస్ చేసి వాళ్ళ వెనక్కి వెళ్ళాలి. ఇది గొరిల్లా యుద్ధంలాటిది.

చెట్ల వెనకనించి ఒక వందగజాలు చప్పుడు చెయ్యకుండా నడిచాడు రాజు. యుగంధర్ పిస్తోళ్ళతో హోరాహోరీగా పోట్లాడుతున్నాడు. శత్రువులు తనని చూడలేరని నిశ్చయించుకుని, చటుక్కున రోడ్ దాటి అవతలవైపుకి వెళ్ళాడు రాజు. చెట్ల వెనకనించి నడుస్తున్నాడు. చీకట్లో కలిసిపోవడానికి ప్రయత్నిస్తూ. ఎక్కడ రాళ్ళమీద బూట్సు కాళ్ళుపడి చప్పుడు అవుతుందో అని భయపడుతూ, అడుగులో అడుగు వేసుకుంటూ వెళుతున్నాడు.

బాగా వెనక్కి వెళ్ళాక, మళ్ళీ రోడ్‌వైపు నడవడం ప్రారంభించాడు. దూరాన్నించి పిస్తోళ్ళ పేల్పులు వినపడుతున్నాయి. లీలగా మాటలూ వినపడుతున్నాయి. రాజు పిస్తోలు చేతిలో తయారుగా పెట్టుకుని ముందుకి నడుస్తున్నాడు.

ఇప్పుడు పిస్తోళ్ళ పేల్పులు మరో దగ్గిరగా వినపడుతున్నాయి. అంటే శత్రువులకి చాలా దగ్గరగా వచ్చేశాడు. ఇప్పుడిక తను మరీ జాగ్రత్తగా వుండాలి.

గాలికి చెట్లకొమ్మలు కదులుతూ ఆకులు గరగరమంటున్నాయి. ఆ చప్పుళ్ళలో తన అడుగుల చప్పుడు వినిపించదనే ధైర్యంతో రాజు యింకా ముందుకి సాగాడు.

ఒక చెట్టు వెనకనించి ఒకతను రోడ్‌మీద వున్న కారువైపు గురిచూసి పిస్తోలు పేలుస్తున్నాడు. మొదట అతన్ని అచేతనుణ్ణి చేయాలని నిశ్చయించుకున్నాడు రాజు.

ఆ చెట్టు సమీపించాడు. చెట్టువెనక నిలుచున్న అతను వెనక్కి తిరిగాడు. అతని దృష్టి అంతా రోడ్‌మీద వుంది. అదే అవకాశం అనుకుని రాజు ఒక్క వురుకు వురికాడు. ఏదైనా అలికిడి అయిందో లేక ఏ సిక్త్‌సెన్స్ చెప్పిందో చెట్టుకింద నిలుచున్న అతను చటుక్కున వెనక్కి తిరిగాడు. మీదకి వురుకుతున్న ఆకారాన్ని చూశాడు. పిస్తోలు పేల్చేందుకు అతనికి వ్యవధి లేదు. తన మీదకి వురుకుతున్న ఆకారాన్ని పిస్తోలుతో కొట్టడానికి ప్రయత్నించాడు. అతన్ని కాల్చి చంపాలనే వుద్దేశంతో రాజు అతనిమీదికి వురకలేదు. అందుకే పిస్తోలు వెనక్కి తిప్పి, పిడితో అతని తలమీద కొడదామని మీదకి వురికాడు. ఆ మనిషి తనని గమనించి, తనని కొట్టడానికి పిస్తోలు పైకి ఎత్తడం ఆ చీకట్లో రాజు గమనించి, కొంచెం పక్కకి తప్పుకుని తన పిస్తోలుతో అతన్ని కొట్టడానికి ప్రయత్నించాడు. కానీ పిస్తోలు అతనికి తగలలేదు. చెట్టుకి తగిలింది. అతను కొట్టిన దెబ్బ రాజు భుజానికి తగిలింది. రాజు పిస్తోలు కిందకి జారవిడిచి రెండు చేతుల్తో అతని మెడ పట్టుకున్నాడు. అతను అరిస్తే మిగతావాళ్ళు అతనికి సహాయానికి వస్తారనే భయంతో అతని మెడ పట్టుకుని నలపడం ప్రారంభించాడు రాజు.

❦❦❦

**అతను** బలహీనుడు కాడు. కాళ్ళు రెండు పైకి ఎత్తి రాజుని డొక్కలో తన మోకాళ్ళతో కొట్టాడు. పేగులు తెగిపోయినంత నెప్పి పుట్టింది రాజుకి. అయినా అతని మెడ వొదలలేదు. మెడని పట్టుకుని, అతని తల వెనక్కి వొంచి చెట్టు బోదెకి వేసి బాదడం ప్రారంభించాడు రాజు.

అతను రాజు జుట్టు పట్టుకున్నాడు. జుట్టు పట్టుకుని రాజు తలని కిందకి తన తొడల దగ్గరికి వొంచడం ప్రారంభించాడు. రెండు నిముషాలపాటు ఎవరు బలశాలులో తేలకుండా యిద్దరూ కదలిక లేకుండా అలాగే ఉండిపోయారు.

ఎవరికి బలం ఎక్కువ వుంటే ఎవరికి ఊపిరి బిగపట్టే సత్తువ ఎక్కువ వుంటే వాళ్ళు గెలుస్తారని యిద్దరికీ తెలుసు. తను సామాన్య బలశాలితో పోట్లాడటం లేదని రాజు గ్రహించాడు. పట్టుకి పట్టు, దెబ్బకి దెబ్బ తియ్యగల శిక్షణ పొందిన వ్యక్తితో పోట్లాడుతున్నానని తెలుసు. తన ప్రాణం ప్రమాదంలో వున్నదనీ తెలుసు.

ఉన్న బలమంతా కూడకట్టుకున్నాడు రాజు. ఒకసారి ఊపిరి ఎగపీల్చుకుని మనిషి మనిషి అంతా అతనిమీద పడ్డాడు. రాజు బరువుకి అవతల మనిషి రాజుతో సహా నేలమీద పడ్డాడు. ముళ్ళూ, రాళ్ళూ వాటి బాధ తెలియడంలేదు యిద్దరికీ. ఒకళ్ళనొకళ్ళు విడవకుండా, గొంతులు పట్టుకుని ఎవరు ఎవర్ని ముందు చంపగలమా, ఎవరి ప్రాణం ఎవరు కాపాడుకోగలమా అనే ఏకాగ్రతతో పోట్లాడుతున్నారు. పిస్తోళ్ళు పేలడం ఆగిపోయిందని యిద్దరూ గమనించారు.

కాసేపటి తర్వాత కారు స్టార్టు అవడం, యింజన్ హోరు, కారు కదిలి పోవడం యిద్దరూ గమనించారు. కారు వెళ్ళిపోయింది అని తెలుసుకోగానే శత్రువుకి కొంత నిస్పృహ కలిగిందో, భయమే కలిగిందో రాజు మెడమీద పట్టు కొంత సడలింది. అంతే, అదే అదనుగా తీసుకుని రాజు, అతని తలని నేలకేసి నాలుగుసార్లు బాదాడు. అతని చేతులు రెండూ పక్కకి వాలిపోయాయి. అతన్ని కదిల్చి చూశాడు రాజు. కదిలే స్థితిలోలేడు. ఇక తనతో ఏం పోట్లాడగలడు. చచ్చిపోయాడా? ముక్కు దగ్గిర వేలుపెట్టి చూశాడు. పోయాడు. రొప్పుతున్నాడు. లేచి, చేతులు దులుపుకుని తర్వాత ఆలోచించాడు. కారు వెళ్ళిపోయింది. పిస్తోళ్ళు ఎందుకు పేలటం లేదు? ఏమిటీ నిశ్శబ్దం యుగంధర్ తనని వొదిలి వెళ్ళిపోరే.

ఏదో మోసం జరిగింది. యుగంధర్ వాళ్ళ చేతికి చిక్కివుండాలి. వాళ్ళు కారు ఎక్కి యుగంధర్ని తీసుకుపోయి వుండాలి అని నిశ్చయించుకున్నాడు రాజు. తమలో ఒకరు కారులో లేరని తెలుసుకోగానే తిరిగివస్తారు. ఆ ఆలోచన రాగానే స్పృహ పోయిన మనిషిని భుజాన వేసుకుని బయలుదేరాడు. అసలే భారీ మనిషి, స్పృహలేని మనిషి బరువు మొయ్యలేక రాజు తడబడుతూ నడుస్తూ, రోడ్‌దాటి

అవతలవైపుకి వెళ్ళిపోయాడు. రోడ్‌నించి దాదాపు నూరుగజాల దూరం వెళ్ళాక భుజాన వున్న మనిషిని కిందికి దింపాడు. రాజు అనుకున్నట్టే కారు తిరిగివస్తోంది. కారు హెడ్‌లైట్స్ కాంతికి తారురోడ్డు నల్లని తాచులా వుంది. గుబురుగా వున్న పొదల వెనకనించి రాజు రోడ్‌వైపే చూస్తున్నాడు. కారు వచ్చి అదే చోట ఆగింది. అందులోంచి సబ్‌ఇన్‌స్పెక్టర్ వేషంలో వున్న అతను, పోలీస్ కానిస్టేబుల్ వేషంలో వున్న అతను దిగారు. "ఇద్దరం కలిసి వెళదాం" అన్నాడు ఒకతను.

"టార్చి వెలిగించవద్దు. అతనివద్ద పిస్తోలుంటే"

"అవును. బాస్ కారు ఎక్కాడనుకున్నాను. లేకపోతే కారు అసలు కదిలేవాణ్ణే కాను."

అవతలవైపుకే వెళతారు. అక్కడే వెతుకుతారు. కారులో వున్న ముగ్గురూ దిగితే ఎంత బావుండేది తన కారు తీసుకుని వెళ్ళిపోవచ్చు. వాళ్ళు పొరపాటు చేసేట్టు లేరు. కారులో ఒక మనిషిని అట్టే పెట్టారు.

తనకి భయంలేదు. తెల్లారేంతవరకూ తనని పట్టుకోలేరు. ఈ చీకటిలో వాళ్ళకి తను దొరకడు. అంతవరకూ నిశ్చయం. తనకి బందీగా దొరికిన మనిషి వాళ్ళ బాస్ అన్నమాట. వెరీగుడ్ అంతలో దూరాన్నించి ఏవో కారులైట్లు కనపడ్డాయి. ఇంకేవో కార్లు వస్తున్నాయి. ఇటు రాజుకి క్షణం ముందున్న ఆత్మవిశ్వాసం తగ్గింది. పోలీస్ ఆఫీసర్ల వేషాలలో వున్నవాళ్ళు ఆ కార్లో వాళ్ళనో, ఊళ్ళోవాళ్ళనో సహాయం అడిగి, తనకోసం వెతకడం ప్రారంభిస్తే?

"ఏవో కార్లు వస్తున్నాయి. మనం యింకా యిక్కడ వుండటం మంచిదికాదు" అన్నాడు కానిస్టేబుల్.

"నిజమే. అయినా మనం పోలీసు యూనిఫాంలలో వున్నాము."

"ఒకవేళ ఆ వచ్చేది పోలీస్ కారు అయితే రిస్క్ ఎక్కువ. యుగంధర్ మనకి బందీగా దొరికాడు. పోదాం"

వాళ్ళు కారు ఎక్కేశారు. కారు స్టార్టు అయి వెళ్ళిపోయింది.

ఇక రాజు ఆలస్యం చెయ్యదలచుకోలేదు. స్పృహ పోయిన అతన్ని మళ్ళీ భుజం మీద వేసుకుని, రోడ్ మీద పరిగెత్తాడు. రెండు లారీలు, ఒకదాని వెనుక ఒకటి వస్తున్నాయి. రోడ్‌కి అడ్డంగా నిలబడ్డాడు. లారీ డ్రైవర్ ఆపాడు.

"ఏమిటండీ?" అడిగాడు రాజుని పోలీస్ ఇన్‌స్పెక్టర్ వేషంలో వున్న స్పృహలేని అతన్ని చూసి. వివరాలు అన్నీ చెప్పడానికి అవకాశం లేదు. చెపితే అతను నమ్మకపోవచ్చు అనుకుని.

"దొంగలు ఆ కారులో పారిపోతున్నారు ఇన్‌స్పెక్టర్ని కొట్టేసి. త్వరగా" అన్నాడు రాజు ఇన్‌స్పెకర్ని లారీ ముందుసీటులోకి తోస్తూ. క్లీనర్ స్పృహలేని అతన్ని లోపలికి లాక్కున్నాడు.

"త్వరగా, వేగంగా డ్రైవ్ చెయ్యి. ఆ కారుని పట్టుకోవాలి" చెప్పాడు రాజు. రాజుకి తెలుసు ఈ లారీ ఏనాటికీ తమ క్రిజ్లర్ కారుని అందుకోలేదని. లారీ డ్రైవర్ తన మాటలు నమ్మేందుకు అలా చెప్పాడు.

లారీ స్పీడు అందుకుంది. దూరంగా కనిపిస్తున్న ఎర్రని డేంజర్ లైట్ యింకా దూరం అవుతోంది.

"లాభం లేదు సార్. అందుకోలేము" అన్నాడు డ్రైవర్.

"ప్రయత్నించు. ఏమో ఆ కారుకి పంక్చర్ కావచ్చు. నొక్కు ఆక్సిలేటర్. నేను మంచి బహుమానం ఇస్తాను" అన్నాడు రాజు. పన్నెండు మైళ్ళు వెళ్ళారు. క్రిజ్లర్ కారు అంతులేదు.

ఇళ్ళు, షాపులు, దీపాలు కనిపిస్తున్నాయి.

"ఏదో వూరికి దగ్గిర అవుతున్నాం" అన్నాడు రాజు.

"అవును. అనకాపల్లి" అన్నాడు డ్రైవర్.

"నువ్వు అన్నట్లు ఆ కారుని పట్టుకోలేము. నన్నూ ఇన్స్పెక్టర్ని పోలీస్ స్టేషన్ దగ్గర దింపు" అన్నాడు రాజు.

పదినిముషాల తర్వాత స్పృహ లేని మనిషితో సహా టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర దిగి లారీ డ్రైవర్‌కి పదిరూపాయలు ఇచ్చాడు రాజు.

"థాంక్స్"

అదీ అర్ధరాత్రి. పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు కానిస్టేబుల్స్, ఒక రైటర్ మాత్రం వున్నారు. పోలీస్ ఇన్స్పెక్టర్ వేషంలో వున్న అతన్ని భుజాన వేసుకుని వస్తున్న రాజుని చూసి వాళ్ళు ఆశ్చర్యపోయి "ఏమిటి సార్" అడిగారు కంగారుగా. స్పృహలేని మనిషిని బెంచీమీద పడుకోబెట్టి "ఇతను పోలీస్ ఆఫీసర్ కాదు. ఆ వేషం వేసుకున్న క్రిమినల్. ఈ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎక్కడుంటారు?" అడిగాడు రాజు.

"ఇంట్లో"

"సరే. ఈ మనిషిని లాకప్‌లో వుంచండి. ఒకళ్ళు నాతో రండి. మీ ఇన్స్పెక్టర్ దగ్గిరికి వెళ్ళాలి."

"మీరెవరు? మీ పేరు?" అడిగాడు రైటర్.

"నా పేరు రాజు. నేను డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటుని. మీకు అనుమానంగా వుంటే మీరే వెళ్ళి ఇన్స్పెక్టర్ దగ్గిరికి వెళ్ళాలి."

"మీరెవరు? మీ పేరు?" అడిగాడు రైటర్.

"నా పేరు రాజు నేను డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటుని. మీకు అనుమానంగా వుంటే మీరే వెళ్ళి ఇన్స్పెక్టర్ని పిలుచుకు రండి. టైం లేదు త్వరగా" అన్నాడు రాజు.

"ఫోన్ చేస్తాను సార్" అన్నాడు రైటర్.

పావుగంట తర్వాత ఇన్స్పెక్టర్ వచ్చాడు.

ఏ కిటుకు అయితే ఉపయోగించి రాజు శత్రువులని వెనకనించి వెళ్ళి పట్టుకుందామని ప్రయత్నించాడో అదే కిటుకు శత్రువులు కూడా ఉపయోగించారు.

"ఈ వైపునించే కారులోంచి యిద్దరు కాలుస్తున్నారు వెనకవైపునించి నువ్వు వెళ్ళి చప్పుడు చెయ్యకుండా కారు ఎక్కి యిద్దరి తలలు బద్దలు కొట్టు" చెప్పాడు వాళ్ళ నాయకుడు.

సబ్ ఇన్స్పెక్టర్ వేషంలో వున్న అతను చీకట్లో రోడ్ క్రాస్ చేసి అవతలవైపుకి వెళ్ళాడు. నెమ్మదిగా క్రిజ్లర్ కారు చేరుకున్నాడు. కారు తలుపు తెరిచే వుంది. మూస్తే చప్పుడు అవుతుందని రాజు మొయ్యలేదు. రొట్టె విరిగి నేతిలోపడినట్టయింది అతనికి. నెమ్మదిగా కారులోకి ఎక్కాడు. ఎక్కుతున్నప్పుడు స్ప్రింగ్స్ కొద్దిగా కదిలాయి. యుగంధర్ అది గమనించాడు. రాజు తిరిగి వచ్చాడేమో అనుకుని "ఏం రాజూ!" అంటున్నాడు. అంతే తలమీద పెద్ద దెబ్బ తగిలింది. మరుక్షణం ముందుకి స్టీరింగ్ వీల్ మీదికి వాలిపోయాడు. తర్వాత ఏం జరిగిందో తెలియదు. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. తెలివి తప్పింది. మళ్ళీ కళ్ళు తెరిచేటప్పటికి ఇంకా చీకటిగానే వుంది. తల పగిలిపోతున్నట్లు నెప్పి, చేతులు కాళ్ళు కీళ్ళల్లో వేసి బిగించినట్టున్నాయి. నోరు ఎండుకు పోతోంది. కదలడానికి ప్రయత్నించాడు. కానీ కదలలేకపోయాడు. బల్లకో, బల్లలాంటి దానికో తనని కట్టేసినట్లు గ్రహించాడు యుగంధర్. కిటికీ సందుల్లోంచి సన్నని వెలుగు గదిలో పడుతోంది. అంటే ఇది పగలు అయివుండాలి. వెనకనించి తనని ఎవరో తలమీద కొట్టడం జ్ఞాపకం వుంది. ఆ తర్వాత ఏం జరిగిందీ తనని ఎక్కడికి తీసుకువచ్చిందీ ఏమీ తెలియదు. రాజు ఏమయ్యాడు? రాజు కూడా శత్రువులకి చిక్కిపోయాడా? ఇప్పుడు శత్రువులు ఏం చేస్తారు? తనని చంపడం వాళ్ళ ఉద్దేశం కాదని యుగంధర్‌కి తెలుసు. చంపదలుచుకుంటే చంపి, ఏ రోడ్డుపక్కనో పడేసిపోయేవాళ్ళు.



KOUMUDI

తననించి వాళ్ళకి ఏం కావాలి? అంతలో గది తలుపు తీస్తున్న చప్పుడయింది. కళ్ళు జిగేలుమన్నాయి. దీపం వెలిగింది. "గుడ్ మార్నిగ్ యుగంధర్" అన్నాడు లోపలికి వచ్చిన మనిషి.

స్థానిక ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి క్రిజ్లర్ కారుని పట్టుకునే ఏర్పాట్లు చేయించి, రాజు ఇన్‌స్పెక్టర్ వేషంలో వున్న అతన్ని పోలీస్ వేన్‌లో తీసుకుని తిన్నగా మద్రాసుకీ, హైదరాబాదుకీ ట్రంకాల్స్ చేయించి పై అధికారులనించి అనుమతి వచ్చిన తర్వాత కానీ, రాజుని స్థానిక పోలీసులు వెళ్ళనివ్వలేదు.

తన ఖైదీ శత్రువుల బాస్. అతను తన బందీగా వున్నంతకాలం తనదే పై చెయ్యి. తను యింకా అనకాపల్లి, వైజాగ్ ప్రాంతాల వుండి చెయ్యగలిగింది ఏమీలేదు. యుగంధర్ని వాళ్ళు ఎక్కడికి తీసుకువెళ్ళారో కనుక్కోవడమే సాధ్యమైతే స్థానిక పోలీసులు తెలుసుకుంటారని రాజుకి నమ్మకం వుంది.

కన్సల్టింగ్ రూం వెనక ఒక చిన్నగది వుంది. చీమకూడా దూరడానికి అవకాశం లేని గది అది. మారు తాళాలతో ఆ గది తలుపు తాళం ఎవరూ తియ్యలేరు. తలుపులు, గోడలూ కూడా ఉక్కువి. రాజు తన ఖైదీని ఆ గదిలో పెట్టాడు. అతని తలకి తగిలిన గాయాలకి తనే మందువేసి, కట్టుకట్టాడు. స్పృహలేని ఆ మనిషికి ముక్కుద్వారా ఆహారం యిచ్చాడు. అతను కదిలినప్పుడల్లా పసిపాపని చూసుకుంటున్నట్టు చూసుకున్నాడు. అతనిమీద ప్రేమవల్లకాదు. అతనితో తనకి చాలా పనున్నది.

మర్నాడు మధ్యాహ్నం అతను కళ్ళు తెరిచాడు. అయిదు నిముషాలపాటు రాజుని పరీక్షగా చూసి, చిన్న నవ్వు నవ్వి "మిష్టర్ రాజూ! కంగ్రాచ్యులేషన్స్. నాతో పోట్లాడి గెలిచే మనిషి వున్నాడని అనుకోలేదు" అన్నాడు.

"థాంక్ యు ఫర్ ది కాంప్లిమెంట్. మీ పేరు?" అడిగాడు రాజు.

"సులేమాన్"

"ఓ నజీమ్ అన్న."

"అవును. మీకు నేను అలా తెలుసు."

"మీరు పాకిస్తానీయులా?" అడిగాడు రాజు.

సులేమాన్ ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేదు. ఒకసారి గది అంతా కలయచూసి "నేను పోలీస్ లాకప్‌లో లేను. అంటే మీరు నన్ను ఎక్కడో బంధించారన్నమాట ఎందువల్ల?" అడిగాడు.

"మీ నోట నిజం చెప్పించాలని. నజీంనో నజీంలాంటి యువతినో ఎందుకు చంపారు? శివరాంని ఎందువల్ల అలా క్రూరంగా చిత్రవధ చేశారు? కుమార్ చేస్తున్న పరిశోధన గురించి మీకు ఎలా తెలిసింది? వై.జి శర్మని ఎందుకు చంపారు?" అడిగాడు రాజు.

రాజు ఫ్లాస్కులోంచి కాఫీ కప్పులో పోసి అతనికి యిచ్చాడు.

"తప్పించుకునేందుకు ప్రయత్నించవద్దు. ఈ గదిలోంచి ఎవరూ తప్పించుకోలేరు. గది బయట మా కొలీగ్ కాత్యా పిస్తోలుతో నిలుచున్నది. అంతేకాదు, మీరు ఎవరితోనూ పోట్లాడే స్థితిలో లేరు" అన్నాడు రాజు.

"నేను అంత ఫూల్‌ని కాను. అటువంటి ప్రయత్నం చెయ్యను. యు కెన్ రిలాక్స్" అన్నాడు సులేమాన్.

రాజుకి ఆశ్చర్యం వేసింది. సులేమాన్‌లో భయంకానీ బెదురుకానీ కొంచెం కూడా లేవు. రాజే బందీ అయినట్టు, అతనిపై సులేమాన్‌ది పై చెయ్యి అయినట్టు మాట్లాడుతున్నాడు.

"మీరు అడిగిన ప్రశ్నలలో కొన్నిటికి జవాబు చెపుతాను. కొన్నిటికి జవాబు చెప్పను" అన్నాడు సులేమాన్.

"మిష్టర్ సులేమాన్! నేను అడిగే ప్రశ్నలన్నిటికీ మీ చేత జవాబులు చెప్పించగలిగే శక్తి నాకున్నది. శివరాం పట్ల మీరు చూపించిన క్రౌర్యానికి పదింతలు క్రూరంగా ప్రవర్తించగలను నేను" అన్నాడు రాజు.

సులేమాన్ మళ్ళీ నవ్వాడు. "ప్లీజ్ గివ్ మీ ఏ సిగిరెట్?" అడిగాడు.

రాజు సిగరెట్ యివ్వగానే వెలిగించి "ఎంత చిత్రవధ చేసినా ఎంత హింసించినా, రహస్యాలు వెల్లడి చెయ్యకుండా, ఓర్చుకుని ప్రాణాలు ఒదలడం నాకు యిచ్చిన మొదటి శిక్షణ. కనుక నన్ను హింసించి, నానించి ఏవో కొన్ని విషయాలు చెప్పించగలనని అనుకుంటున్నారేమో? దటీజ్ ఎ ఫూలిష్ ఐడియా" అన్నాడు సులేమాన్.

రాజు తలవూడు. హింసించినంత మాత్రాన రహస్యాలు బయటపెడతాడని తనూ అనుకోలేదు. అంతేకాదు హింసించడానికి కావలసిన క్రౌర్యం తనలో లేదు. ఎదుటి మనిషి బాధపడుతుంటే చూసి సహించలేడు తను. కానీ ఆ విషయం అతనికి తెలియనివ్వడం దేనికి? అలమారులోంచి కొన్ని వస్తువులు తీసి బల్లమీద పెట్టాడు సర్జన్ ఆపరేషన్‌కి అవసరమైన వస్తువులు తీస్తున్నట్లు. ఒక్కొక్కటీ సరిచూసుకుంటూ ఒక స్పిరిట్ లాంప్, సన్నని సూదులు, దబ్బనాల్లాంటి సూదులు, సూదులతో చేసిన బ్రష్, నాలుగు స్ప్రింగ్ క్లిప్స్ బల్లమీద పెట్టి "ఇప్పటికి ఇవి చాలు అనుకుంటాను" అన్నాడు రాజు సులేమాన్‌ని చూసి.

"ఎప్పటికీ ఏవీ చాలవు" అన్నాడు సులేమాన్.

అంతలో అవతల గదిలో టెలిఫోన్ మ్రోగింది. రాజు ఆ గదిలోంచి బయటికి వెళ్ళి తలుపు బయట గడియపెట్టి రిసీవర్ తీశాడు.

"యుగంధర్ అసిస్టెంట్ రాజా?" అడిగాడు అవతలనించి.

"అవును."

"నేను సులేమాన్ అసిస్టెంటుని, హుస్సేన్‌ని."

"అలాగా" అడిగాడు రాజు.

"మా బాస్ మీ బందీగా వున్నారు. యుగంధర్‌ని మేము ఎక్కడ బందీగా వుంచామో మీకు తెలియదు. ఆయన్ని చంపదలుచుకుంటే అది పెద్ద కష్టంకాదు మాకు. అవునా?"

"అయితే?" అడిగాడు రాజు.

"అలాగే మా బాస్ సులేమాన్‌ని మీరు చంపదలచుకుంటే మీకూ కష్టంకాదు."

"నేను ఆత్మరక్షణకి తప్పనిసరయినపుడు ఎవర్నయినా చంపానేమో కానీ.."

"ఆల్‌రైట్ సులేమాన్ మీ బందీగా వున్నారని నాకు తెలుసు. మీ కన్సల్టింగ్ రూం వెనక గదిలో వున్నారనీ తెలుసు. అది అబేధ్యమైన కోటలాటిది అనీ తెలుసు. అంతేకాదు, మఫ్టీలో వున్న పోలీసులు, స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు మీ వీధి వీధంతా కాపలా కాస్తున్నారనీ తెలుసు."

"తెలిస్తే?"

"ఏమీలేదు. బేరం. ప్రాణానికి ప్రాణం. యుగంధర్ ప్రాణానికి సులేమాన్ ప్రాణం. సులేమాన్‌ని మాకు మీరు సురక్షితంగా ఒప్పచెప్పండి. మీకు యుగంధర్ని అప్పచెపుతాము."

"యుగంధర్ మీ బందీగా వున్నారని నేను అనుకోవడంలేదు" అన్నాడు రాజు.

"అయితే యుగంధర్ మీ కన్సల్టింగ్ రూంలో వున్నారా? డోంట్ బి సిల్లీ" క్లిక్‌మన్నది టెలిఫోన్.

సంభాషణ పూర్తికాకముందే ఎందుకు డిస్కనెక్ట్ చేశాడు? ఎక్కణ్ణించి ఫోన్ చేస్తున్నాడో పోలీసులు కనుక్కుంటారనా?

రాజు మళ్ళీ లోపల గదిలోకి వెళ్ళాడు. "మిష్టర్ సులేమాన్! మొదలు పెట్టనా?" అని స్పిరిట్ ల్యాంప్ వెలిగించాడు.

"మీ అసిస్టెంటు రాజు తెలివైనవాడు కాడు" అన్నాడు హుస్సేన్.

"ఏం? అడిగాడు యుగంధర్ కుర్చీలో యిటునించి అటు కొద్దిగా కదిలి. "ఇబ్బందిగా వుందా? కొంచెం వొదులు చేస్తానుండండి" అంటూ హుస్సేన్ యుగంధర్ కాళ్ళకి కట్టినట్లు కాస్త వొదులుచేసి "సారీ మిమ్మల్ని గురించి చాలా కథలు విన్నాను ఏ మనిషీ తప్పించుకోలేని పరిస్థితుల్లోంచి మీరు చాలాసార్లు తప్పించుకున్నారని విన్నాను. మీ గురించి మాకు మా డిపార్టుమెంటు ట్రైనింగ్ అప్పుడు చాలా చెప్పారు. ఎప్పుడైనా యుగంధర్‌ని ప్రతిఘటించవలసి వస్తే మాంత్రికుణ్ణి, ఒక గొప్ప మేధావిని ఎదిరిస్తున్నామని జ్ఞాపకముంచుకోండి అని చెప్పారు. రాజుకి ఫోన్ చేసి చెప్పాను. సులేమాన్‌ని మాకు అప్పగిస్తే మిమ్మల్ని సురక్షితంగా అతనికి అప్పగిస్తామని. మీరు మా బందీగా వున్నారని తను అనుకోవడం లేదు అన్నాడు."

యుగంధర్ నవ్వాడు. "అవును. రాజు అంతే. నేనే అతనికి ఆ శిక్షణ యిచ్చాను. మీ మాట అతను ఎందుకు నమ్మాలి?"

"ఆల్ రైట్! అతన్ని ఎలా నమ్మించడమో చెప్పండి."

"నేనే అతనితో స్వయంగా టెలిఫోన్‌లో మాట్లాడితే."

"ఎవరో గొంతు మార్చి మాట్లాడుతున్నాడని అనుకోడా?"

"అనుకుంటాడు. అందువల్ల మా యిద్దరికీ తెలిసిన ఒక కోడ్ ఉపయోగించి మాట్లాడితే నమ్ముతాడు" అన్నాడు యుగంధర్.

"కోడ్‌లో మాట్లాడుతారా? మీరేం చెపుతారో"

"ఏం చెప్పగలను? ఒకటి మీ రాజీ షరతులు ఒప్పుకోమని. రెండు ఒప్పుకోవద్దని. అంతేగా నేను ఎక్కడ బంధింపబడినదీ నాకు తెలియదు. నన్ను విడిపించమని చెప్పినా ప్రయోజనం లేదు" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

హుస్సేన్ అయిదు నిముషాలు ఆలోచించి "సరే" అని గదిలోంచి వెళ్ళిపోయి కాస్సేపటి తర్వాత టెలిఫోన్ ఒకటి తెచ్చి ప్లగ్ యిన్ చేశాడు. యుగంధర్ నెంబరు తిప్పాడు.

"యస్! రాజు హియర్."

"నేను హుస్సేన్"

"ఏమిటి?"

"ఒక్క క్షణం, యుగంధర్ మీతో మాట్లాడుతారట." అనగానే రాజుకి పట్టలేని సంతోషం కలిగింది. లోలోన ఎక్కడో భయం. శత్రువులు యుగంధర్ని చంపేశారేమోనని.

"రాజూ, నేను యుగంధర్ని"

"సారీ, యుగంధర్ అని ఎలా నమ్మడం?"

"ఆల్‌రైట్ మన పర్సనల్ కోడ్‌లో మాట్లాడుతాను. జాగ్రత్తగా రాసుకో. **తనే రన్ ఉక్షే నమడంబగా సవురన్నా చను. ఉదే మశ కక్షే పమ పం జమా దన్ జని ఖవొ బద డల గక. జరా లోజీ హుష మర కుతు పులు గవొలుప్పు క్రోడో మక జను షక్కో గవ రడ ప్రాము ప్రాములిఖ్య జము."**

యుగంధర్ మాటలు ఆగిపోయాయి.

యుగంధర్ చెప్పిన మాటలన్నీ వ్రాసుకున్నాడు రాజు.

"హల్లో రాజు యుగంధర్ మా బందీగా వున్నారని యిప్పుడయినా మీరు ఒప్పుకుంటారా?" అడిగాడు హుస్సేన్.

"ఒప్పుకుంటున్నాను."

"అయితే తర్వాత మాట్లాడుతాను" అని హుస్సేన్ రిసీవర్ పెట్టేశాడు.

రాజు పెన్సిలు తీసుకుని యుగంధర్ చెప్పినదేమిటో తెలుసుకోవడానికి డీకోడ్ చెయ్యడం ప్రారంభించాడు. నిజానికి అది కష్టమైన కోడ్ కాదు. చాలా సులువయినది. మొదటి అక్షరం వదిలేసి రెండవది వుంచేసి, మళ్ళీ మూడవ అక్షరం కొట్టేసి, నాలుగవ అక్షరం వుంచేసి... యిలా ఒక అక్షరం కొట్టేసి పక్కన అక్షరం వుంచేస్తే డీ కోడ్ అవుతుంది.

**కనే రను ఉక్షే కమ డం బగా సవు రన్నా చను.**

------

నేను క్షేమంగా వున్నాను.

రాజు దీర్ఘాలోచనలో పడ్డాడు. యుగంధర్ చెపుతున్నదేమిటి? శత్రువులతో రాజీ పడవద్దనా? సులేమాన్ ప్రాణానికి, తన ప్రాణం బేరం పెట్టవద్దనా! మరేమిటి గత్యంతరం. యుగంధర్‌ని విడిపించేది ఎలా? సులేమాన్ బంధితుడిగా వుంచుకుని సాధించేదేమిటి?

సులేమాన్ ప్రాణానికి కుమార్ ప్రాణం బేరం పెట్టమనా! అదా యుగంధర్ ఆలోచన అయితే ఆ విషయం ఎందువల్ల స్పష్టంగా చెప్పలేదు? తనకయి తను ఆలోచించి ఏ నిర్ణయమూ చేసుకోడు. అంత బాధ్యత తను వహించలేడు. మళ్ళీ టెలిఫోన్ తీశాడు.

"హల్లో మిష్టర్ బండార్కర్. అత్యవసరంగా మీతో మాట్లాడాలి. ఆ వస్తారా! కాచుకునుంటాను" అన్నాడు రాజు.

## 12

**"నిద్రపోతున్నారా?"**

"లేదు. కళ్ళు మూసుకున్నాను" అన్నాడు యుగంధర్.

"మీ అసిస్టెంటు రాజు రాజీ షరతులు అంగీకరించాడు. మిమ్మల్ని అతనికి అప్పగించడం, మా బాస్ సులేమాన్‌ని మాకు అతను అప్పగించడమూ జరుగుతుంది."

"ఎప్పుడు?" అడిగాడు యుగంధర్. తెలుసు తను వద్దని చెప్పినా రాజు రాజీకి ఒప్పుకుంటాడని.

"ఇంకాసేపట్లో"

"ఎక్కడ?"

"ఒక నిర్జన ప్రదేశంలో" జవాబు చెప్పాడు హుస్సేన్.

"పోలీసు బలగం, స్పెషల్ బ్రాంచి సహాయం, యింకా అవసరమైతే సైనిక, వైమానిక, నౌకాదళాల సహాయమూ రాజుకి లభిస్తాయి కదా! సులేమాన్‌ని తీసుకుని మీరు పారిపోగలమని ఎలా అనుకుంటున్నారు?" అడిగాడు యుగంధర్.

హుస్సేన్ నవ్వి "ఆ విషయాలన్నీ మాకు తెలుసు. తగిన జాగ్రత్తలు తీసుకున్నాం" అన్నాడు.

యుగంధర్ రెండు చేతులూ వెనక్కి విరిచి, గొలుసులతో బిగించాడు. తర్వాత కాళ్ళకి వున్న కట్లు విప్పాడు. "మీ జేబుల్లో పూచికపుల్ల కూడా లేదు కనుక దయచేసి పారిపోయేందుకు ప్రయత్నించకండి" అన్నాడు హుస్సేన్.

"ఎందుకు పారిపోవడం? నన్ను క్షేమంగా నా అసిస్టెంటుకి అప్పగిస్తున్నప్పుడు?" అన్నాడు యుగంధర్.

యుగంధర్ కళ్ళకి నల్లని పట్టీ కట్టాడు హుస్సేన్. తర్వాత భుజం పట్టుకుని నడిపించుకుని తీసుకెళ్ళాడు చాలా దూరం. ఆ తర్వాత కారు ఎక్కారు. తనూ హుస్సేన్ కాక కారులో యింకా యిద్దరున్నారని వాళ్ళ కంఠస్వరాన్ని బట్టి యుగంధర్ గ్రహించాడు.

కొంతదూరం వెళ్ళాక కారు ఒకచోట ఆగింది. కారులోంచి హుస్సేన్ దిగాడు. అయిదునిముషాల తర్వాత అతను తిరిగిరాగానే మళ్ళీ కారుస్టార్టు అయింది.

''ఇది మొదటి కాంటాక్టు. ఎటు రావాలో రాజుకి చెప్పాము'' అన్నాడు హుస్సేన్. యుగంధర్ నవ్వాడు.

''ఎందుకు నవ్వుతున్నారు? మేము ఫోన్ చెయ్యగానే, ఆ విషయం పోలీసులకు తెలిసి, వెనకే వస్తారనా? అంత ఫూలిష్ కాదు మా ప్లాన్ వినండి చెపుతాను. ఇప్పుడు చెప్పినా మాకు నష్టం ఏమీలేదు. రాజుని గ్రాండ్ ట్రంక్ రోడ్ మీదకు రమ్మన్నాను. రాజు మీ క్రిజ్లర్ కారులోనే బయలుదేరాడు. ఇప్పుడు నేను రెడ్‌హిల్స్‌లో వున్న ఒక పెట్రోలు బంక్‌కి ఫోన్ చేశాను. ఆ బంక్‌లో మా మనిషి వున్నాడు. అతన్ని అడిగాను క్రిజ్లర్ కారు వెనక యింకేదయినా కారు వస్తోందా అని. అంతేకాదు, హెలికాప్టర్ ఏదయినా ఆకాశంలో తిరుగుతోందా అని అడిగాను. లేదు అని చెప్పాడు మా మనిషి. కనుక రాజు వెనక మూడుమైళ్ళ దూరంలో ఎవరూ రావడంలేదని నిశ్చయమైంది. రాజు, పాలార్ బ్రిడ్జి దాటగానే మా మనిషి రాజుకి ఒక కాయితం యిస్తాడు ఎటు వెళ్ళాలో'' అన్నాడు హుస్సేన్.

''కానివ్వండి చూద్దాం'' అన్నాడు యుగంధర్, తనకి ఏమీ సంబంధం లేనట్టు.

మరి కొంతదూరం వెళ్ళాక, యింకోచోట కారు ఆపారు. మళ్ళీ హుస్సేన్ దిగివెళ్ళి రెండు నిముషాల తర్వాత తిరిగి వచ్చాడు. మళ్ళీ కారు స్టార్టు అయింది.

టైం ఎంతయిందో కూడా యుగంధర్‌కి తెలియదు. రోడ్‌మీద యితర మోటారు బళ్ళు ఏవీ వెళుతున్నట్లు చప్పుడు లేదు. కారు ఆగింది.

''మన గమ్యస్థానం చేరుకున్నాం'' అన్నాడు హుస్సేన్.

''వెరీగుడ్'' అన్నాడు యుగంధర్.

యుగంధర్ కళ్ళకి గంతలు తీసేశాడు హుస్సేన్. కళ్ళు జిగేలుమన్నాయి. క్షణంపాటు ఏమీ కనిపించలేదు. దూరాన దాదాపు వందగజాల దూరంలో వున్న కారు దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. తను కూర్చునున్న కారు దీపాలూ వెలుగుతున్నాయి.

''మిష్టర్ యుగంధర్ కారు దిగండి. కారు దీపాలకాంతిలో మీ కారువైపు నడవండి. దయచేసి మోసం చెయ్యడానికి ప్రయత్నించకండి. మా కారు హెడ్‌లైట్స్ పక్కన యిద్దరు వున్నారు మెషిన్‌గన్స్ పట్టుకుని. మీరు తప్పించుకోవడానికి ప్రయత్నించారా, మీ వొళ్ళు గుళ్ళతో తూట్లు పడిపోతుంది. ముందు మీరు కారు దీపాల కాంతిలో నిలబడండి. మీ కారులోంచి సులేమాన్ దిగి దీపాల కాంతిలో నిలబడతాడు. మేము చెప్పగానే యిద్దరూ చెరొక వైపుకీ నడవడం ప్రారంభించండి. ఎవరి కారు వారు చేరుకున్నాక ఎవరికారు వాళ్ళు వెనక్కి తిప్పుకుని వెళ్ళిపోతాం'' అన్నాడు హుస్సేన్.

''ఊఁ!'' అన్నాడు యుగంధర్. కారులోంచి దిగాడు. కారు ముందుకి వెళ్ళి నిలబడ్డాడు. దీపాల కాంతి కళ్ళల్లో సూదుల్లా గుచ్చుకుంటోంది. కళ్ళు చిట్లించి చూశాడు. దూరాన కారు హెడ్‌లైట్స్ ముందు ఎవరో నిలుచుని వున్నారు.

''వన్...టూ...త్రీ..స్టార్ట్'' అరిచాడు హుస్సేన్.

''వన్..టూ..త్రీ....ఫోర్...ఫైవ్...సిక్స్....సెవెన్...ఎయిట్'' అడుగులు లెక్కపెడుతున్నారు.

రెండు కార్లలోంచి దిగినవాళ్ళు సరిగా యాభయి అడుగులు వేశారు. యుగంధర్ పక్కగా ఒక మనిషి వెళుతున్నాడు. అతను సులేమాన్. అతన్ని ఒక్కలాగులాగి దీపాల కాంతిలోంచి పక్కకి జరిగితే ప్రమాదం. తన చేతులకి గొలుసులున్నాయి. యుగంధర్ ముందుకి అడుగు వేశాడు. పక్కనించి అతను వెళ్ళిపోయాడు.

''ఫిఫ్టీ.. ఫిఫ్టీ త్రీ...''

నడుస్తున్నాడు యుగంధర్. ''నైన్టీసిక్స్... నైన్టీ సెవెన్'' తన క్రిజ్లర్ కారు యింక రెండడుగులే. ''నైన్టీ నైన్'' వచ్చేశాడు యుగంధర్. క్రిజ్లర్ కారు తలుపు తెరిచి వుంది.

''హండ్రెడ్'' యుగంధర్ కారు ఎక్కాడు. తలుపు వేశాడు దభీమని. దూరాన కారు తలుపు శబ్దం అయింది.

క్రిజ్లర్ కారు స్టార్టు అయింది. రివ్వున వెనక్కి కాస్త దూరం రివర్సులో వెళ్ళి ఒక్కసారిగా వెనక్కి తిరిగి వేగంగా వెళ్ళిపోతోంది.

''రాజూ! నేను యిచ్చిన ఆదేశం పాటించకుండా నువ్వు నీ యిష్టానుసారం ప్రవర్తించినందుకు నీకు శిక్ష ఏమిటి? నిన్ను డిస్మిస్ చెయ్యనా?'' అడిగాడు యుగంధర్ చాలా కోపంగా.

చుట్టూ చీకటి. కారులో చీకటి.

''ముందు మీ చేతుల బంధనాలు వూడతియ్యనివ్వండి'' వెనక సీటులోంచి.

''ఓహో! ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావా! మీతో సంప్రదించే యీ పని చేశాడా రాజు. వాట్ ఏ షేమ్?'' యుగంధర్కి ఆగ్రహం ఎక్కువ అవుతోంది. యుగంధర్ చేతులకి వున్న గొలుసులు తీసేశాడు ఇన్స్పెక్టర్.

''సిగిరెట్ వెలిగించండి యుగంధర్'' ఆ మాటలూ వెనకసీటులోంచే.

''మిష్టర్ బండార్కర్. మీరు కూడా వున్నారన్నమాట. శత్రువుల నాయకుడయిన సులేమాన్ మీ చేతికి చిక్కితే నన్ను రక్షించడానికి అతన్ని వొదిలిపెడ్తారా! ఇదేనా మీ డిపార్టుమెంటులో ఏజెంట్లకి యిచ్చే శిక్షణ దేశ క్షేమం కన్నా ఏ మనిషి ప్రాణమూ ముఖ్యమైనది కాదని మీ ఏజెంట్లకి చెపుతారే ఆ సిద్ధాంతం ఏమైంది? స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్, అపరాధ పరిశోధనలో విశేషానుభవం కల ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు, ఎంత కాలంగానో నా అసిస్టెంటుగా వుండి, నా అంతటివాడు అనిపించుకున్న రాజు మీరందరూ కలిసి సాధించినది యిదా! కుమార్ని అప్పచెపితే సులేమాన్ని అప్పచెపుతామని ఎందుకు బేరం పెట్టలేదు? రాజూ రాజూ కమ్ ఆన్. మాట్లాడవేం మొద్దబ్బాయిలా, మూగవాడిలా నోటివెంట మాటరాదేం చెప్పు'' కోపం పట్టలేక అరిచాడు యుగంధర్.

''నేను రాజుని కాను'' అన్నమాటలు వినిపించేసరికి చకితుడయి, యుగంధర్ డ్రైవ్ చేస్తున్న మనిషివైపు చూశాడు. కోటు, టై, ఫెల్టు హ్యాటు ఆ చీకట్లో అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

''నువ్వా! కాత్యా ఏమిటీ వేషం? రాజు ఏడి?'' అడిగాడు యుగంధర్.

''సులేమాన్ వేషంలో మీ పక్కనుంచి వెళ్ళిన అతను రాజు'' అన్నది కాత్యా.

అంతే తలమీద కొండరాయి పడినట్టయింది యుగంధర్కి.

''ఏమిటీ? సులేమాన్ని దాచేసి, సులేమాన్ వేషం వేసుకుని రాజు వెళ్ళాడా శత్రువుల వ్యూహంలోకి. వాట్ మాడ్ నెస్. ఎవరిదీ ఆలోచన? ఆ మేధస్సు ఎవరిది? ఎవరా మూర్ఖులు? రాజుకి యీ ఆలోచన చెప్పింది ఎవరు? సులేమాన్ కాడనీ, రాజు అనీ తెలుసుకోగానే హుస్సేన్ తదితరులు రాజుని ఏం చేస్తారో వూహించారా? రాజు మళ్ళీ కనిపించకుండా ముక్కలు ముక్కలుగా కోసి విసిరేస్తారు. శత్రువులు ఎంత కర్కోటకులో తెలియదా?'' అని క్షణం ఆగి, ''రాజూ నా ప్రానం రక్షించడానికి, నా ఆదేశం

ఉల్లంఘించకుండా నన్ను రక్షించడానికి నీ ప్రాణాన్ని బలియిస్తావా?'' దుఃఖం పట్టలేక, యిక మాట్లాడలేక, యుగంధర్ మౌనం వహించాడు.

''ఒద్దని ఎంతో చెప్పాను. రాజు వినిపించుకోలేదు. అంతేకాదు, అతని వాదన సబబయినది అనిపించింది'' అన్నాడు బండార్కర్.

''ఏమిటావాదన?'' అడిగాడు యుగంధర్.

''తమ నాయకుడైన సులేమాన్‌ని రక్షించకోవడానికి యుగంధర్‌గారినే వదిలిపెడతామన్నారు. ప్రాణానికి ప్రాణం అన్నారు. ఒకవేళ నేను సులేమాన్ కాననీ, రాజుననీ తెలుసుకున్నా తనకి హాని జరగదనీ సులేమాన్‌ని తమకి ఒప్పచెపితే, రాజుని మనకి అప్పచెపుతామని వాళ్ళు మళ్ళీ రాజీకి వస్తారనీ రాజు వాదించాడు'' అన్నాడు బండార్కర్.

''అతను ఫూల్. మీరందరూ అంతకన్నా ఫూల్స్. ఒకసారి మోసం చేశామని తెలిశాక వాళ్ళు యిక మనల్ని నమ్మరు. సులేమాన్‌ని వొదులుకుంటారు. పాకిస్తాన్ నించి యింకో నాయకుడు వస్తాడు వాళ్ళ కార్యకలాపాలు సాగించేందుకు.''

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. కారు వేగంగా వెళుతోంది. మద్రాసు నగర సరిహద్దులు చేతుకుంటోంది.

''సులేమాన్ ఎక్కడ వున్నాడు?'' అడిగాడు యుగంధర్.

''మీ కన్సల్టింగ్ రూం వెనకవున్న గదిలో. వీధి వీధి అంతా మఫ్టీ పోలీసులు కాపలా కాస్తున్నారు. తప్పించుకోలేడు. ఎవరూ అతన్ని తప్పించలేరు'' జవాబు చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

క్రిజ్లర్ కారు యుగంధర్ యింటిముందు ఆగింది. బరువయిన గుండెతో యుగంధర్ కారు దిగాడు. ఇంటికి కాపలా వున్న సాయుధ పోలీసులు సెల్యూట్ చెయ్యడం, కాత్యా తలుపు తియ్యడం యివేమీ గమనించలేదు యుగంధర్.

''లోపల టెలిఫోన్ మోగుతోంది. క్విక్ తలుపు త్వరగా తియ్యి'' అన్నాడు యుగంధర్.

తలుపు తియ్యగానే యుగంధర్ ఒక్క అంగలో టెలిఫోన్ చేరుకుని రిసీవర్ తీడాడు.

''హల్లో యుగంధర్ అసిస్టెంటు రాజా! థాంక్ యు. నేను సులేమాన్‌ని. నీ బందీగా వున్నంతకాలం నువ్వు నా పట్ల చూపిన దయకీ, ఆదరణకీ ధన్యవాదాలు చెప్పడానికి ఫోన్ చేశాను. మీ బాస్ యుగంధర్ క్షేమంగా చేరుకున్నారు కదా! గుడ్‌లక్'' డిస్కనెక్ట్ అయింది.

యుగంధర్ మొహం మీద చిరునవ్వు వెలిగింది.

''ఎవరది?'' అడిగింది కాత్యా.

''రాజు''

''ఏమన్నాడు?'' అడిగాడు బండార్కర్.

''శత్రువులు మోసపోయారు. ఎలా మోసం చెయ్యగలిగాడో నాకే ఆశ్చర్యంగా వుంది. తనే సులేమాన్ అని వాళ్ళని నమ్మించినట్టున్నాడు. ఎంతకాలం నెగ్గుకు రాగలడో దేవుడికే తెలుసు. ఏమైనా శత్రువ్యూహంలో జొరబడ్డాడు'' అన్నాడు యుగంధర్.

## 13

రాజు కారు ఎక్కగానే ఆ కారు క్షణంలో వెనక్కి తిప్పేశారు. మరుక్షణం వేగంగా వెళ్ళిపోతోంది.

''ఎలా వున్నారు సార్! ఆ రాజు మిమ్మల్ని'' అడిగాడు హుస్సేన్.

"లేదు. ఏ మాత్రం నన్ను బాధపెట్టలేదు. ఎటొచ్చీ వరసగా నాకు ఏవో మత్తుమందులు యిచ్చాడు. వాటి ప్రతాపం యింకా పోలేదు. మాట ముద్దగా వస్తోంది. జ్ఞాపకశక్తి బాగా తగ్గింది. అంతే" అన్నాడు రాజు.

ఈ మాటలు మాట్లాడుతున్నంతసేపూ రాజు గుండె దడదడ కొట్టుకుంటున్నది తను సులేమాన్‌కాదనీ, రాజనీ వాళ్ళు తెలుసుకుంటే తక్షణమే తనని ఏం చేస్తారో అని. చీకట్లో కారులో పారిపోయే హడావిడిలో వాళ్ళని మోసగించగలిగాడు కాని, పట్టపగలు సాధ్యమవుతుందా? చూడాలి. సులేమాన్‌కీ, తనకీ రూపంలో కాకపోయినా విగ్రహంలో చాలా పోలిక వుంది. తన మీసాలు యిటూ, అటూ కాస్త కత్తిరించుకునేటప్పటికి కనుబొమలు కాస్త దట్టం చేసుకునేటప్పటికి, జుట్టు అతనిలా దువ్వుకునేసరికి బాగా పోలిక వచ్చింది. తర్వాత మేకప్ చేసుకున్నాడు. ఈ మేకప్‌తో ఎంతకాలం వాళ్ళని నమ్మించగలడు? దాదాపు రెండుగంటలు ప్రయాణం చేసిన తర్వాత కారు ఒకచోట ఆపారు "దిగండి సార్" అన్నాడు హుస్సేన్. అది ట్రంక్ రోడ్‌కి దూరంగా వున్న ఒక పాత యిల్లు. రాజు కారుదిగి చీకట్లోకి చూస్తున్నాడు. "తాత్కాలికంగా దీన్ని మన హెడ్‌క్వార్టర్సుగా చేశాం. మీరు లేరుగా, మీకోసం" అన్నాడు హుస్సేన్.

"వెరీగుడ్" హుస్సేన్ ముందు, వెనకరాజు, ఆ వెనక మరో యిద్దరూ ఆ యింట్లోకి వెళ్ళారు. హాల్లో టెలిఫోన్‌ని గమనించి "టెలిఫోన్ కూడా ఏర్పాటు చేశారే" అన్నాడు.

"మీ సూచన ప్రకారం మెయిన్‌లైన్ టాప్ చేశాము. ఎక్కణ్ణించి చేస్తున్నదీ తెలియదు" అన్నాడు హుస్సేన్ గర్వంగా.

దీపాలు వెలుగుతున్నాయి. వెలుగులో కూడా తనని అనుమానించలేదు. అంతవరకూ నయం.

ఇంతవరకూ అన్నీ సక్రమంగానే సాగుతున్నాయి అనుకుని రాజు టెలిఫోన్ దగ్గరికి వెళ్ళి, యుగంధర్ నెంబర్ తిప్పి "నేను సులేమాన్‌ని. రాజూ! థాంక్‌యు" అని మాట్లాడడం ప్రారంభించాడు.

తలుపు తెరిచాడు యుగంధర్. యుగంధర్ వెనకే స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ బండార్కర్, ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు, తర్వాత కాత్యా లోపలికి వెళ్ళారు. కుర్చీలో కూర్చునున్నాడు సులేమాన్. అతని కాళ్ళు రెండు గొలుసులతో బిగించబడి వున్నాయి. చేతులు రెండూ వెనక్కి కుర్చీకి కట్టేసి వున్నాయి. తల వెనక్కి వాల్చి పడుకున్నవాడు తలుపు తియ్యడం చప్పుడు అవగానే కళ్ళు తెరిచి యుగంధర్ని చూసి చిరునవ్వు నవ్వాడు.

ఒక నిముషం పాటు యుగంధర్ ఆశ్చర్యంతో తలుపు దగ్గిరే నిలబడిపోయి, తేరుకుని ఒక్క అంగలో సులేమాన్‌ని చేరుకుని "మీరు ఎవరో రాజుకి తెలియదు. తెలిసివుంటే యింత యిబ్బంది పెట్టివుండడు" అంటూ సులేమాన్ కాళ్ళగొలుసులూ, చేతులకట్లూ వూడదీశాడు. సులేమాన్ లేచి నిలుచుని, చేతులు రుద్దుకుని "మీరు తప్పించుకున్నారన్నమాట. మావాళ్ళు మిమ్మల్ని బందీగా వుంచగల సమర్థులు కారని నాకు తెలుసు" అన్నాడు.

"కాత్యా! కాఫీ తెప్పించు. ఈయన అసలు పేరు సులేమాన్ కాదు. అబ్దుల్ షకీర్. ఈయన పాకిస్తాన్ ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్" అని బండార్కర్ వైపు తిరిగి, "మిస్టర్ షకీర్ ఈయన బండార్కర్. మా స్పెషల్ బ్రాంచి డైరెక్టర్. మీరిద్దరూ సమాన హోదాలవారు" అన్నాడు.

అంతలో కాత్యా ఒక ట్రేలో కాఫీ కప్పులూ, కాఫీ పాట్ తెచ్చింది. "మిస్టర్ షకీర్. మీలాంటి వున్నత ఉద్యోగి మారుపేరుతో సామాన్యమైన గూఢచారిలా యింకో దేశంలోకి, అందులోనూ స్నేహబంధాలు బాగాలేని దేశంలోకి రావడం నాకు చాలా ఆశ్చర్యంగా వుంది" అన్నాడు యుగంధర్.

"నేనే స్వయంగా గూఢచారిగా వెళ్ళడం మంచిది కాదనీ, డిపార్టుమెంటు అధికారి వెళ్ళిపోతే డిపార్టుమెంటు నడిపేవారు వుండరనీ చాలామంది చెప్పారు మా అధ్యక్షుడికి. ఒప్పుకోలేదు నేను తిరిగి వచ్చేంతవరకూ, నా డిపార్టుమెంట్ తనే నిర్వహిస్తాననీ, యింత ముఖ్యమైన పనికి మరొకరిని పంపేందుకు తనకి ధైర్యం చాలడం లేదనీ నన్నే వెళ్ళమనీ మా అధ్యక్షుడు పట్టుపట్టడం వల్ల నేనే స్వయంగా రావలసి వచ్చింది" అన్నాడు షకీర్.

"ఇది చాలా యిబ్బంది పరిస్థితి. మీరు ఫలానా అని తెలిసిన తర్వాత" అంటున్నాడు బండార్కర్.

యుగంధర్ బండార్కర్ మాటలకి అడ్డువచ్చి "ఏ ఇబ్బందేమీలేదు. మిష్టర్ షకీర్ ఏనాడయితే ఒక గూఢచారిగా మన దేశంలో ప్రవేశించారో ఆయన పదివికున్న హోదా ఆనాడే పోగొట్టుకున్నారు" అని షకీర్ వైపు తిరిగి "ఇప్పుడు అర్థమవుతోంది. మిమ్మల్ని విడిపించేందుకు, నన్ను వొదిలిపెట్టడానికి కూడా అంగీకరిస్తూ మీవాళ్ళు ఎందుకు అంత తాపత్రయపడ్డారో. మీరు ఫలానా అని తెలిసిన తర్వాత ఇక బేరానికి మాకు మంచి అవకాశం దొరికింది మిష్టర్ షకీర్. మీకు ఎటువంటి హాని కలగకుండా క్షేమంగా మిమ్మల్ని మీ దేశానికి పంపే ఏర్పాటు చేస్తాము. ఎటొచ్చీ కుమార్ ఎక్కడున్నదీ చెప్పండి. కుమార్‌ని మాకు అప్పగించే ఏర్పాటు మీరు చేయించండి" అన్నాడు.

షకీర్ నవ్వాడు. "యుగంధర్ మీరు అన్నట్టు నేను మా డిపార్టుమెంటు డైరెక్టర్ని కాను. ఈ క్షణాన అధ్యక్షుడే ఆ డిపార్టుమెంటు నిర్వహిస్తున్నాడు. అది ఒక కారణం. రెండవది, కుమార్ చేతికి చిక్కాడని మా అధ్యక్షుడికి తెలుసు. నేనే తెలియజేశాను. ఎంతమందిని చంపయినా సరే, ఎంతమందిని మావాళ్ళని బలి యిచ్చినా సరే, కుమార్ని వొదలవద్దని అధ్యక్షుడు ఏజెంట్లకందరికీ స్వయంగా ఆజ్ఞ యిచ్చాడు" అన్నాడు షకీర్.

"అయితే, కుమార్ యింకా యీ దేశంలోనే వున్నాడన్నమాట. అంతవరకూ నయమే. ఆల్‌రైట్ కుమార్‌ని మాకు అప్పగించడంలో మీరు మాకు ఏ సహాయమూ చెయ్యలేరు సరే. నాకు కొన్ని సంశయాలు వున్నాయి. వాటికి జవాబు చెప్పగలరా?" అడిగాడు యుగంధర్.

"మిష్టర్ యుగంధర్. మీమీద నాకున్న గౌరవం యింతా అంతా కాదు. నా దృష్టిలో మీకన్న గొప్ప మేధస్సు గల అపరాధ పరిశోధకుడు పుట్టలేదు. ఇంక పుట్టబోడు. బలమూ, తెలివీ, చాతుర్యమూ, అంతేకాక ఎటువంటి పరిస్థితుల్లోనూ న్యాయమూ, ధర్మమూ, దయా విడనాడకుండా మీరు నెగ్గుకు వస్తున్నారు. అడగండి. కుమార్ ఎక్కడున్నదీ తప్ప, మిగతా మీరడిగే అన్ని ప్రశ్నలకీ జవాబు చెపుతాను" అన్నాడు షకీర్.

"కుమార్ మీ చేతికి చిక్కాడు. ఆ తర్వాత మీరు యింకా నా విషయం ఎందుకు పట్టించుకున్నారు? ప్రొఫెసర్ వై.జి.శర్మ యింట్లో నన్ను, నా అసిస్టెంట్‌నీ బంధించి మీరు తీసుకునిపోవడానికి ప్రయత్నించకపోతే మీరు అసలు పట్టుబడేవారు కారేమో?

షకీర్ ఒక నిముషం మౌనంగా వుండి "మీ ప్రశ్నకి సమాధానం చెప్పాలంటే నేను ఒక విషయం ఒప్పుకోవాలి. ఎలాగూ మీరు ఊహించారు. చెపితే నష్టంలేదు. కుమార్‌ని పట్టుకుని తీసికెళ్ళి ఒకచోట దాచేశాము. ఈ దేశాన్నించి, మా దేశానికి తీసుకుపోయేందుకు అవకాశం లేకుండా పోయింది. మీ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు కుమార్‌ని ఎక్కడ దాచామో ఎవరూ కనుక్కోలేరని మా నమ్మకం. ఒకరు తప్ప అది మీరు. మీరు కుమార్ కోసం వేట ప్రారంభించారు. మీరు మా రహస్యం తెలుసుకుంటారని భయం కలిగి మిమ్మల్ని బందీగా తీసుకెళ్ళడానికి ప్రయత్నించాము."

"థాంక్ యు ఫర్ ది కాంప్లిమెంట్స్. నేను మీ రహస్యం తెలుసుకుంటానని అంత భయంగా వున్నప్పుడు వై.జి.శర్మ యింట్లో నేనూ, రాజూ నిరాయుధులుగా మీకు దొరికాము కదా. అక్కడక్కడే మమ్మల్ని చంపి మీరు వెళ్ళిపోయి వుండవచ్చుగా" అడిగాడు యుగంధర్.

"అవును. మిమ్మల్ని చంపమనే మాకు ఆజ్ఞ. ఈ కేసు విషయంలోనే కాదు. అసలు మా కార్యక్రమాలకి ఎప్పట్నుంచో మీరు అడ్డుతగులుతూ, మా అపజయాలకి కారకులు అవుతున్నారు. యుగంధర్‌ని చంపే అవకాశం ఏ ఏజెంటుకి దొరికినా చంపమనీ, చంపిన ఏజెంటుకి వెంటనే ప్రమోషన్ యిస్తామనీ, అంతేకాక రొక్కంగా లక్షరూపాయలు బహుమానం యిస్తామనీ మా అధ్యక్షుడు మా డిపార్టుమెంటులో అందరికీ చెప్పారు. నా అసిస్టెంటు హుస్సేన్ మిమ్మల్ని చంపి ఆ బహుమానం, ప్రమోషన్ ఎందుకు ఆశించలేదనా! మరి తన డిపార్టుమెంటు పెద్దయిన నన్ను విడిపిస్తే అంతకన్నా పెద్ద ప్రమోషన్, బహుమానం లభిస్తుందనే ఆశవల్ల అయ్యుండాలి. ఇకపోతే నేను ఎందుకు చూస్తూ చూస్తూ ఒక నిరాయుధుణ్ణి, అందులోను మిమ్మల్ని కాల్చి చంపలేకపోయాననా? మిమ్మల్నీ, రాజునీ, కుమార్‌తో పాటు మా దేశానికి తీసుకెళ్ళి మా అధ్యక్షుడికి అప్పచెపుదామని అనుకున్నాను" అన్నాడు షకీర్.

"నా సంశయాలకి జవాబులు చెపుతున్నందుకు మరోసారి థాంక్స్ యింకా కొన్ని ప్రశ్నలు" అంటున్నాడు యుగంధర్.

షకీర్ నవ్వాడు. "మీరు ప్రశ్నలు అడగడం, నేను జవాబులు చెప్పడం దేనికి? నేను చెప్పదలచుకున్న విషయాలు ఏమిటో నేనే చెప్పేస్తాను వినండి" అన్నాడు. యుగంధర్ సిగిరెట్ ప్యాకెట్ అందించాడు. షకీర్ సిగిరెట్ వెలిగించి చెప్పడం ప్రారంభించాడు.

## 14

**సులేమాన్** వేషంలో వున్న రాజు, సులేమాన్ అసిస్టెంటు హుస్సేన్, వాళ్ళ అనుచరులు మరొకరిద్దరు నలుగురూ కూర్చుని విస్కీ తాగుతున్నారు. అంతలో లోపల గదిలోంచి ఓ యువతి వచ్చి "సర్! ప్రెసిడెంట్ కాలింగ్ యు" అన్నది. వెంటనే రాజు లేచాడు. తడబడుతూ రెండడుగులు వేశాడు. "సర్! స్టెడీ అంటూ ఆ యువతి రాజు మోచేయి పట్టుకుని, నడిపించుకుని తీసుకెళ్ళింది లోపలికి యింకో గదిలోకి. గది చాలా చిన్నది. ఒకే ఒక ఎలక్ట్రిక్ దీపం వెలుగుతోంది. గదిలో ఒకమూలగా ఒక వైర్‌లెస్ ట్రాన్స్‌మీటర్ వుంది. ఆ యువతి ఓ మీట నొక్కింది. కుయ్ కుయ్‌మని చప్పుడయింది. తర్వాత రిసీవింగ్ సెట్‌లోంచి గుర్ గుర్ మని వినిపించింది.

"మీరు యిక మాట్లాడవచ్చు" అని ఆ యువతి గదిలోంచి వెళ్ళిపోయి తలుపు మూసేసింది. రిసీవర్‌లోంచి మళ్ళీ గుర్ గుర్ మన్న శబ్దం. వైర్‌లెస్ రిసీవింగ్ అండ్ ట్రాన్స్‌మీటింగ్ సెట్స్ ఎలా ఉపయోగించాలో రాజుకి తెలుసు. అదికాదు రాజు సమస్య. ఇప్పుడు అవతలనించి కోడ్‌లో అడుగుతున్నాడు, తను కోడ్‌లో జవాబు చెప్పాలి. అవతల మాట్లాడుతున్నది ఎవరోకాదు. పాకిస్థాన్ అధ్యక్షుడు.

"గుర్...గుర్...గుర్..క్కుర్."

ఒక్క తప్పుచేస్తే తన ప్రాణానికే నష్టంకాదు. ఇంతవరకూ తను సాధించినదంతా వృధా అవుతుంది. గదంతా కలయచూశాడు. తన పిచ్చికాని కోడ్ వ్రాసి పెడతారా? ధైర్యం చేశాడు. "క్షమించాలి. నేను గత కొన్ని రోజులుగా యుగంధర్ అసిస్టెంట్ రాజు బందీగా వున్నాను. అతను రకరకాల మత్తు మందులు యిచ్చాడు. జ్ఞాపకశక్తి క్షీణించింది. ఇంక ఒకటి, రెండు రోజులు అయితేగానీ పూర్తిగా కోలుకోలేను. అంతవరకూ..."

"దట్ యీజ్ వెరీబాడ్ ఆరోగ్యం కోలుకోగానే కాంటాక్టు చెయ్యవలసింది" నిశ్శబ్దం అయింది. రాజు ఒక్క నిట్టూర్పు వదిలి గదిలోంచి బయటికి వచ్చాడు. ఇప్పటికి గండం గడిచింది. అతను గదిలోకి రాగానే అందరూ లేచి నిలుచున్నారు. "ఏమిటి సర్ ఇన్‌స్ట్రక్షన్స్?" అడిగాడు హుస్సేన్.

"అధ్యక్షుడు చెప్పే విషయాలన్నీ నీకు చెప్పాలా?" అడిగాడు రాజు కోపంగా.

"సారీ సర్ యు ఆర్ యిన్ ఏ బాడ్ మూడ్" అని హుస్సేన్ గ్లాసు ఖాళీ చేసి, గుడ్‌నైట్ చెప్పి మెట్లు ఎక్కి పైకి వెళ్ళిపోయాడు. రాజు ఒక్కడే విస్కీ గ్లాసు చేతిలో పట్టుకుని కూర్చున్నాడు. ఆ కోడ్ ఏమిటో తెలుసుకోవాలి. తెలుసుకుంటే తరవాత ఎత్తు వెయ్యవచ్చు. కుమార్‌ని ఎక్కడ దాచారని తను హుస్సేన్‌ని అడగడానికి వీలులేదు. ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తూ విస్కీ చప్పరిస్తున్నాడు. అంతలో వైర్‌లెస్ రూం తలుపు తెరుచుకుంది. ఆ యువతి తలుపు దగ్గిరే నిలబడి రాజుని చూస్తోంది. రాజు గమనించాడు. "ఎందుకు యిక్కడ నిలుచున్నావ్? ఏం కావాలి?" కసిరాడు రాజు.

ఆమె నవ్వింది. "యు ఆర్ రియల్లీ యిన్ ఎ వెరీ బ్యాడ్ మూడ్ అంతేకాదు యు ఆర్ యిన్ ఎ వెరీ బాడ్ ప్లైయిట్" అన్నదామె. అంటూ రివాల్వర్ రాజు ఛాతీమీదికి సూటిగా గురిపెట్టి వుంచింది. రాజు బెదిరిపోలేదు. ఇటువంటి పరిస్థితి ఏదో కలుగుతుందని అనుకుంటూనే వున్నాడు. "నువ్వు.." అంటున్నాడు. మాట్లాడవద్దని సంజ్ఞ చేసి రమ్మని చేత్తో పిలిపించి. రాజులేస్తున్నాడు. "ప్లీజ్ చేతులు పైకి ఎత్తు" అన్నది. తప్పలేదు రాజుకి. రెండుచేతులూ పైకి ఎత్తిపెట్టి ముందుకి నడిచాడు. రాజు గదిలోకి వెళ్ళిన తర్వాత కాలితో తలుపు మూసి, రివాల్వర్ కిందికి దింపకుండా "మిస్టర్ ఇప్పుడు చెప్పు నువ్వు ఎవరు?" అడిగింది.

"నీ ధైర్యానికి మెచ్చుకుంటున్నాను. నిన్ను డిస్మిస్ చేస్తాను" బుకాయించడానికి ప్రయత్నించాడు రాజు.

"చాలు ఆ డబాయింపు వద్దు. నువ్వు సులేమాన్‌వి కావని నాకు తెలుసు."

"ఎలా తెలుసు?"

"ఫూల్! సులేమాన్ గదిలోకి వచ్చిన తర్వాత, ఎందుకులే వివరాలు నీకు చెప్పడం. నేనూ, సులేమాన్ ప్రేయసీ ప్రియులం" అన్నది.

"సరే, నువ్వు సులేమాన్ ప్రియురాలివి. ఒప్పుకున్నాను. నేను సులేమాన్ కానని తెలుసుకున్నాక అందర్నీ పిలిచి నన్ను పట్టివ్వకుండా"

"అదీ చెప్తాను ఓపికపట్టు. నువ్వు ఎవరివి? ఎందుకిలా సులేమాన్‌లా మారువేషంలో వచ్చావు? అందర్నీ మోసం చెయ్యగలనని ఎలా అనుకున్నావు? అసలు నీ యీ మోసానికి కారణం ఏమిటి? నిజం చెప్పావంటే నిన్ను ప్రాణాలతో వొదిలిపెడతాను" అన్నదామె.

రాజు తలుపు వైపు చూశాడు. లోపల గడియ వేసి వుంది. రాజుకి నవ్వు వచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నావు? నవ్వడానికి ఏముంది?" అడిగింది. రివాల్వర్ క్రిందికి దింపలేదు.

"నీ అమాయకత్వానికి. నీ వెనక..."

"నన్ను అలా మోసం చెయ్యలేవు" అన్నదామె.

"సరే. నీ ప్రశ్నలకి నేను జవాబు చెప్పను. కమాన్! ముందికి ఒక తోపు తొయ్యి" అన్నాడు రాజు ఆమె వెనక తలుపు వంక చూస్తూ. ఎవరో అక్కడ నిలుచున్నట్టు కళ్ళతో సంజ్ఞ చేశాడు. రాజు నిజం చెబుతున్నాడేమో? ఒక్క అరక్షణం వెనక్కి తిరిగితేనేం అనుకుని ఆమె తల వెనక్కి తిప్పింది.

అది చాలు. ఆ అరక్షణం చాలు రాజుకి. ఒక్క ఎగురు ఎగిరి, మనిషి అంతా ఆమె మీద పడ్డాడు. పడుతూ, ఒక చెయ్యి ఆమె నోటిమీదికీ, యింకో చెయ్యి పిస్తోలున్న ఆమె చేతిమీదికీ పోనిచ్చాడు. ఇద్దరూ నేలమీద పడ్డారు. ఆమె క్రింద అతను పైన. ఆమెని అరవనివ్వకుండా నోరు ఒక చేత్తో నొక్కేశాడు. ఇంకో చేత్తో పిస్తోలున్న ఆమె చేతిని మెలిపెట్టాడు. బాధతో ఆమె కళ్ళు ముడుచుకుంటున్నాయి "వొదిలెయ్యి. పిస్తోలు విడిచెయ్యి, లేదా చెయ్యి విరిగిపోతుంది" అన్నాడు ఆమె చెవిలో. అతని బరువుక్రింద ఆమె నలిగిపోతోంది. ఊపిరి ఆడడంలేదు. అతని బలం ముందు ఆమె బలం ఏమాత్రం సరిపోవడంలేదు. ఆ విషయం ఆమెకీ తెలుసు.

ఒదిలేసింది పిస్తోలు. ఆమె రెండుచేతులూ తన పొట్టకిందికి లాక్కుని నొక్కిపెట్టాడు.

ఆమె నోటిమీదనించి చెయ్యి తియ్యలేదు. రాజు ఆమె మీదికి ఎగిరినప్పుడు అక్కడ వున్న చిన్న బల్ల కింద పడింది. ఆ చప్పుడికి మేడమీద వున్న హుస్సేన్, తదితరులు పరిగెత్తుకుని వచ్చి "సర్! ఏమిటి? ఏం జరిగింది?" అదిగాడు గది బయటనించి హుస్సేన్.

"అనవసర విషయాల్లో జోక్యం కల్పించుకోకు. గెట్‌బాక్" అరిచాడు ధీమాగా రాజు. అదే సమయంలో చేత్తో ఆమె గొంతు పట్టుకుని కొద్దిగా నలుపుతూ "నవ్వు, నవ్వు. ప్రేమకలాపం అని వాళ్ళకి అనిపించేలా నవ్వు" అన్నాడు ఆమె చెవిలో. ఆమె నోటిమీదినించి చెయ్యి కొద్దిగా తీశాడు. "అరిచావా, చస్తావు" అన్నాడు. అతని కళ్ళల్లో తెగింపు ఆమె కర్థమయింది. కిలకిలా నవ్వింది. నవ్వుతోంది. రాజు ఊపిరి పీల్చాడు. గదిబయట నిలుచున్న వాళ్ళ బూట్సుల చప్పుడు కాస్త దూరమైంది. కానీ వాళ్ళ మాటలు అస్పష్టంగా వినపడుతున్నాయి. అంటే వాళ్ళు హాల్లోనే అక్కడే గదిముందు కూర్చున్నారు.

అతని వొంటి బరువు మోయలేక ఆమె ఆయాసపడుతోందని తెలుసు రాజుకి. కానీ పక్కకి తొలిగితే తన పట్టు సడలితే ఆమె అరిస్తే? ఆమెని కదలనివ్వలేదు. ఆమెని వొదలలేదు. క్షణాలు నిమిషాలు అవుతున్నాయి. నిమిషాలు గడిచిపోతున్నాయి.

"పేకముక్కలు పట్టా ఆడుకుందాం" అరిచాడు హుస్సేన్. ఎవరో మెట్లు ఎక్కుతున్నారు. అంటే వాళ్ళు అక్కడనించి కదలరు. ఎందుకు? అనుమానం కలిగిందా? ఎంతసేపు యిలా యీమెని? ఆమె కళ్ళల్లోకి చూశాడు. తన కళ్ళల్లోకి జాలిగా చూస్తోంది. కళ్ళల్లో నీళ్ళు నిండిపోయాయి ఆమెకి. ఆమెని వొదిలితే అరుస్తుంది. అరిస్తే తన ప్రాణం పోతుంది. తప్పదు. చంపెయ్యాలి. గొంతు నలిపి ఆమెని చంపెయ్యాలి. దయకీ, ఆడదనే జాలికీ సమయంకాదు. తప్పదు.

అయినా ఎలా? ఒక ఆడదాన్ని గొంతుపట్టి నలిపి చంపడం? తను చెయ్యలేడు. ఏం చెయ్యాలి? గది బయట వాళ్ళు పేకాట మొదలుపెట్టారు. పేకముక్కలు కలపడం వినపడుతోంది. నిముషాలు దొర్లిపోతున్నాయి. అతని బరువు భరించలేక ఆమె రొప్పుతోంది. రొప్పుతూ కనురెప్పలు రెపరెపలాడిస్తోంది. ఏమిటి? ఏదో సంకేతంలా? ఏదో అర్థంతో రెప్పలు ఆడిపిస్తోంది. మనస్సంతా కేంద్రీకరించి ఆ రెపరెపలు చూస్తున్నాడు. అర్థమవుతోంది. మోర్స్‌కోడ్ సూత్రంగా పెట్టుకుని కోడ్‌లో చెపుతోంది.

"నేను అరవను. నేను నిన్ను బయటపెట్టను. నన్ను చంపక" అదే ఆమె చెపుతున్న విషయం.

"ఎలా నమ్మడం?" చెవిలో అన్నాడు రాజు.

"నేను వాళ్ళల్లో ఒకతెను కాను. అయితే నిన్ను అప్పుడే వాళ్ళకి పట్టిచ్చేదాన్ని. నీలాగే శత్రువ్యూహంలోకి మాయోపాయంతో చేరినదాన్ని నేను. అందుకే సులేమాన్‌ని నా వలలో వేసుకున్నాను" ఆమె కళ్ళల్లోకి చూశాడు. ఆ కళ్ళల్లో దైన్యమూ, భయమేనా? లేక నిజం కూడా కనిపిస్తోందా? ఒక్కొక్కప్పుడు యీ వృత్తిలో కూడా ఎవర్నో ఒకర్ని నమ్మవలసి వస్తుంది. ఈమెని నమ్మిచంపకుండా గొంతుమీదనించి చేతులు తియ్యడం పొరపాటేమో? తన ప్రాణం పోతుందేమో? అయినా ఆడదాన్ని తను చంపలేడు. అంతకన్నా ఆమె మాటలు నమ్మడమే మంచిది. ఆమె గొంతుమీదనించి చేతులు తీసేశాడు. ఆమె మీదనించి జరిగాడు. ఒకసారి బరువుగా ఊపిరి తీసుకుని వదిలి రాజుని చూసి చిరునవ్వు నవ్వి, చటుక్కున ముందుకు వంగి అతని పెదిమలమీద చిన్నముద్దు పెట్టుకుంది ."థాంక్యూ, ప్రస్తుతానికి మనం మిత్రులం. తర్వాత ఏమవుతుందో చూద్దాం. నిన్ను నేను బయట పెట్టడానికి ప్రయత్నిస్తే, నా విషయం బయటపడవచ్చు" అన్నది.

"నువ్వు ఎవరు?" అడిగాడు రాజు.

"నా పేరు జానీటా. నేను అమెరికన్ సి.ఐ.ఏ ప్రతినిధిని" అన్నది.

రెండుసార్లు సిగిరెట్ పొగపీల్చి, వొదిలి షకీర్ చెప్పడం ప్రారంభించాడు.

"కుమార్ చేస్తున్న పరిశోధన గురించి మాకు తెలిసింది. సరే ఎవరిద్వారా తెలిసిందో చెప్పను. కుమార్ పరిశోధన గురించి మాకు తెలిసింది. సారీ! ఎవరిద్వారా తెలిసిందో చెప్పను. కుమార్ పరిశోధన విజయవంతం అయి అటునింటిలోహమే తయారు చేయగలిగితే, యుద్ధ పరికరాలకీ, ఆయుధాలకీ ఉపయోగ పడితే అది మా పాకిస్తాన్ దేశంలోనే తయారుకావాలి. ఇంకెవరికి లభ్యం కాకూడదు అని మా అధ్యక్షులు నన్ను పిలిచి చెప్పారు. ఆ లోహాన్ని తయారు చెయ్యడానికి ప్రయత్నిస్తున్న శాస్త్రజ్ఞుణ్ణి పాకిస్తాన్‌కి తీసుకువచ్చినా సరే, లేదా ఆ రహస్యం కనుక్కొని, ఆ రహస్యం యింకెవరికీ తెలియకుండా ఆ శాస్త్రజ్ఞుణ్ణి చంపేసినా సరే" అని అధ్యక్షులు నాకు చెప్పారు.

"మా ఏజెంట్లనించి వచ్చిన మొదటి రిపోర్టుని బట్టి కుమార్ చాలామంచి యువకుడనీ, అతని పరిశోధన తప్ప అతనింకే విషయాలు పట్టించుకోడనీ, మనుష్యులతో ఎక్కువ పరిచయం చేసుకునే వ్యక్తికాడనీ తెలిసింది. అటువంటి మనిషికి ఆడవాళ్ళు అసలు పరిచయం వుండరు. వెంటనే నేను ప్లాన్ ఆఫ్ ఆక్షన్ తయారుచేసి, నా అసిస్టెంట్ హుస్సేన్‌తో మా డిపార్టుమెంటులోని ఆడ ఏజెంట్లలో ఘటికురాలయిన నజీంని తీసుకుని రహస్యంగా ఈ దేశం చేరుకున్నాము. విశాఖపట్నంలో యిల్లు అద్దెకు తీసుకుని, హార్డ్‌వేర్ మర్చంట్సుగా వృత్తి ప్రారంభించాము. మా వేషాలు పూర్తిగా మార్చుకునేందుకు నా అసిస్టెంటు హుస్సేన్ నజీం తండ్రిగా, నేను హుస్సేన్ కొడుకు సులేమాన్‌గా నటించాము. నజీమ్ కుమార్‌తో పరిచయం చేసుకుని, అతన్ని వలలో వేసుకుని, పెళ్ళి చేసుకుని, హనీమూన్‌కి సిమ్లాకి బయలుదేరదీయాలి. తోవలోనో, సిమ్లాలోనో కుమార్‌ని బంధించి రహస్యంగా సరిహద్దు దాటించి పాకిస్తాన్ తీసుకుని పోవాలని మా పథకం. మా పథకానికి మొదటి అంతరాయం. మీవాళ్ళు. మేం అనుకున్నంత అజ్ఞానులుకారు. కుమార్‌ని ఒక కంట కనిపెట్టమని స్పెషల్ బ్రాంచి ఏజెంటుని నియమించారు. కుమార్ ఎక్కడికి వెళితే అక్కడ నీడలా అతను వెంట వుంటున్నాడు. అతనికి అనుమానం కలగకుండా మా కార్యక్రమం సాగించాలి. ఇక రెండవ అంతరాయం కుమార్ తండ్రి - శివరాం" అన్నాడు షకీర్.

"ఒక ముస్లిం యువతిని పెళ్ళి చేసుకుంటానంటే ఏ తండ్రీ అంగీకరించడని మీరు ముందే ఊహించి ఉంటారుగా" అన్నాడు యుగంధర్.

షకీర్ నవ్వాడు. "అవును. తండ్రి అభ్యంతరం చెపుతాడు. అభ్యంతరాలు, ఆటంకాలు ఏర్పడినపుడు ప్రేమపిచ్చి ఎక్కువ అవుతుంది. జనీం కోసం కుమార్ ఏమైనా చేస్తాడు అని అనుకున్నాను. కానీ విచారిస్తే అడ్వకేటు శివరాం చాలా అధునాతన భావాలు కలవాడు అనీ, జాతి, మత, కుల, ఆర్థిక విభేదాలు పాటించనివాడనీ తెలిసింది. చిక్కులో పడ్డాను. తండ్రి అభ్యంతరం చెపితే, తండ్రినీ, తల్లినీ ఎదిరించి కుమార్ నజీంని పెళ్ళిచేసుకుని, ఎవరికీ చెప్పకుండా విశాఖపట్నం నించి తన భార్యతో వెళ్ళిపోతే ఎవరూ అంతగా పట్టించుకోరు. తండ్రి అభ్యంతరం చెప్పకపోతే మా పథకం విషయం ఏమిటి? నజీం విషయం శివరాం ఆరా తీస్తున్నాడని తెలిసి నేనే కొంత దొంగ సాక్ష్యం సృష్టించాను. నజీం వేశ్య అనీ, నజీం వయస్సులో కుమార్ కన్నా పెద్దది అని. ఈ రెండు కారణాలవల్ల శివరాం తన కొడుకు నజీంని పెళ్ళి చేసుకోడం ఒప్పుకోడని అనుకున్నాను. నేను అనుకున్నట్టు శివరాం కొడుకుతో ఘర్షణ పడ్డాడు. నేనూ హుస్సేన్ నాటకం ఆడాం. నజీమ్ వయస్సులో కుమార్ కన్నా పెద్దది అనీ, ఈ రెండు కారణాలవల్ల శివరాంతో తన కొడుకు నజీంని పెళ్ళిచేసుకోడం మాకూ యిష్టంలేదని నిష్కర్షగా చెప్పాము. ఇలా చెయ్యడం వల్ల మీ స్పెషల్ బ్రాంచి ఏజెంటుకి మా మీద అనుమానం కలగలేదు. నజీందీ కుమార్‌దీ నిజమైన ప్రేమ అనుకున్నాడు అతను. అందువల్లే మా విషయం అంత పట్టించుకోలేదు. అంతవరకూ అన్నీ సవ్యంగానే సాగిపోయాయి."

"తర్వాత?" అడిగాడు యుగంధర్.

"మాట్లాడి మాట్లాడి నోరు ఎండుకుపోతోంది. మంచినీళ్ళు" షకీర్ అనగానే కాత్యా చల్లని మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది.

"పెళ్ళయిపోయింది. హనీమూన్‌కి ఊటీకి వెళ్ళాలని కుమార్ అన్నాడు. నజీం ఆ విషయం నాతో చెప్పింది. ఇబ్బందేమీ లేదు. అక్కణ్ణించి మళ్ళీ విశాఖపట్నం రాకుండా ఉత్తరదేశానికి తీసుకువెళ్ళమని చెప్పాను. తీరా ఊటీ వచ్చారు. నేను హుస్సేన్ కూడా ఊటీ వెళ్ళాము. అందరం ఊటీలోనే ఏవో అమ్మేవాడి వేషంలో ఒకటి రెండుసార్లు హుస్సేన్ వెళ్ళి నజీంని కలుసుకున్నాడు. కుమార్ పూర్తిగా తన వలలో పడిపోయాడనీ, తను ఎంతచెపితే అంతేనని ధైర్యం చెప్పింది నజీం. ఊటీనించి అతన్ని బయలుదేరదీయడానికి ప్రయత్నం చెయ్యమని చెప్పాము. వారం రోజులు దాటినా నజీం ఆ ప్రయత్నం ఏమీ చెయ్యడంలేదు. ఆమెని తొందరపెట్టడానికని, ఆ రాత్రి వెళ్ళాను. కిటికీలోంచి నజీం నన్ను చూసి డూప్లికేట్ తాళం చెవి యిచ్చింది. లోపలికి వెళ్ళాక నాకు మొదటి షాక్ - నజీం నాకు ఎదురు తిరగడం. కుమార్‌ని తను మనసారా ప్రేమిస్తున్నాననీ, అతనికి ద్రోహం చెయ్యలేననీ అతను తర్వాత తనని ద్వేషించడం తను సహించలేననీ చెప్పి ఏడ్చింది. నా ఆశ్చర్యానికి అంతులేదు. శిక్షణ పొందిన, అనుభవం వున్న ఆడ ఏజెంట్లు అందరిలోకీ సమర్థురాలైన నజీమే యిలా ఒక యువకుణ్ణి తన వలలో వేసుకోబోయి, అతని వలలో తనేపడి ప్రేమ అంటుందేమిటి? మా వృత్తికి ప్రేమ అనేది తగదనీ, గూఢచారిత్వం వృత్తిగా స్వీకరించిన తర్వాత అవన్నీ మర్చిపోవాలనీ యిపుడు మాకు ఇలా ఎదురు తిరిగితే తీవ్రమైన శిక్ష పడుతుందనీ, ఎంతో చెప్పి చూశాను. తనని కావలిస్తే చంపమన్నది. కుమార్ దృష్టిలో తను నీచపడడం కన్నా చావే మేలన్నది. ప్రేమలో పడ్డ ఆడదానితో వాదించి ప్రయోజనం లేదనుకున్నాను. అంతలో బయట ఏదో అలికిడి అయింది. కుమార్ వస్తున్నాడేమోనని ఎక్కడ దాక్కోవాలా అని చూస్తున్నాను వీధితలుపు లోపల గడియపెట్టడం మర్చిపోయాను. అడుగుల చప్పుడు వినిపించింది. పడక గది తలుపు వెనక్కి వెళ్ళి నిలుచున్నాను. అవసరమైతే కుమార్‌ని ఒక దెబ్బకొట్టి పారిపోదామని కాని తీరా లోపలికి కుమార్ కాదు. ఒక స్త్రీ."

షకీర్ ఒక్క నిముషం పాటు మౌనంగా వుండి, మళ్ళీ ప్రారంభించాడు. 'మైడియర్ సర్ ఆ వచ్చిన స్త్రీ మూడుమూర్తులా నజీంలా వుంది. చేతిలో పిస్తోలు పట్టుకుని నిలబడింది. నజీం ఛాతీమీదికి గురిపెట్టింది పిస్తోలు. ఆ యువతి నోరు తెరిచి మాట్లాడేంతవరకూ నాకేమీ తోచలేదు. అచేతనుడనై పోయాను. నజీం అడిగింది ఆమెని "నువ్వు ఎవరు?" అని. ఆ వచ్చిన స్త్రీ నవ్వి "నేను నజీంని. నువ్వు ఎవరివో" అంటూ పిస్తోలు మీట లాగుతోంది. అంతే. యిక క్షణం ఆలస్యం చెయ్యలేదు. మొలలో వున్న కత్తి తీసి, ఆమెని వీపులో పొడిచేశాను. ఆమె చేతిలోంచి పిస్తోలు కిందపడిపోయింది. రక్తం కింద నేలమీద, తివాసీమీద కారకుండా అమాంతం ఆమెని ఎత్తి పరుపుమీద పడేశాను. వెంట్రుక వాసిలో చావు తప్పించుకున్నానని నజీంకి తెలిసొచ్చింది. మనిషి రెపరెపలాడిపోతోంది.

"స్టడీ నజీం! ఇప్పుడయినా తెలిసిందా? ఒకసారి యీ వృత్తిలోకి దిగాక మళ్ళీ వెనక్కిపోవడం అంటూ వుండదు. పద.. పోదాం" అన్నాను.

"ఎక్కడికి?" అడిగింది నజీం.

"ఇద్దరు నజీంలని చూసి కుమార్ ఏమవుతాడు? అతన్ని గందరగోళం చెయ్యకూడదు. కుమార్ వచ్చే టైం అయింది. పద" అని చనిపోయిన స్త్రీ వీపులో వున్న కత్తి తీసేసి, డూప్లికేట్ తాళం చెవిమీద నా వేలిముద్రలు తుడిచేసి నజీంని తీసుకుని వెళ్ళిపోతూ, ఆ స్త్రీ ఎవరో తెలుసుకుందామని దగ్గరికి వెళ్ళి పరీక్షగా చూశాను. రూపంలో, విగ్రహంలో చాలావరకూ నజీంలా వుంది. నిజమే కానీ, చాలా తేడాకూడా వుంది. నజీంని చంపి, తను నజీంలా నటించి కుమార్‌ని తన వలలో వేసుకోగలనని ఎలా అనుకున్నదో ఆమె. ఆశ్చర్యం. ఆత్మవిశ్వాసానికి కూడా అంతుండాలి" అన్నాడు షకీర్.

"ఇంతకీ ఆమె ఎవరు?" అడిగాడు బండార్కర్.

"ఆమె చైనీస్ గూఢచారిణి. మా రెండు దేశాల మధ్య మైత్రి వున్నా యిటువంటి లోహం మా హస్తగతం కావడం యిష్టంలేక చైనీస్ వాళ్ళు గూఢచారులని పంపారు. సమయమూ అవకాశమూ కలిగినపుడు కుమార్‌ని ఎత్తుకుపోవడానికి వాళ్ళూ పథకం వేసుకున్నారన్నమాట."

మరొక సిగిరెట్ వెలిగించి, చిన్ననవ్వు నవ్వి, "చనిపోయిన స్త్రీ నజీం అని కుమార్ భ్రమపడడానికి చాలా అవకాశం వుంది. మనిషి మాట్లాడినా, కదిలినా, నవ్వినా, అతనికి నజీం కాదని తెలిసిపోయేది అనుకుంటాను. జీవంలేని ఆమెని చూసి, తన నజీమే చచ్చిపోయిందని కుమార్ గుండె బద్దలయిందంటే అందులో ఆశ్చర్యం లేదు. నేను, హుస్సేన్ చచ్చిపోయిన స్త్రీ నజీం అని చెప్పడానికి మాకు కారణాలున్నాయి. అలా చెప్పకపోతే కంప కంప అంతా కదులుతుంది. శివరాం నజీంని దూరంనుంచి చూడడమే కాని ఆమెతో చనువులేదు. అందువల్ల ఆయన పొరపడడానికి అవకాశం వుంది. ఎటొచ్చీ మీ స్పెషల్ బ్రాంచి ఏజెంటు. నజీంని చాలాసార్లు దగ్గిర్లోంచి చూశాడని నాకు తెలుసు. చనిపోయిన స్త్రీ నజీమో కాదో అతనికి తెలుసా, తెలియదా అనే విషయం నాకు తెలియదు" అన్నాడు షకీర్.

"చనిపోయిన స్త్రీ నజీం కాదని అతను చెప్పాడు" అన్నాడు యుగంధర్.

"అవును. శిక్షణ పొందిన గూఢచారి. మనుష్యుల్ని గుర్తుపట్టడంలో గుర్తుపట్టిన వాళ్ళని జ్ఞాపకం ఉంచుకోవడంలో తర్ఫీదు యిచ్చివుంటారుఉ. జస్ట్ ఒన్ సెకండ్ యుగంధర్ నాకు తెలుసు, మీరు శివరాం హత్యగురించి అడగబోతున్నారని. అదే చెపుతాను" ఒక గుక్క మంచినీళ్ళు తాగి చెప్పడం మొదలుపెట్టాడు.

**"శివరాం** కొడుకుతో సహా హోటల్ శరత్‌కి వచ్చి అక్కడ బస చేశాడు. నేను, హుస్సేన్, మొగవేషంలో నజీం, మావాళ్ళు మరొకరిద్దరూ. అందరం శరత్ హోటల్లో దిగాం. అవకాశం కోసం కాచుకున్నాం కుమార్ని ఎత్తుకుపోవడానికి. అనుకోకుండా ఊటీలో హత్య జరగడం, పోలీసులు దర్యాప్తు ప్రారంభించడం, యిదంతా మా పథకానికి అంతరాయం కలిగించింది. అంతేకాక శివరాం మిమ్మల్ని కలుసుకోవడానికి వచ్చారని తెలిసింది. ఆ వార్త వినగానే నాకు ఎంత నిస్పృహ కలిగిందో చెప్పలేను. మీరీ రంగంలోకి దిగితే మా ఎత్తులు సాగవని తెలుసు. శివరాం మీద చాలా కోపం వచ్చింది. మీరు కేసులోకి పూర్తిగా దిగకముందే మా పని ముగించుకు పోవాలని నిశ్చయించుకున్నాను. కుమార్ చేసిన పరిశోధన తాలూకు వ్రాత ప్రతి ఒక్కటే బయట మిగిలివుంది. యూనివర్శిటీలో వున్న టైపు చేసిన కాపీలన్నీ దొంగిలించేశాము. ఆ వ్రాత ప్రతికూడా తీసుకుని కుమార్‌ని ఎత్తుకుపోవాలని నిశ్చయించుకున్నాము. కుమార్ గదిలోకి వెళ్ళిన శివరాంకీ, కుమార్‌కీ మత్తుమందు యిచ్చాము. కాపలా వున్న పోలీస్ కానిస్టేబుల్ దృష్టి ఎటో మరల్చి, కుమార్ని ఎదురుగా వున్న మా గదిలోకి తీసుకు వచ్చాము. పరిశోధన గురించిన వ్రాత ప్రతి కుమార్ తన తండ్రికి ఇచ్చాడనీ ఆయన ఎక్కడో దాచాడనీ, నజీంతో చెప్పాడు కుమార్. శివరాంకి స్పృహ రాగానే, అతన్ని అడిగాము. ఆ వ్రాత ప్రతి మాకు యివ్వననీ, అసలు అది ఎక్కడున్నదో తనకి తెలియదనీ చెప్పాడు. మంచిగా అడిగితే చెప్పడం లేదని, బెదిరించి, హింసించి అతనిచేత నిజం పలికిద్దామని ప్రయత్నించాము. నిజానికి అతన్ని హింసించలేదు. హింసిద్దామని ఒక కత్తి తీశాము. అంతే! దాన్ని చూసి కళ్ళు తేలవేశాడు. అరక్షణంలో ప్రాణం విడిచాడు. అతనికి గుండెజబ్బున్నదని తరువాత తెలిసింది. ఆ షాక్‌కి గుండె ఆగిపోయి వుండాలి అనుకున్నాను. శివరాంని మేము హత్య చేయలేదు. అయితే హత్య చేసినట్లు అతని శవాన్ని కోసి నానాభీకరంగా, రక్తపు మడుగు చేసి, భీభత్సంగా తయారుచేశాము. దానికి కారణం నజీమ్‌ని భయపెట్టడమే. కుమార్‌ని ప్రేమిస్తున్నాననీ, అతనికి అపచారం చెయ్యననీ, తనని వదిలెయ్యమనీ, నజీం ఏడుస్తూనే వుంది. అవకాశం దొరికితే మానించి తప్పించుకుని పారిపోవాలని ప్రయత్నిస్తోంది. అలాటి పిచ్చిపని చేస్తే శివరాంకి పట్టిన గతే కుమార్‌కి పట్టుతుందనీ అంత చిత్రహింసతో కుమార్‌కి చావు తప్పతనవద్ద లేదనీ మాతో సహకరించి, అతని ప్రాణాన్ని సంరక్షించుకోమనీ చెప్పాను.

శివరాం పెట్టె, సంచీ అన్నీ వెతికితే ప్రొఫెసర్ వై.జి.శర్మ వ్రాసిన ఉత్తరం కనిపించింది. దాన్ని బట్టి ఆ వ్రాతప్రతి ప్రొఫెసర్‌కి శివరాం యిచ్చివుండాలని అనుమానం కలిగి వై.జి.శర్మ యింటికి వెళ్ళాము. ఏదో మిషమీద అతని భార్యనీ, పిల్లల్నీ యింట్లోంచి పంపించి, వై.జి.శర్మని అడిగాము. ఆ వ్రాతప్రతి పోయినంత మాత్రాన మీ దేశానికి నష్టం వుండదనీ, కుమార్ పరిశోధనలో గురువుగా వున్న తనకి ఆ పరిశోధన తాలూకు ప్రాథమిక సూత్రాలన్నీ తెలుసుననీ అన్నాడు. అందుకే అతన్ని వెంటనే షూట్ చేసి చంపేశాము. అంతలో మాకు వార్త వచ్చింది. మీరు శర్మ ఇంటికి వస్తున్నారని. టెలిఫోన్ డిస్కనెక్ట్ చేసి కాస్త దూరంలో ఆపిన మా కారుకి కనెక్ట్ చేశాము. తర్వాత విషయాలు మీకు తెలుసు'' అన్నాడు షకీర్.

''శివరాం నన్ను కలుసుకున్నప్పుడు నన్ను కేసు దర్యాప్తు చెయ్యమన్నాడు. వెంటనే నన్ను బెదిరిస్తూ మీరు ఎందుకు ఫోన్ చేశారు? మీ బెదిరింపుకి భయపడిపోయి దర్యాప్తు మానుకుంటాను అనుకున్నారా?'' అడిగాడు యుగంధర్.

''వాట్! నేను, మిమ్మల్ని బెదిరిస్తూ ఫోన్ చేశానా? యుగంధర్! మీ విషయం నాకు బాగా తెలుసు. అలా బెదిరిస్తూ ఫోన్ చేస్తే కేసులో మీకు ఆసక్తి లేకపోతే కలిగించినవాణ్ణి అవుతాను. నో! నేను కాని, నా అనుచరులు కానీ, మీకు అలా బెదిరిస్తూ ఫోన్ చెయ్యలేదు.''

## 16

జానీటా రాజుకి షేక్‌హ్యాండ్ యిచ్చింది. ''ప్రస్తుతానికి మనం యిద్దరం మిత్రులం. కుమార్ ఎక్కడున్నాడో తెలుసుకుని అతన్ని మా దేశానికి తీసుకు వెళ్ళడం నా లక్ష్యం. ఎవరూ తీసుకుపోకుండా చూడడం మీ లక్ష్యం. కుమార్ ఎక్కడున్నాడో తెలుసుకున్నాక మన స్నేహం పోతుంది. ఆ క్షణం నించీ మనం శత్రువులం. ఈ షరతుకి ఒప్పుకుంటారా?'' అడిగిందామె.

రాజు ''ఆల్ రైట్ అంగీకరిస్తాను'' అని ఒక నవ్వు నవ్వి ''నిన్ను కావిలించుకున్నప్పుడు అదే నీ మీద నేను పడినపుడు నీ గుండెల పక్కల మెత్తగా వుండవలసిన చోట ఏదో గట్టిగా తగిలింది. ఏమిటది?'' అడిగాడు రాజు.

''దట్ యీజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్'' అన్నది ఆమె కోపంగా.

''మై డియర్ జానీటా! మనం యిప్పటినుంచి ఫ్రెండ్సు అన్నావుగా. అది పిస్తోలా? కత్తా? ఏమిటది? ఐయామ్ క్యూరియస్'' అంటూ ఆమెని సమీపించి చెయ్యి ఆ చోట వేశాడు రాజు. ఆమె దూరం జరగబోయింది. రాజు ఆమెని అమాంతం చేతుల్లోకి లాక్కుని, గట్టిగా ముద్దుపెట్టుకుని ''చెప్పు, ప్రస్తుతానికి ఒకరికి ఒకరకం సహాయం చేసుకోవాలి'' అన్నాడు చెవిలో.

''అది పవర్‌ఫుల్ మినీ ట్రాన్స్‌మీటర్. దానిద్వారానే నా వునికి మా బాస్‌కి తెలుస్తుంది'' అన్నది జానీటా.

''వెరీగుడ్ ఏ వేవ్ లెంగ్త్ మీద?''

''అది నీకెందుకు? ఇది బ్రాడ్ కాస్టింగ్‌కి పనికిరాదు. నిర్విరామంగా సిగ్నల్ యిస్తుంది'' అన్నదామె.

అంతలో గదిలో వున్న ట్రాన్స్‌మీటర్ కుర్ కుర్ మనడం ప్రారంభించింది. రాజు జానీటాని ప్రశ్నార్థకంగా చూశాడు. ఒక కాయితం తీసుకుని దానిమీద కోడ్ వ్రాసి అతనికిచ్చి ''ఇదీ వాళ్ళు వుపయోగిస్తున్న కోడ్ గో ఆన్'' అని గదిలోంచి బయటికి వెళ్ళిపోయింది.

రాజు ట్రాన్స్‌మీటర్ ముందు కూర్చున్నాడు కోడ్‌కీ చూస్తూ. 'నేను సులేమాన్‌ని' అని కోడ్‌లో చెప్పాడు.

''ప్రెసిడెంట్ ఎలా వుంది ఆరోగ్యం?''

''పూర్తిగా కోలుకోలేదు కానీ కొంచెం నయం'' చెప్పాడు రాజు.

''హుస్సేన్‌ని పిలు''

రాజు క్షణంపాటు తటపటాయించాడు. హుస్సేన్‌ని పిలవలా వద్దా? తను సులేమాన్. యీ ముఠాకి నాయకుడయినపుడు హుస్సేన్ ఎందుకు? అయినా తప్పదు. తలుపు తెరిచి హుస్సేన్‌ని పిలిచాడు.

పేకాడుతున్న హుస్సేన్ పేకముక్కలు బల్లమీద పడేసి గదిలోకి వచ్చి "ఏమిటి సర్?" అడిగాడు.

"అధ్యక్షులు నిన్ను పిలవమన్నారు" అని "హుస్సేన్ వచ్చాడు" చెప్పాడు ప్రెసిడెంట్‌కి. "మీ డిపార్టుమెంటు డైరెక్టర్ సులేమాన్ ఆరోగ్యం సరిగా లేదు. జ్ఞాపకశక్తి తగ్గింది. కనుక తాత్కాలికంగా మీ గ్రూప్ నాయకత్వం నీకు ఒప్పచెపుతున్నాను. మళ్ళీ నేను ఆజ్ఞ యిచ్చిన తర్వాత నాయకత్వం సులేమాన్‌కి ఒప్పచెప్పు. అంతవరకూ సులేమాన్ నీ ఆజ్ఞానుసారం నడుచుకోవాలి. అర్థమయిందా?"

"యుగంధర్ విషయం ఇక పట్టించుకోకండి. వెంటనే మీరు అందరూ మీ కార్యస్థలం మూసేసి నాశనం చేసేసి కుమార్ని బంధించి వున్న ప్రదేశానికి వెళ్ళండి. అక్కడికి డైరెక్టర్ ఆఫ్ మిలిటరీ ఇంటెలిజెంట్ వస్తారు. ఈ కార్యక్రమమంతా మిలిటరీ ఇంటిలిజెంట్‌కి ఒప్పచెప్పాను. కుమార్‌నీ, మిమ్మల్నీ స్వదేశానికి తీసుకువచ్చే బాధ్యత వాళ్ళు తీసుకుంటారు. వెంటనే బయలుదేరండి."

"యస్ సర్."

హుస్సేన్ సులేమాన్‌ని (రాజుని) పరీక్షగా చూశాడు. "ఐయామ్ వెరీసారీ సర్" అన్నాడు.

"దానికేం, నా తర్వాత ఎలాగూ నువ్వే మన డిపార్టుమెంటు డైరెక్టర్‌వి. గో ఎ హెడ్" అన్నాడు రాజు.

బండార్కర్, స్వరాజ్యరావు, కాత్యా, మిలిటరీ ఇంటెలిజెంట్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటర్ ఆఫ్ వైర్‌లెస్ ట్రాకింగ్ యూనిట్స్ - అందరూ కూర్చునున్నారు యుగంధర్ కన్సల్టింగ్ రూంలో.

"సులేమాన్ నించి మనం తెలుసుకోవలసిన విషయాలు అన్నీ తెలుసుకున్నాము. అంతకన్నా ఆయన మనకి ఏమీ చెప్పరు. కుమార్ ఎక్కడున్నాడు? కుమార్‌ని దేశంలోంచి పాకిస్తానీయులు తీసుకుపోకుండా ఆపడం ఎలా? ఇదీ మన సమస్య. మీ సలహా ఏమిటి?" అడిగాడు యుగంధర్.

అవకాశం దొరికితే, వైర్‌లెస్ ద్వారా మనకి తన వునికి తెలియజేస్తానని రాజు చెప్పాడు ఏ ఫ్రీక్వెన్సీలో కాంటాక్ట్ చేస్తాడో తెలియదు కనుక రాజునించి వర్తమానం కోసం వైర్‌లెస్ ట్రాకింగ్ యూనిట్ వారికి ఈ విషయం తెలియచెయ్యాలి వెంటనే" అన్నది కాత్యా.

"యస్. వెంటనే ఆ ఏర్పాటు చేస్తాను" అంటూ ఆ డిపార్టుమెంటు చీఫ్ గదిలోంచి వెళ్ళిపోయాడు.

"ఆ వ్యాన్ ఎటు వెళ్ళిందో, ఎక్కడికి వెళ్ళిందో తెలుసుకోవడానికి మేము చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ తలవూపి "అవును. కుమార్‌ని ఎక్కడ బంధించినదీ వూహించడానికి కూడా అవకాశం లేదు. ఇంత పెద్ద దేశంలో ఏ మారుమూల వూళ్ళో వుంచారో. నా అనుమానం అల్లా"

"ఏమిటి?" అడిగాడు బండార్కర్.

"ఈపాటికి భారత, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతల వున్న ఏ వూరికో తీసుకువెళ్ళి వుండాలి. కుమార్‌ని మనదేశం నించి ఎత్తుకుపోవడమే వాళ్ళ ఉద్దేశం కనుక, యీ ప్రాంతాల వుంచి వుండరు" అన్నాడు యుగంధర్.

"నిజమే అయ్యుండవచ్చు. ఎక్కడని వెతకడం?"

"రాజు వాళ్ళకి దొరికిపోయాడా? ఇంకా తను సులేమాన్ అని వాళ్ళని మోసం చెయ్యగలుగుతున్నాడా? రాజు ద్వారా వాళ్ళ ఉనికి తెలిస్తే" అంటున్నాడు యుగంధర్.

"బాగానే వుంటుంది. అలాకాక రాజు వాళ్ళకి చిక్కిపోయి వుంటే?" అన్నాడు స్వరాజ్యరావు.

"రాజు సులేమాన్‌గానే వాళ్ళని మోసం చెయ్యగలుగుతున్నాడని అనుకుంటున్నాను. రాజే దొరికిపోయి వుంటే యీపాటికి మనకి కబురు వచ్చేది రాజుని అప్పచెపుతాము. సులేమాన్‌ని అప్పచెప్పమని" అన్నాడు యుగంధర్.

"ఆ ఏర్పాట్లు చేశాను" అంటూ వైర్‌లెస్ చీఫ్ వచ్చాడు.

"మిష్టర్ యుగంధర్. కుమార్‌ని ఎక్కడ బంధించినదీ సులేమాన్‌కి తెలిసివుండాలిగా" అడిగాడు మిలిటరీ ఇంటిలిజెన్స్ డైరెక్టర్.

యుగంధర్ తలవూపాడు.

"అతనిచేత చెప్పించలేమా?" అడిగాడు అతను మళ్ళీ.

"ఎలా? హింసించా?" అని నవ్వి, "హింసించినంత మాత్రాన నేను, బండార్కర్ దేశక్షేమానికి హానికరమైన విషయాలు శత్రువులకి చెపుతామా? సులేమాన్‌కి మాత్రం ఆపాటి దేశభక్తి వుండదా?" అడిగాడు యుగంధర్.

అంతలో హడావిడిగా గదిలోకి వచ్చాడు వైర్‌లెస్ ట్రాకింగ్ డిపార్టుమెంటు చీఫ్. "యుగంధర్ మీ ఊహ సరయినదేమోననిపిస్తోంది. మద్రాసు 'బి' వేవ్‌లెంగ్త్ మీద బీప్ బీప్‌మని నిర్విరామంగా కూత అడ్డం వస్తోందిట. అది ఎవరో ట్రాన్స్‌మీట్ చేస్తున్నారనీ, వెంటనే కనుక్కోమనీ మా డిపార్టుమెంటుకి కబురు చేశాను. మా డిపార్టుమెంటువారు అరగంట క్రితమే ఆ పనిమీద బయలుదేరారు" అన్నాడు. వెంటనే కాత్యా ట్రాన్సిస్టర్ స్విచ్ తిప్పింది. 'బి' వేవ్‌లెంగ్త్‌కి ట్యూన్ చేసింది. బీప్...బీప్...బీపీప్" "ఇది రాజు యిస్తున్న సిగ్నలే. ఇదే అతను ఇస్తానన్న సిగ్నల్" అన్నది కాత్యా సంతోషంగా.

"అయితే వెంటనే" అంటూ యుగంధర్ కుర్చీలోంచి లేచాడు.

"అందరూ రెడీ? ఊ పోదాం" అన్నాడు హుస్సేన్.

"ఈ ఇంటి విషయం ఏమిటి?" అడిగాడు రాజు.

"మిష్టర్ సులేమాన్. ఈ ఇంటిని పేల్చిపారేస్తున్నాను. మనం యీ యింట్లోంచి వెళ్ళిన అరనిముషం కల్లా యీ ఇల్లు పేలిపోతుంది. కింద డైనమైట్ పెట్టించాను" అన్నాడు హుస్సేన్.

"మిష్టర్ హుస్సేన్ ఇప్పుడు కమాండింగ్ ఆఫీసర్‌వి గనుక నేను ఎదురు చెప్పకూడదు కానీ అది వివేకమైన పనికాదు" అన్నాడు రాజు.

"ఏం?" అడిగాడు హుస్సేన్.

"ఇల్లు పేలిపోయిందంటే యీ ప్రాంతాల వాళ్ళు చూడరా? పోలీసులు రారా? వెంటనే మనకోసం వేట ప్రారంభించరా?" అడిగాడు రాజు.

"పోనీ పేల్చవద్దు. ఇలాగే వొదిలి వెళ్ళిపోదాం"

"అదీ ప్రమాదమే. ఒకవేళ మనం వెళ్ళిపోయిన తర్వాత, శత్రువులు ఈ ఇంట్లో ప్రవేశించి మన హెడ్‌క్వార్టర్సులో"

"ఆల్‌రైట్! మీ సలహా ఏమిటి?" అడిగాడు హుస్సేన్.

"టైంబాంబు ఏర్పాటు చేద్దాం. ఇరవై నాలుగు గంటల తర్వాత యీ ఇల్లు పేలిపోయేటట్టు"

"వెరీగుడ్ ఐడియా! కానీ ఏర్పాటు చెయ్యడం ఎలా?"

"మనవద్ద డైనమైట్ వుందన్నారుగా నేను ఏర్పాటు చేస్తాను" అన్నాడు రాజు.

"థాంక్యు. వెంటనే ఆ ఏర్పాటు చెయ్యండి" అని హుస్సేన్ చెప్పగానే రాజు, అందర్నీ ఆ ఇంట్లోంచి బయటికి వెళ్ళమన్నాడు. తను ఒక్కడే ట్రాన్స్‌మీటర్ వున్న గదిలోకి వెళ్ళి పవర్ ఆన్ చేసి మద్రాసు 'బి' వేవ్‌లెంగ్త్ మీదికి ట్రాన్స్‌మీటర్ ట్యూన్‌చేసి బీప్...బీప్ అని కూసేటట్టు ఏర్పాటు చేశాడు. తర్వాత ఒక కాయితం తీసి దానిమీద కొన్ని చుక్కలూ, గీతలూ పెట్టి గదిలోకి రాగానే కనిపించేటట్టు ట్రాన్స్‌మీటర్‌కి గుచ్చి, తలుపు తాళం వేసి బయటికి వచ్చాడు.

"ఆర్ యు రెడీ మిస్టర్ సులేమాన్?" అడిగాడు హుస్సేన్.

"యస్. రెడీ. సరిగ్గా ఇరవైనాలుగు గంటల తర్వాత ఇల్లు మొత్తం పేలి నేలమట్టం అవుతుంది" అన్నాడు రాజు.

"దట్ యీజ్ గుడ్ అప్పటికి దాదాపు వెయ్యిమైళ్ళదూరంలో వుంటాం" అని సంతోషంగా నవ్వాడు హుస్సేన్.

చాలా స్పీడుగా తనే డ్రైవ్ చేస్తున్నాడు యుగంధర్. పక్కన కాత్యాకూర్చునున్నది.

"రాజు ఆ ఇంట్లో వుంటాడంటారా?" అడిగింది కాత్యా.

"నేను ప్రస్తుతం ఏమీ వూహించను" అన్నాడు యుగంధర్. మద్రాసుకి ముప్పై మైళ్ళ దూరంలో వున్న ఒక చిన్నవూరు అది. ఊరికి కాస్త దూరంలో ఒక పెద్ద యిల్లు. ఆ ఇంటిముందు యుగంధర్ కారు ఆపాడు. అప్పటికే ఆ ఇంటిముందు పోలీసులు వున్నారు. యుగంధర్ కారు వెనకే స్వరాజ్యరావు జీపులో దిగాడు. మిలిటరీ వ్యాన్‌లోంచి బండార్కరూ, డైరెక్టర్ ఆఫ్ యింటలిజెన్స్ దిగారు.

"మేము లోపలికి వెళ్ళలేదు. ఇంటిచుట్టూ పోలీసులని కాపలా పెట్టాను. పురుగుకూడా బయటికి వెళ్ళకుండా" అన్నాడు స్థానిక పోలీస్ ఇన్స్‌పెక్టర్.

"వెరీగుడ్" అంటూ యుగంధర్ ఆ ఇంట్లోకి దారితీశాడు. అందరూ తలోకవైపూ వెళ్ళారు. రాజు పెట్టిన ఉత్తరం కనిపించింది. చుక్కలు, గీతలూ అది యుగంధర్, రాజుల మధ్య కోడ్

"కుమార్ బంధింపబడిన చోటికి వెళుతున్నాను. హుస్సేన్ ఇప్పుడు నాయకుడు. కుమార్ ఎక్కడ బంధింపబడ్డాడో తెలియదు. అమెరికన్ సి.ఐ.ఏ ఏజెంటుకూడా వుంది. రెండువందల మైళ్ళదూరం వరకూ బ్రాడ్‌కాస్ట్ చెయ్యగల మినీట్రాన్స్‌మీటర్‌తో వాళ్ళ అధికారులకి తన ఉనికి చెపుతోంది. వేవ్‌లెంగ్త్ 19.2 కేవలం సిగ్నల్" అంతే వుంది ఆ ఉత్తరంలో.

యుగంధర్ తన కారు దగ్గరికి పరిగెత్తాడు. కారులో వున్న రేడియో ఆన్ చేసి, 19.2 మీటర్స్‌కి ట్యూన్ చేశాడు. కి–కీ–కికీ–కికీ– అనే మోత నిర్విరామంగా వినపడుతోంది.

"గుడ్ యింకా రెండువందల మైళ్ళు దాటలేదు వాళ్ళు. కాత్యా! వైర్‌లెస్ ట్రాకింగ్ చీఫ్‌ని వెంటనే పిలు" అన్నాడు యుగంధర్.

క్షణంలో ఆ అధికారి వచ్చాడు. "ఈ సిగ్నల్ మనకి అందకుండా పోకూడదు. వాళ్ళకారులో వెళుతున్నారు. మనం వెంటాడాలి" అన్నాడు యుగంధర్.

"డోంట్ వర్రీ మా వ్యాన్ ఇక్కడే వుంది. ఏ వైపునుంచి సిగ్నల్ వస్తున్నదీ, బ్రాడ్ కాస్టింగ్ ఎటునుంచి చేస్తున్నదీ, దిక్కులు చూపించే యంత్రాలు మా వ్యాన్‌లో వున్నాయి. మా వెనకరండి" అని ఆ ఉద్యోగి తన వ్యాన్ ఎక్కాడు. వ్యాన్ బయలుదేరింది. వెనక యుగంధర్ క్రిజ్లర్ కారు, వెనక స్వరాజ్యరావు జీపు, తర్వాత మిలిటరీ వ్యాన్ బయలుదేరాయి.

హుస్సేన్ డ్రైవ్ చేస్తున్నాడు కారు. పైకి చూడడానికి పాతకారులా వున్న చాలా బలమైన యింజన్, బులెట్ ప్రూఫ్ అద్దాలు అని రాజు గ్రహించాడు. హుస్సేన్ పక్కన తను, తన పక్కన జానీటా, వెనక సీటులో నలుగురు వున్నారు. రెండువందల మైళ్ళకోసారి పెట్రోలు బంక్‌లో ఆగి, పెట్రోలు, ఆయిలు పోసుకుంటున్నారు. చిన్న చిన్న పల్లెటూళ్ళలో ఆగి తినడానికి, తాగడానికీ ఏవో కొంటున్నారు. ఈ ఏర్పాట్లతో రాజుకి ఏమీ సంబంధంలేదు. నాయకత్వం హుస్సేన్‌ది. రాజు వద్ద రెండుపిస్తోళ్ళున్నాయి. జానీటా వద్ద పిస్తోలున్నది. హుస్సేన్‌నీ, మిగతా నలుగురునీ వాళ్ళు అజాగ్రత్తగా వున్నప్పుడు కాల్చి చంపడమో, బందీలు చెయ్యడమో కష్టమైన పనికాదు రాజుకి. కానీ ప్రయోజనం యేమిటి? కుమార్ ఎక్కడున్నాడో అక్కడికి వెళ్ళడమే కదా తన ధ్యేయం.

తన సిగ్నల్ అందుకుని యుగంధర్ ఆ ఇంటికి వచ్చి తన ఉత్తరం చూసుకుని జానీటా సిగ్నల్‌ని ట్రేస్ చేసుకుంటూ వెనుక వస్తున్నారని ఆశించాలి. అంతకన్నా తను ఇప్పుడు ఏం చెయ్యలేడు. అలా యే సహాయమూ రాకపోతే కుమార్ బంధింపబడిన చోటికి వెళ్ళాక యేం చెయ్యాలో అప్పుడు అక్కడ ఆలోచించాలి.

కారు శరవేగంగా వెళుతోంది. తను, జానీటా విడిగా మాట్లాడుకోవడానికి అవకాశం లేదు. చిత్తూరు దాటేశారు. బెంగుళూరు సిటీలోకి వెళ్ళకుండా పక్కరోడ్డు వెంట వెళ్ళిపోయారు. మైసూరు రాష్ట్రం దాటేశారు. మరో రాష్ట్రంలోంచి వెళుతున్నారు. దాదాపు ఎనిమిది వందల మైళ్ళు ప్రయాణం చేశారు. గుజరాత్ రాష్ట్రం వచ్చింది. ఇంకా ఎంత దూరమని తను అడగడానికి వీలులేదు. తను సులేమాన్. తనకి తెలుసుండాలి.

రాజస్తాన్ రాష్ట్రంలో ప్రవేశించారు. అప్పుడు అర్థమవుతోంది రాజుకి. పాకిస్తాన్ భారత సరిహద్దు ప్రాంతాలకి వెళుతున్నామని.

అహమ్మదాబాదు నగరంలో ఒక పెట్రోలు బంక్‌లో ఆపాడు యుగంధర్ క్రిజ్లర్ కారుని. వెనక మిగతా కార్లు ఆగాయి. "మనకీ, వాళ్ళకీ వందమైళ్ళదూరం కూడా లేదు. సిగ్నల్ అందకుండా పోవడమనే భయంలేదు" అన్నాడు చీఫ్.

"థాంక్ యు. వాళ్ళు సరిహద్దు ప్రాంతాలకి చేరుకుంటున్నారు. కుమార్‌ని అక్కడెక్కడో బంధించివుండాలి. పెద్ద భవనంలో దాచివుంచారో, పూరిగుడిసెలో దాచివుంచారో మనం వూహించలేము. ఏర్‌ఫోర్స్ వారికి వర్తమానం పంపి తయారుగా వుండమని చెప్పాలి. అవసరమైతే, సరిహద్దుల ప్రాంతాల చిన్నయుద్ధమే అవసరమైతే దానికీ తయారుగా వుండాలి. సైనికాధికారులకి ఈ విషయం చెప్పి యీ సిగ్నల్ ఆధారంగా ఆ చోటుకి వెంటనే రమ్మని వార్త పంపండి. ఇతర చర్యలు తీసుకోమని మిలటరీ అధికారులకి చెప్పండి" అన్నాడు యుగంధర్.

సబ్ సాయిల్ వాటర్ రీసెర్చి సెంటర్. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అనే బోర్డు కనిపించింది రాజుకి. అప్పుడే చీకటి పడిపోతోంది. దరిదాపుల ఊరుగాని, యిళ్ళుగానీ లేవు. ఒక పెద్ద గేటు. ప్రహరీగోడ, లోపల దూరంగా ఒక పెద్ద మేడ. గేటు మూసివుంది. కారు ఆగగానే గేటు వెనకనించి ఒకతను వచ్చాడు. హుస్సేన్ ఉర్దూలో ఏదో చెప్పాడు. గేటు తెరిచాడు జవాను. కారు లోపలికి వెళ్ళిపోయింది. సరిహద్దు ప్రాంతాల ప్రభుత్వం నెలకొల్పిన యీ ఆఫీసుని శత్రువులు చేజిక్కించుకున్నారన్నమాట. ఆ ఆఫీసులో పనిచేస్తున్న వాళ్ళనందర్నీ బందీలుగా చేసి, తమ మనుష్యులని పెట్టారన్నమాట. సరిహద్దుకి దగ్గిరగా వున్న యీ కేంద్రాల్నీ వశపరచుకోవడంలో శత్రువుల తెలివితేటలకి రాజు మనస్సులో వాళ్ళని అభినందించాడు.

కారు ఆగగానే అందరూ దిగారు. తలుపు తెరుచుకుంది. లోపలికి వెళ్ళగానే హాల్లో మిలిటరీ యూనిఫాంలో వున్న నలభయి ఏళ్ళ మనిషి నిలుచున్నాడు. అతని పక్కన తుపాకీ పట్టుకుని ఒక సైనికుడున్నాడు.

"నేను హుస్సేన్‌ని" అన్నాడు హుస్సేన్.

"నేను యిక్కడికి వచ్చి ఇరవై నాలుగుగంటలైంది. మీరింకా రాలేదేమో అని ఆదుర్దాపడుతున్నాను. మిష్టర్ సులేమాన్?" అన్నాడు పాకిస్తాన్ మిలిటరీ అధికారి.

"యస్ సర్" అన్నాడు రాజు.

"మీ ఆరోగ్యం ఎలావుంది?"

"ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాను."

"అయితే మీ డిపార్టుమెంట్ ఆధిపత్యం మీకు మళ్ళీ ఒప్పగించమని అధ్యక్షులు చెప్పారు. ఐ కంగ్రాచ్యులేట్ యు. అవతల గదిలోకి రండి. మనం ఇద్దరం కలిసి వెళ్ళిపోయే పథకం ఆలోచించాలి" అన్నాడు మిలిటరీ ఆఫీసర్.

రాజు అతనుకూడా అవతల గదిలోకి వెళ్ళాడు. ఇంతవరకూ అదృష్టం తనవైపే వున్నది. తను సులేమాన్ కాడని ఎవరూ కనుక్కోలేదు. ఈ నాటకం ఇంకా ఎంతసేపు సాగుతుందో అనుకున్నాడు. గదిలో పాకిస్తాన్ మిలిటరీ అధికారి, రాజూ మాత్రం వున్నారు.

"మిష్టర్ సులేమాన్! సరిగ్గా రాత్రి తొమ్మిదిగంటలకి హెలికాప్టర్ వచ్చి మేడమీద దిగుతుంది. అందులో ఆరుగురే వెళ్ళవచ్చు. కుమార్, నజీం, మీరు, నేను, నా ఎయిడ్ హుస్సేన్. మనం ఆరుగురం వెళ్ళిపోదాం. మిగతా మీ పరివారాన్ని చెల్లాచెదురు అయిపొమ్మనండి. ఏదో విధంగా వాళ్ళ స్వంత బాధ్యత సరిహద్దు దాటి రమ్మనండి. టైం ఎనిమిదిన్నర అయింది. ఇంకో అరగంటే టైం వుంది. మీ ఏర్పాట్లన్నీ మీరు చేయండి. నేనూ, నా ఎయిడ్ డాబామీదికి వెళ్ళి, హెలికాప్టర్‌కి సిగ్నల్ యిస్తాము" అన్నాడు ఆ ఉద్యోగి.

"యస్. సర్. సరిగా ఆ సమయానికి మేము నలుగురం డాబామీదికి వస్తాము" అన్నాడు రాజు.

**యుగంధర్ క్రిజ్లర్** కారు ఆపాడు. మిగతా కార్లన్నీ ఆగాయి. "ఇక ఇరవైమైళ్ళ దూరంలో వున్నారు. సిగ్నల్ ఒకచోటనించే వస్తోంది. శత్రువులు ఒకచోట ఆగిపోయారన్నమాట" అన్నాడు వైర్‌లెస్ చీఫ్.

టార్చిలైటు వెలిగించి మ్యాప్ చూస్తున్నాడు భారత మిలిటరీ అధికారి. "ఈ ప్రాంతాల దాదాపు నలభైమైళ్ళ విస్తీర్ణంలో యిల్లేదీ లేదు. ఊరు లేదు. కేంద్ర ప్రభుత్వం సబ్ సాయిల్ రీసెర్చి స్టేషన్ తప్ప" అన్నాడు.

"ప్లీజ్ గివ్ ది మేప్" అని యుగంధర్ మ్యాపు తీసుకుని పరీక్షగా చూసి, కాయితం మీద లెక్కలు వేసి "సిగ్నల్ వస్తున్న దిశనుబట్టి, దూరాన్ని బట్టి యీ యిల్లే శత్రువుల స్థావరం అనుకోవచ్చు. మనం జాగ్రత్తగా ముందుకు సాగాలి. కార్ల హెడ్‌లైట్స్ వేయవద్దు. వీలయినంతవరకూ కార్ల యింజన్లు రైజ్ చెయ్యవద్దు. ఆర్మీవారికి కబురు పంపండి యీ విషయం. ఎయిర్‌ఫోర్స్‌ని రెడీగా వుండమనండి" అన్నాడు యుగంధర్.

"హుస్సేన్ తాళం చెవి యియ్యి" అడిగాడు రాజు.

"యస్ సర్"

"కాపీల వ్రాతప్రతి వున్న పెట్టె?"

"ఇదిగో సర్."

"మనవాళ్ళనందర్నీ అవతల గదిలోకి చేర్చు. ఇంకో అరగంటలో బయలుదేరుతున్నాం."

"యస్ సర్" అన్నాడు హుస్సేన్.

రాజు గుండె ఉరకలు వేస్తోంది. కుమార్ని చూడబోతున్నాడు. కుమార్ని పాకిస్తాన్‌కి హెలికాఫ్టర్‌లో తీసుకువెళ్ళకుండా ఎలా అడ్డుపడాలో యింకా స్పష్టంగా ఒక ఆలోచన అంటూ లేదు. ఆలోచించుకునేందుకు వ్యవధిలేదు. తలుపులు తెరిచాడు. కుమార్ కుర్చీలో కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నాడు.

నజీం అతని పక్కన నిలబడి అతను వ్రాస్తున్నది చూస్తోంది. రాజు తలుపు మూసి తాళం వేసేశాడు. నజీం ఏదో మాట్లాడబోయింది. రాజు మాట్లాడవద్దని సంజ్ఞ చేశాడు. కుమార్ బల్లవద్దకు వెళ్ళి అతని చేతిలో కలం తీసుకుని కాయితం మీద వ్రాశాడు. "నజీం కుమార్‌కి ఎంతవరకు తెలుసో నాకు తెలియదు. నువ్వు మీ వాళ్ళకి ఎదురు తిరిగావని తెలుసు. నిన్ను, కుమార్ని యీ రాత్రి పాకిస్తాన్‌కి హెలికాప్టర్లో తీసుకెళ్ళే ఏర్పాట్లు చేశారు. నేను డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటు రాజుని. సులేమాన్ వేషంలో వున్నాను. మీ యిద్దర్నీ పాకిస్తాన్‌కి తీసుకెళ్ళకుండా వుండేందుకు ప్రయత్నిస్తాను. మిమ్మల్ని ఈ గదిలో పెట్టి తాళం వేసి వెళ్ళిపోతున్నాను. నేను వెళ్ళిపోయిన ఇరవైనాలుగు గంటల లోపున భారత అధికారులు వచ్చి మిమ్మల్ని రక్షించని పక్షంలో" అంటూ జేబులోంచి ఒక చిన్నపెట్టె తీసి బల్లమీద పెట్టి "ఇది డైనమైట్. నజీం, నువ్వు శిక్షణ పొందిన గూఢచారిణివి. దీన్ని ఉపయోగించి యీ చెరలోంచి బయటపడండి కుమార్ పరిశోధన తాలూకు కాయితాలు నాలుగు కాపీలు వ్రాతప్రతి యీ పెట్టెలో వున్నాయి. వీటిని భారత అధికారులకి అప్పచెప్పవలసిన బాధ్యతనీది" అని వ్రాశాడు. నజీం తెల్లబోయింది. "క్విక్ విపులీకరించేందుకు వ్యవధి లేదు" నజీం చీరవిప్పి యిచ్చేసింది. పరికిణీతో నిలబడింది. "థాంక్ యు" అని చీర తీసుకున్నాడు రాజు.

"విష్ యు గుడ్‌లక్" అని వ్రాసింది నజీమ్.

రాజు గదిలోంచి బయటికి వచ్చేశాడు.

"మన కార్లు ఇక్కడ ఆపి కాలినడకన వెళ్ళడం మంచిది" అన్నాడు యుగంధర్. అందరూ కారుల్లోంచి దిగారు.

"ప్లీజ్, చప్పుడు చెయ్యకుండా ఆ ఇంటిని చుట్టుముట్టమని సైనికాధికారులకి తెలియజెయ్యండి" చెప్పాడు. యుగంధర్. మిలిటరీ అధికారి టూ వే రేడియోలో చెప్పాడు.

యుగంధర్, కాత్యా, బండార్కర్, స్వరాజ్యరావు, మిలిటరీ ఆఫీసర్ అందరూ కాలినడకన పిస్తోళ్ళు పట్టుకుని ముందుకి నడుస్తున్నారు.

రాజు గదిలోకి వెళ్ళగానే హుస్సేన్, అతనితోపాటు మిగతా పన్నెండుమందీ లేచి నిలుచున్నారు. వాళ్ళల్లో జానీటా కూడా వుంది. సిన్హా అని కుమార్‌తో చెప్పుకున్న అతనూ వున్నాడు.

"హుస్సేన్ నీతో విడిగా మాట్లాడాలి. జానీటా నువ్వు కూడా రా" అన్నాడు రాజు. ఇద్దరూ రాజుతో వెళ్ళారు.

ఇంకో గదిలోకి వెళ్ళి తలుపు మూశాడు రాజు.

హుస్సేన్ వెనక్కి తిరిగాడు. పిస్తోలు పిడితో అతని తలమీద ఒక పెద్ద దెబ్బకొట్టాడు రాజు. హుస్సేన్ కుప్పలా నేలమీదికి ఒరిగిపోయాడు.

"ఏమిటిది? ఏం చేస్తున్నారు?" అడిగింది జానీటా.

"కుమార్నీ, నజీంనీ పాకిస్తాన్ తీసుకుపోవడానికి హెలికాప్టర్ వస్తోంది. ఇప్పుడిక నీ విషయమూ, నా విషయమూ తేలాలి. నువ్వు ఎలాగూ కుమార్ని తప్పించలేవు. అమెరికాకి తీసికెళ్ళలేవు. నేను కుమార్ని పాకిస్థాన్కి తీసుకెళ్ళకుండా ప్రయత్నిస్తాను. నాకు సహాయం చేస్తావా? ఎదురు తిరుగుతావా?" అడిగాడు రాజు.

జానీటా చిన్న నవ్వు నవ్వింది. "పాకిస్తాన్కీ, చైనాకీ చాలా స్నేహం. కుమార్ పరిశోధన ఫలితాలు అమెరికాకి దక్కితే సరి. లేదా భారతదేశంలోనే ఉండనివ్వాలి. పాకిస్తాన్కీ తద్వారా చైనాకీ దక్కనివ్వకూడదని నాకు ఆజ్ఞ కనుక నీకు నా పూర్తి సహకారం వుంది. గో ఎ హెడ్ నన్నేం చెయ్యమంటావు?" అడిగింది.

"అవతల గదిలోకి వెళ్ళు. వాళ్ళని అక్కడే వుండమని చెపుతాను. ఒకవేళ నా ఆజ్ఞ ఉల్లంఘిస్తే షూట్ చెయ్యి. వెళ్ళి జాఫర్ని తీసుకురా" అన్నాడు రాజు.

జాఫర్ రాగానే తలుపు మూసి అతన్ని తలమీద ఒక దెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకి అతనూ కిక్కురుమనకుండా కిందపడ్డాడు. వెంటనే తను నజీం దగ్గర తీసుకున్న చీర అతనికి కట్టాడు. గదిలోంచి బయటికి వెళ్ళి అటూ యిటూ చూశాడు. హాలు పక్కన ఆ ఇంటి ఎలక్ట్రిక్ మెయిన్ కనిపించింది. మెయిన్ స్విచ్ లాగాడు. ఇల్లంతా చీకటైంది.

సరిగ్గా అదే సమయానికి దూరాన్నించి ఇంజన్ హోరు వినిపించడం ప్రారంభించింది.

"సులేమాన్! క్విక్. హెలికాప్టర్ దిగుతోంది" అరిచాడు పాకిస్తాన్ మిలిటరీ అధికారి.

"వస్తున్నాను" జవాబు చెప్పాడు రాజు.

యుగంధరూ, తదితరులూ ఆ యింటి గేటు దగ్గరకి చేరుకున్నారు. "గేటు తెరవడానికి ప్రయత్నించవద్దు. నేను గోడదూకి వెళ్ళి గేటు జవానుంటే తన్ని" అని యుగంధర్ ప్రహరీగోడ ఎక్కి అవతలికి దూకాడు. అంతా చీకటి. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించడం లేదు. గేటు వైపు వెళ్ళాడు. ఎవరన్నా వున్నారేమో తెలుసుకునేందుకు ఒక చిన్న రాయి తీసి విసిరాడు.

"ఎవరు?" టార్చిలైటు వెలిగింది. అంతే. యుగంధర్ సైలెన్సర్ వున్న పిస్తోలుతో ఆ జవానుని షూట్ చేశాడు. తర్వాత గేటు తెరిచాడు. బండార్కర్, స్వరాజ్యరావు, కాత్యా, మరికొందరు ఆర్మీ ఆఫీసర్లు లోపలికి వచ్చారు.

"చప్పుడు చెయ్యకుండా నడవండి. లోపల ప్రవేశించాలి" అన్నాడు యుగంధర్. అంతలో యింజన్ హోరు వినిపించింది యుగంధర్కి. పైకి చూశాడు.

"హెలికాప్టర్. మనం కాస్త ఆలస్యంగా వచ్చామేమోనని భయంగా వుంది" అన్నాడు.

"వాట్ యీజ్ దిస్? ఏమిటి ఆలస్యం?" అరిచాడు పాకిస్తాన్ మిలటరీ ఆఫీసర్.

"కుమార్ ఎదురు తిరిగాడు. స్పృహ పోగొట్టి" రొప్పుతూ తను మోసుకుని వస్తున్న మనిషిని హెలికాప్టర్లో పడేశాడు రాజు.

"నజీం ఏదీ?" అడిగాడు.

"నజీంని కూడా తీసుకువచ్చాను. ఆమెకీ స్పృహ పోగొట్టవలసి వచ్చింది" అంటూ రాజు రెండడుగులు వెనక్కి వేసి, యింకో ఆకారాన్ని ఎత్తి హెలికాప్టర్లో పడేశాడు. అంతా చీకటి. ఆ చీకట్లో గాలికి ఎగురుతున్న చీరకొంగు మాత్రం కనిపించింది ఆ మిలటరీ అధికారికి.

"కమ్ ఆన్! హుస్సేన్ ఏడీ?" అడిగాడు.

"హుస్సేన్‌ని పైకి రమ్మని చెప్పాను. రాలేదా?"

"అంతలో దూరాన్నించి ఏదో ప్లేను ఇంజను హోరు వినిపిస్తోంది. "గుడ్‌గాడ్ భారతీయులకి తెలిసిపోయిందిలా వుంది. భారత విమానాలు వస్తున్నాయి. క్విక్ లెట్ హుస్సేన్ గో టు హెల్. పోదాం" అంటూ ఆ మిలీటరీ అధికారి రాజు చెయ్యి పట్టుకుని, హెలికాప్టర్‌లోకి ఎక్కాడు. పైలెట్ హెలికాప్టర్‌ని పైకి తీస్తున్నాడు.

యుగంధరూ, తదితరులూ ఆగిపోయారు పైకి లేస్తున్న హెలికాప్టర్ని చూస్తూ.

"వి.ఆర్ టూ లేట్. ఇంత ప్రయాసా వృధా అయిపోయింది" అన్నాడు యుగంధర్ నిస్పృహతో దూరాన్నించి వస్తున్న ఇండియన్ ఏర్‌ఫోర్స్ విమానాలని చూసి.

"దిగులుపడకండి. సరిహద్దు దాటనివ్వరు మన వైమానికులు. షూట్ చేస్తారు" అన్నాడు బండార్కర్.

"కుమార్ శత్రువులకి దక్కలేదనే తృప్తి మిగులుతుంది" అన్నాడు యుగంధర్.

అంతలో పైకి లేస్తున్న విమానంలోంచి, దీపం వెలుగు కనిపించింది. యుగంధర్ దృష్టి ఆ వెలుగుమీద నిలిచింది. ఆరి, ఆరి, ఆరి ఆరి మళ్ళీ వెలుగుతోంది దీపం.

హెలికాప్టర్ పైకి వెళ్ళిపోతోంది. ఇండియన్ విమానాలు వస్తున్నాయి. అంటే యుగంధర్ తదితరులు. ఆ స్థావరాన్ని తెలుసుకుని వచ్చివుండాలి అనుకున్నాడు రాజు. హెలికాప్టర్ ముందు సీటులో పాకిస్తాన్ మిలిటరీ ఆఫీసర్, అతని ఎయిడ్ కూర్చునున్నారు. వెనకసీటులో స్పృహలేని హుస్సేన్, చీరకట్టిన పాకిస్తాన్ ఏజెంట్ పడివున్నారు. రాజు జేబులోంచి టార్చిలైట్ తీసి, కిందికి వెలుగు వేసి, ఆర్పి ఆర్పి వెలిగిస్తూ కోడ్‌లో చెపుతున్నాడు.

"బండార్కర్! హెలికాప్టర్‌లోంచి సిగ్నల్ యిస్తున్నది రాజు" అరిచాడు యుగంధర్.

"కుమార్, నజీం యింట్లోనే వున్నారుట. పధ్నాలుగుమంది శత్రువుల ఏజెంట్లు, తుపాకీలతో యింట్లో వున్నారుట."

"తను?" అడిగాడు బండార్కర్.

"సిగ్నల్స్ సగంలో ఆగిపోయాయి. టార్చి కిందపడింది" చెప్పాడు యుగంధర్.

రాజు కిందకి చూసి టార్చిలైటుతో సిగ్నల్ యిస్తున్నాడు. మనస్సంతా దానిమీద లగ్నం చేస్తున్నాడు. చేతిలో వున్న టార్చిమీద దెబ్బ పడింది. టార్చి కిందపడింది. రాజు వీపులో పిస్తోలు ఆనింది. "ఎవరు నువ్వు? ఎవరికి సిగ్నల్ యిస్తున్నావు?" అన్నాడు మిలిటరీ ఆఫీసర్.

"నేనా? సులేమాన్‌ని... మనవాళ్ళకి"

"ఇతన్ని నీ పిస్తోలుతో కాచుకో" అని మిలటరీ ఆఫీసర్ తన టార్చి వెలుగురాజు మొహం మీద వేశాడు. "హుస్సేన్, జాఫర్ స్పృహ లేకుండా పడివున్నారు. కుమార్, నజీమ్ కారు. మోసం, యు రాస్కెల్. ఎవరు నువ్వు?" అంటూ రాజుని జుట్టుపట్టుకుని లాగడు. రాజు పెట్టుకున్న విగ్ కిందపడింది.

"చెప్పు. ఎవరు నువ్వు?"

యుగంధర్ తదితరులు ఆకాశంవైపు చూస్తున్నారు. ఆకాశంలో, భారత విమానాల్లోంచి గుళ్ళు పేలుతున్నాయి. యుగంధర్ గుండె ప్రతి పేలుడికీ ఆగిపోతున్నట్టువుంది. ఆ హెలికాప్టర్లో రాజు వున్నాడు రాజు. అదీ ఆవేదన. "సారీ సర్.. హెలికాప్టర్ సరిహద్దు దాటేసిందిట. మన విమానాలు సరిహద్దు దాటి వెళ్ళలేవుట" అన్నాడు సైనికాధికారి.

"థాంక్ గాడ్" అన్నాడు యుగంధర్.

ఆ యింటిని చుట్టుముట్టారు భారత సైనికులు. లైట్ మెషిన్ గన్స్, మార్టర్స్ తెచ్చారు. ఆ యింట్లోంచి బయట వాళ్ళమీద గుళ్ళ వర్షం కురుస్తోంది.

"లొంగిపొండి. ఎంతకాలం మీరు యుద్ధం చెయ్యగలరు" అరిచాడు లౌడ్ స్పీకర్లోంచి ఆర్మీ ఆఫీసర్. జవాబుగా మళ్ళీ గుళ్ళవర్షం కురిసింది. యుగంధర్ చీకట్లో వెళ్ళిపోతున్నాడు.

"ఎక్కడికి?" అడిగాడు బండార్కర్.

"పాకిస్తాన్ గూఢచారులు కాదు మనకి కావలసింది. ఆ యింట్లో వున్న కుమార్. ఇలా చాలాసేపు యుద్ధం జరిగితే శత్రువులు కుమార్ని చంపెయ్యవచ్చు. రాజు తన ప్రాణాన్ని అకారణంగా బలి యిచ్చిన వాడవుతాడు."

"రాజు...ఇక"

"నాకు నమ్మకం లేదు. శత్రువులు రాజుని ప్రాణాలతో వుండనివ్వరు" అన్నాడు యుగంధర్.

యుగంధర్ కంఠస్వరంలో జీరలేదు. దుఃఖం లేదు. ఒకరకమైన వైరాగ్యం స్ఫురిస్తోంది. చీకట్లో నీడలా వెళ్ళిపోయాడు. గుళ్ళు తగలకుండా నేలమీద పాక్కుంటూ జరిగాడు. ఆ యింటిని సమీపించాడు.

వెనక తలుపు దగ్గిర ఆగాడు క్షణంపాటు. నెమ్మదిగా లేచి తోశాడు. తలుపు లోపల గడియ వేసి వుంది. ఒక తన్ను తన్నాడు. తలుపు ఫెళఫెళా విరిగి కిందపడింది. "వెనకనుంచి శత్రుసైన్యం వస్తోంది తప్పుకోండి" అరిచారు లోపల ఎవరో. శత్రువులు మోసపోయారు. ఇల్లంతా చీకటిగా వుంది.

"ఎవరు?" దగ్గర్లో ఎవరో ప్రశ్నించారు.

"నేను" యుగంధర్ ఉర్దూలో జవాబు.

"ఇటురా" అవతల మనిషి మాట. వెంటనే అతన్ని పేల్చేశాడు. మరి రెండడుగులు వేశాడు. వీధి తలుపు వైపు వెళ్ళాలి. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తున్నాడు. ఎవరిదో చెయ్యి తగిలింది. పిస్తోలు పేల్చాడు. చీకట్లో అస్పష్టంగా కనిపిస్తోంది. అదే తలుపు అయివుండాలి. వెళ్ళాడు. పాక్కుంటూ కింద గడియ తీస్తున్నాడు. 'ధాం ధాం' వెనకనించి పిస్తోళ్ళు పేలాయి. ఎక్కడెక్కడో వేడిగా, మందుగుళ్ళు శరీరంలో దిగబడుతున్నాయి. ఇక తను బతకడు. అయిపోయింది. శరీరం తూట్లు పడిపోతోంది. గడియ తియ్యాలి. కారిపోతోంది రక్తం. బలం కూడదీసుకుని, పై గడియలాగి తలుపు తెరిచాడు. బార్లా తెరిచాడు. తెరిచి అక్కడే కుప్పగా కూలిపోయాడు.

తలుపు తెరుచుకోగానే భారత సైనికులు, బండార్కర్, కాత్యా, తదితరులు పరిగెత్తారు. శత్రువులు తమ స్థావరం వశం అయిపోతున్నదని తెలిసి చేతులు పైకి ఎత్తి, తుపాకీలు పారేశారు. టార్చిలైట్లు వెలిగాయి. ఎవరో మెయిన్ స్విచ్ వేశారు. ఇంట్లో దీపాలు వెలిగాయి.

"యుగంధర్ ఏరి?" అడిగింది కాత్యా.

అప్పటివరకూ ఎవరూ చూడలేదు రక్తపు మడుగులో తలుపు పక్కన పడివున్న యుగంధర్ని.

"యుగంధర్" అంటూ ఒక పొలికేక పెట్టింది కాత్యా.

"మొగాడ్! ఎంత సాహసం చేశారు?" అంటూ బండార్కర్ ఒక్క పరుగుతీశాడు.

ఆర్మీ ఆఫీసర్ ఒక్క అంగలో చేరుకున్నాడు.

"థాంక్‌గాడ్ గుళ్ళన్నీ కాళ్ళకి, తొడలకి తగిలాయి. అందుకే రక్తం అంతకారింది. పైన ఎక్కడా ఒక్క గుండూ తగలలేదు. ప్రాణానికి భయంలేదు" అన్నాడు.

వారం రోజులు గడిచిపోయాయి. కుమార్‌నీ, నజీంనీ, బండార్కర్ తన ఆధీనంలోకి తీసుకున్నాడు. కాళ్ళకి కట్లు, తొడలకి కట్లు. పడుకున్నాడు యుగంధర్ తన యింట్లో. బండార్కర్ యుగంధర్ పక్కనే కూర్చునున్నాడు.

బజర్ చప్పుడయింది. కాత్యా వెళ్ళి ఒక యువతితో తిరిగివచ్చింది.

"నా పేరు జానీటా."

"యస్!" అన్నాడు యుగంధర్.

"నేను సి.ఐ.ఏ ఏజెంటుని. నా సిగ్నలు.."

"తెలుసు" అన్నాడు యుగంధర్.

"రాజు పాకిస్తాన్‌లో జైలులో వున్నాడు. సులేమాన్‌ని మీరు బహిరంగంగా విచారణ చేసి, శిక్ష విధిస్తే అదేవిధంగా వున్నవీ, లేనివీ కల్పించి రాజునీ పాకిస్తాన్‌లో విచారణ జరిపి మరణశిక్ష విధిస్తారుట. పాకిస్తాన్‌లో మా ఏజెంటుద్వారా తెలిసింది యీ విషయం."

"నేనేం చెయ్యను? అన్నాడు యుగంధర్.

"సులేమాన్‌ని తమకు ఒప్పచెపితే, రాజుని మీకు ఒప్పచెపుతారుట. ప్రాణానికి ప్రాణం."

యుగంధర్ నీరసంగా నవ్వాడు. "ఎన్నిసార్లు యీ ప్రాణానికి ప్రాణం. పాకిస్తాన్ ప్రభుత్వంతో బేరానికి రావడానికి సులేమాన్ నా బందీ కాడు. భారత ప్రభుత్వానికి అప్పచెప్పాను."

"మిస్టర్ యుగంధర్ ఏమిటిది రాజుని మీరు బలి యిస్తారా?" అడిగింది జానీటా కన్నీళ్ళతో.

యుగంధర్ కళ్ళు చెమ్మగిల్లాయి. "నా ప్రాణం, రాజు ప్రాణం కన్నా దేశం ముఖ్యం" అన్నాడు.

"మిష్టర్ యుగంధర్ దయచేసి ఈ బేరం ఒప్పుకోండి. సులేమాన్ ప్రాణం కన్నా రాజు ప్రాణం వెయ్యిరెట్లు ఎక్కువైంది. ప్లీజ్."

"బండార్కర్ మీరు ప్రభుత్వోద్యోగి."

"నా స్వంత బాధ్యతమీద ఈ నిర్ణయం తీసుకున్నాను. మీకు ఆరోగ్యం సరిగాలేదు. నేను చూసుకుంటాను" అన్నాడు బండార్కర్.

"దట్ యాజ్ వెరీగుడ్ ఆఫ్ యు సర్. ఎప్పుడు, ఎక్కడ సులేమాన్, రాజులని మార్చుకునేదీ నేను మా అధికారులతో సంప్రదించి వివరాలు మీకు తెలియచేస్తాను. ఐ లైక్ రాజు" అని జానీటా వెళ్ళిపోతోంది.

"ఒక్క క్షణం" అన్నాడు యుగంధర్. జానీటా తలుపు దగ్గిర ఆగింది. "ఈ కేసులో జోక్యం కల్పించుకోవద్దని నన్ను బెదిరించినది" అంటున్నాడూ యుగంధర్.

"నేనే ఎందుకా? కుమార్ పాకిస్తాన్‌కి దక్కితే, వాళ్ళద్వారా చైనాకి యీ రహస్యం చేరుతుందని."

యుగంధర్ తలవూపాడు జానీటా వెళ్ళిపోయింది.

ఇంకో నాలుగురోజులు గడిచాయి. సులేమాన్‌ని బండార్కర్ తీసుకు వెళ్ళిపోయాడు. యుగంధర్ టెలిఫోన్ వద్ద కాచుకుని వున్నాడు. రాజుని గురించిన కబురు ఎప్పుడు వస్తుందా అని. టెలిఫోన్ మోగినప్పుడల్లా యుగంధర్ గుండె ఉరకలు వేస్తోంది. ఇంకా క్రర్రల సహాయంతోనే లేచి నిలబడగలుగుతున్నాడు.

"రాజు వస్తాడు. తప్పకుండా. మీరు అలా" కాత్యా యుగంధర్‌కి ధైర్యం చెపుతోంది.

యుగంధర్ నవ్వుతాడు బలహీనంగా.

టెలిఫోన్ మోగింది. కాత్యా రిసీవర్ తీసుకుంది.

క్షణం తర్వాత సంతోషంగా "రాజు వచ్చేశాడు. విమానాశ్రయం నించి తనే ఫోన్ చేశాడు" అన్నది. యుగంధర్ మొహంలో వెలుగు వచ్చింది. క్రర్రల సహాయంతో లేచివెళ్ళి కిటికీ దగ్గర నిలుచున్నాడు రాజు రాకకోసం.

అరగంట తర్వాత ఇంటిముందు టాక్సీ ఆగింది. రాజు, బండార్కర్ దిగారు.

రాజు లోపలికి వచ్చీ రావటంతో యుగంధర్ ముందుకి వెళ్ళి, క్రర్రల సహాయంతో నిలబడ్డ యుగంధర్ని చూశాడు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

"సర్ ఎలా వుంది?" అంటున్నాడు.

"రాజూ సులేమాన్ ప్రాణానికి నా ప్రాణం బేరం ఒప్పుకోవద్దని నీకు నేను ఆదేశం యిచ్చాను. నువ్వు నా ఆజ్ఞ ఉల్లంఘించావు. జ్ఞాపకముందా?"

రాజు తలూపాడు.

"దట్ యీజ్ ఇన్ సబ్ ఆర్డినేషన్. యు ఆర్ డిస్మిస్డ్ నువ్వు నాకు ఇక అసిస్టెంట్‌గా అవారంలేదు."

"యస్ సర్" అన్నాడు రాజు. కాత్యా నవ్వుతోంది. రాజు కూడా నవ్వు ఆపుకుంటున్నాడు.

"యు రాష్ ఫెలో వెళ్ళు వెళ్ళి 'ఏమన్నా" సంతోషం పట్టలేక రాజుని కావలించుకున్నాడు యుగంధర్.

ఊఊఊ